PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 321 | విజయవాడ, గురువారం 22 జూన్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 22 June 2023 | Rs

సమస్యలు వింటూ.. భరోసానిస్తూ..

- రెండోరోజు దిగ్విజయంగా పోలవరం పోరుకేక మహా పాదయాత్ర
- అడుగడుగునా గిరిజనుల నీరాజనం

3

చల్లబడ్డ రాష్ట్రం.. పలు చోట్ల వర్షాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాల విస్తరణతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. జూన్ మూడోవారంలోకి వచ్చినా నిండు వేసవిని తలపించే ఉష్ణోగ్రతలు, వడగాడ్పులతో తీవ్ర ఇబ్బందులకు గురైన ప్రజలకు ఈ వర్షాలతో పెద్ద ఊరట లభించింది. బుధవారం రాష్ట్రంలోని పల్నాడు, ఎన్‌టిఆర్ జిల్లా, ప్రకాశం, సత్యసాయి జిల్లాలతోపాటు మొత్తం 39 ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయి. పల్నాడు జిల్లా ఖంబంపాడులో 105 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. ఎన్‌టిఆర్ జిల్లా మొగులూరులో 90 మిల్లీమీటర్లు, సత్యసాయి జిల్లా కదిరిలో 81.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గురువారం శ్రీకాకుళం, పార్వతీపురం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం వుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం వుందని పేర్కొంది.

23 నుండి ఇంటింటికీ వెళ్లండి

- పథకాలు అందని వారిని జగనన్న సురక్షలో చేర్చండి
- 20 మంది ఎమ్మెల్యేల పనితీరు అధ్వానం
- పార్టీ సమీక్షలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రానున్న తొమ్మిది నెలలు ఎంతో ముఖ్యమని, అంతా ప్రజల్లో వుండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో పథకాలు అందని లబ్ధిదారులు ఎవరైనా వుంటే గుర్తించేందుకు ఈ నెల 23 నుండి మొదలవుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో గుర్తించి పథకాలను వర్తింపజేయాలని అన్నారు. ఎన్ని పర్యాయాలు చెప్పినా పనితీరును ఏమాత్రం మెరుగుపర్చుకోని ఎమ్మెల్యేలు 20 మంది వున్నారని, ఈ సమావేశం అయ్యాక వారికి నేరుగా సమాచారాన్ని వ్యక్తిగతంగా చేరవేస్తామని తెలిపారు. వచ్చే సమావేశం నాటికి పనితీరును మెరుగుపర్చుకోకపోతే ప్రత్యామ్నాయం చూసుకుంటామని అన్నారు. బుధవారం తాడేపల్లిలోని సిఎం క్యాంప్ కార్యాలయంలో వైసిపికి చెందిన ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, రీజనల్ కో-ఆర్డినేటర్లు, పార్టీ జిల్లా అధ్యక్షులతో జగన్‌మోహన్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. పార్టీ యంత్రాంగం మొత్తం ఇకపై గడపగడపకు కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలన్నారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా ఈ నాలుగేళ్లలో ఎన్నో కార్యక్రమాలను తీసుకొచ్చామన్నారు. రాష్ట్రంలో మన ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గ్రామీణ ప్రాంతంలో అయితే 92 శాతం, పట్టణ ప్రాంతాల్లో అయితే 84 శాతం కుటుంబాలకు అందుతున్నాయని తెలిపారు. సగటున 87 శాతం కుటుంబాలకు మనం ఇస్తున్న సంక్షేమ పథకాలు చేరుతున్నాయన్నారు.

రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఇప్పటికీ పథకాలు అందని వారుంటే వారిని గుర్తించేందుకే జగనన్న సురక్ష ఎతెచ్చామన్నారు. ఈ నెల 23న జగనన్న సురక్ష కార్యక్రమంపై వలంటీర్లకు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ నెల 24 నుంచి నెల రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న సురక్ష

'జగనన్న సురక్ష' అవగాహన కార్యక్రమంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలదండ వేస్తున్న జగన్

పథకాన్ని చేపట్టాలన్నారు. పథకాలకు అర్హులు అయ్యేందుకు అడ్డంకులు వుంటే వాటిని తొలగించాలన్నారు. 11 రకాల ధ్రువపత్రాలు కావాల్సిన వారి వివరాలు తీసుకుని వెంటనే జారీ చేయాలని సూచించారు. రేషన్ కార్డుల్లో పేర్లు జతచేయడం, కార్డు విభజన తదితర కార్యక్రమాలు చేయాలని ఆదేశించారు.

దరఖాస్తు చేసిన వారి కుల, ఆదాయ ధ్రువీకరణ, జనన, మరణ, వివాహ, తదితర ధ్రువపత్రాలు ఇంటికి వెళ్లి జారీ చేయాలని సూచించారు. గత ప్రభుత్వ పాలన, మన ప్రభుత్వంలో జరిగిన కార్యక్రమాలను నాడు-నేడు ద్వారా ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రంలో కోట్లమందికి మన ప్రభుత్వంతో మేలు జరుగుతుందని వారంతా మనపై ఆధారపడి వున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో 175కు 175 మనం గెలవాలన్నారు. ఇందుకు ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాలనూ జయప్రదంగా నిర్వహించాలన్నారు. ఎమ్మెల్యేల పనితీరు బాగోలేక టికెట్లు రాకుంటే తనను బాధ్యుడిని చేయొద్దన్నారు. కొంతమంది ఎమ్మెల్యేల పనితీరు బాగోలేకపోతే కొనసాగించడం వల్ల వారికీ నష్టం, పార్టీకి నష్టమని అన్నారు. సర్వే చేసినప్పుడు మీమీ గ్రాఫ్‌లు బలంగా ఉండేలా పనితీరును మెరుగుపర్చుకోవాలన్నారు. ఇందుకోసం గడపగడపకు కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. కార్యకర్తలను, గృహసారథులను సమన్వయం చేసుకుంటూ నిరంతరం ప్రజల్లో వుండాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరుపై ముఖ్యమంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. సమావేశంలో వైసిపి ప్రధాన కార్యదర్శి వి విజయసాయిరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆ రూ.120 కోట్లు ఆప్కోకు ఇవ్వండి

- లేదంటే సబ్సిడీని రుణంగా పరిగణిస్తాం
- రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్‌సిడిసి తాఖీదు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర పరిశ్రమలశాఖ తమ వద్ద తీసుకున్న రూ.120 కోట్లు ఆప్కోకు ఇవ్వాలని జాతీయ సహకారాభివృద్ధి సంస్థ (ఎన్‌సిడిసి) ఆదేశించినట్లు తెలిసింది. లేదంటే సబ్సిడీ మొత్తాన్ని కూడా రుణంగా పరిగణిస్తామని హెచ్చరించింది. తీసుకున్న రుణానికి సంబంధించిన అక్నాలెడ్జ్‌మెంటు ఇప్పటి వరకు తమకు అందలేదని, రుణదాత రాష్ట్రానికి లేఖ రాసింది. రాష్ట్రంలో చేనేత కార్మికులకు అందించే సహాయానికి ఎన్‌సిడిసి నుంచి రూ.120 కోట్లను పరిశ్రమల శాఖలోని చేనేత, టెక్స్‌టైల్స్ విభాగం (ఆప్కో) ద్వారా రుణంగా తీసుకుంది. ఇందులో రూ.96 కోట్లు రుణంగా, రూ.24 కోట్లు సబ్సిడీ ఉంది. ఈ నిధులను ఆప్కో వ్యాపారాభివృద్ధి కోసం వినియోగించుకోవాల్సి ఉంటుందన్నది ఎన్‌సిడిసితో చేసుకున్న ఒప్పందం. అయితే ఈ మొత్తం రుణానికి సంబంధించి ఇప్పటివరకు ఏం జరిగిందో రాష్ట్రం నుంచి సమాచారం కేంద్ర సంస్థకు చేరలేదని అధికారులు అంటున్నారు.

రుణం తీసుకున్న వెంటనే దానికి సంబంధించి అక్నాలెడ్జ్‌మెంటు రాష్ట్రం నుంచి ఎన్‌సిడిసికి అందలేదు. తీసుకున్న రుణాన్ని తక్షణమే చేనేత లబ్ధిదారులకు అందించాలన్నది కూడా ఒక నిబంధనగా ఉంది. తక్షణమే రుణం నిధులు అందినట్లుగా, అలాగే లబ్ధిదారులకు అందించినట్లు వివరాలు సమర్పించాలని రాష్ట్రానికి రాసిన లేఖలో కోరింది. లేనిపక్షంలో సబ్సిడీగా పేర్కొన్న రూ.24 కోట్లను రుణంగా పరిగణిస్తామంటూ ఆ లేఖలో తేల్చిచెప్పడం గమనార్హం. ఈ నిధులను ఆప్కోకు బదలాయించాలని కూడా సూచించింది.

ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయ ఆవరణలో వివిధ దేశాల ప్రతినిధులతో కలిసి యోగా చేస్తున్న ప్రధాని మోడీ

యోగా అంటే సమైక్యతే !

- ఇదొక జీవన విధానమన్న ప్రధాని మోడీ
- ఐరాస ప్రధాన కార్యాలయంలో అంతర్జాతీయ యోగా వేడుకలు

న్యూయార్క్, వాషింగ్టన్: ప్రశాంతమైన, పరిశుద్ధమైన, హరితమయమైన ప్రపంచాన్ని నిర్మించేందుకు యోగా శక్తి సామర్థ్యాలను ఉపయోగించుకోవాలని ప్రధాని నరేంద్ర మోడీ ఉద్బోధించారు. యోగా అనేది ఒక జీవన విధానమని, ఆరోగ్యం, శ్రేయస్సుకు ఇదొక సమగ్ర దృక్పథమని అన్నారు. మన ఆలోచనలు, కార్యాచరణ అన్నీ బుద్ధిపూర్వకంగా వుండేందుకు ఇదొక మార్గమని వ్యాఖ్యానించారు. మనతో మనం, ఇతరులతో, ప్రకృతితో సామరస్యంగా జీవించేందుకు ఇదొక మార్గమన్నారు. యోగా అంటే సమైక్యత అని అర్థమన్నారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం నాడిక్కడకు చేరుకున్న ఆయన బుధవారమంతా బిజీ బిజీగా గడిపారు. న్యూయార్క్, వాషింగ్టన్‌ల్లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. న్యూయార్క్‌లో ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో "వసుధైక కుటుంబం కోసం యోగా" అనే థీమ్‌తో ప్రధాని నేతృత్వంలో 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు జరిగాయి. ఐక్యరాజ్య సమితి 77వ జనరల్ అసెంబ్లీ అధ్యక్షుడు కాసాబా కొరొసి, నటుడు రిచర్డ్ గెరె, న్యూయార్క్ నగర మేయర్ ఎరిక్ ఆడమ్స్, డిజిటల్ మత ప్రచారకుడు వాలా అఫ్షర్, స్టోరీ టెల్లర్ జే శెట్టి, అమెరికన్ గాయకులు మేరీ మిల్బెన్‌లతో సహా పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన వారందరికీ కృతజ్ఞతలు చెప్పారు. దాదాపు ప్రతి దేశానికి చెందిన వ్యక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని అన్నారు.

రెండో రోజు మోడీ బిజీ బిజీ

భారత ప్రధాని నరేంద్ర మోడీ తన నాలుగు రోజుల అమెరికా పర్యటనలో భాగంగా రెండవ రోజు బుధవారం రక్షణ, అర్థిక రంగాలకు సంబంధించిన పలు అంశాలపై ఒప్పందాలు కుదుర్చుకునేందుకు భేటీలు మీద భేటీలు జరిపారు. సంక్షోభంలో చిక్కుకున్న అమెరికాకు మేలు చేకూర్చేలా ఈ రెండు రంగాల తలుపులను మరింతగా తెరవడమే లక్ష్యంగా మోడీ పర్యటన సాగుతున్నది. బైడెన్ ఆహ్వానం మేరకు అమెరికా పర్యటనకు బయల్దేరడానికి ముందే కోట్లాది రూపాయల విలువైన ప్రిడేటర్ డ్రోన్ డీల్‌ను కుదుర్చుకున్నారు. జెట్ ఇంజిన్ ఉమ్మడి తయారీ ఒప్పందంతోపాటు అమెరికా కంపెనీల నుంచి దీర్ఘ శ్రేణి ఆర్టిల్లరీ గన్స్, మిలిటరీ వాహనాల కొనుగోలుకు సంబంధించిన డీల్స్ కోసం చర్చలు చేశారు. అలాగే పసిఫిక్ ప్రాంతంలో చైనాను

మిగతా 7లో

72 సైన్స్ అవార్డులు రద్దు

- కేంద్ర ప్రభుత్వ ఆదేశం

న్యూఢిల్లీ : గత సంవత్సరం 300కిపైగా సైన్స్ అవార్డులను రద్దు చేసిన కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఈ ఏడాది మరో 72 సైన్స్ అవార్డులను రద్దు చేసింది. సైన్స్, హెల్త్ రంగాల్లో అవార్డులను నిలిపేయాలని శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడెమీ (ఐఎన్ఎస్ఎ) ఈ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ నిధులు అందుకుంటున్న సంస్థలు ఇచ్చే డజన్ల కొద్దీ సైన్స్, హెల్త్ అవార్డులను ఇకపై కొనసాగించరాదని కేంద్రం భావిస్తోంది. యువ శాస్త్రవేత్తలు, సైన్స్ టీచర్లు, అంతర్జాతీయ హోదా కలిగిన శాస్త్రవేత్తలు, తదితరులకు ఇవ్వడానికి ఉద్దేశించిన 72 అవార్డులను ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ (ఐఎన్ఎస్ఎ) రద్దు చేసింది. మరో సంస్థ అయిన నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, ఇండియా (ఎన్ఎఎస్ఐ) కూడా20కి పైగా అవార్డులను రద్దు చేసిందని సంబంధిత అధికారులు 'ది టెలిగ్రాఫ్' పత్రికకు తెలిపారు. శాస్త్రవేత్తల కోసం శాస్త్రవేత్తలు ఏర్పాటు చేసిన ఈ అవార్డులను ఇలా రద్దు చేయాలన్న నిర్ణయాన్ని పలువురు శాస్త్రవేత్తలు విమర్శిస్తున్నారు. మన శాస్త్రీయ సంస్థల స్వయంప్రతిపత్తిని లాక్కునేందుకు చేపట్టిన ప్రక్రియే ఇదని, గతంతో మాజీ ప్రభుత్వ శాస్త్రవేత్త ఒకరు వ్యాఖ్యానించిన దానికి ఇది తాజా సాక్ష్యాధారమని అంటున్నారు. ఒక సంస్థ ప్రభుత్వ నిధులు అందుకుంటున్నపుడు ఎవరికి ఎప్పుడు అవార్డులు ఇవ్వాలనేది ప్రభుత్వం నిర్ణయించాలన్నది ఇందులోని అంతర్యమని ఒక శాస్త్రవేత్త వ్యాఖ్యానించారు.

ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అనే పేరు గల మరో అకాడమీకి కూడా ఇలాంటి ఆదేశాలే అందాయి కానీ తాము ఎలాంటి అవార్డులను ఇవ్వడం లేదని లేఖ రాసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ మూడు అకాడమీలు స్వయం ప్రతిపత్తి సంస్థలుగా పేర్కొనబడ్డాయి. సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం (డిఎస్‌టి) నుండి ఇవి నిధులు అందుకుంటున్నాయి.

3 రకాలుగా 'అసైన్డ్' పట్టాలు

- యాప్‌లో లబ్ధిదారుల వివరాలు
- భూములు కేటాయించాలంటూ పెరుగుతున్న ఒత్తిళ్లు

'పోలవరం పోరుకేక' 26న సంఘీభావ దినం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఈ నెల 20న ప్రారంభమైన పోలవరం నిర్వాసితుల పాదయాత్ర (పోలవరం పోరుకేక)కు అన్ని విధాలా సహాయ సహకారాలందించేందుకు, నిర్వాసితులకు అండగా నిలిచేందుకు 26న సంఘీభావ దినంగా సిపిఎం రాష్ట్ర కమిటీ ప్రకటించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. పోలవరం నిర్వాసితుల పాదయాత్ర ప్రచారాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు పట్టణాలు, వ్యాపార కూడళ్లు, పేటల్లో, గ్రామాల్లో సంఘీభావ కార్యక్రమాలు చేయాలని కోరింది. పాదయాత్ర అత్యధిక భాగం వందలాది గిరిజన గ్రామాల గుండా వెళుతుంది. పాదయాత్ర సజావుగా జరగాలంటే ఆర్థికంగా భారం అవుతుంది. భోజన, వసతి సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నా, వాహనాల ఖర్చు, వర్షం కురిస్తే గొడుగులు, బరకాలు, రెయిన్ కోట్స్ అవసరం అవుతాయి. కాబట్టి సంఘీభావంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 26న నిధి వసూళ్లకు పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ప్రతిశాఖ ఈ నిధి వసూలు చేయాలని కోరింది.

ఒపిఎస్ కోసం ఐక్య ఉద్యమాలు

- జిఓ 117ను రద్దు చేయాలి
- 25 నుంచి జిల్లాల్లో సదస్సులు : ఫ్యాప్టో

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీం (ఒపిఎస్)ను పునరుద్ధరించాలని, విద్యారంగానికి విఘాతం కలిగించే జిఓ 117ను రద్దు చేయాలనే డిమాండ్లతో ఐక్య ఉద్యమాలు నిర్వహించనున్నామని ఫ్యాప్టో ఛైర్మన్ ఎన్ వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఒపిఎస్ తప్ప రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న గ్యారంటీ పెన్షన్ స్కీం (జిపిఎస్)ను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని వెల్లడించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఫ్యాప్టో నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. జిపిఎస్ వల్ల కార్పొరేట్లకే లాభం తప్ప, ఉద్యోగులు, ఉపాధ్యాయులతోపాటు రాష్ట్ర ప్రభుత్వానికి కూడా ఉపయోగం లేదన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు లాభం చేకూర్చే ఒపిఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 2023 జులై 1 నుంచి అమలు చేయాల్సిన 12వ పిఆర్‌సికి ఇప్పటి వరకు కమిటీని నియమించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టబద్ధమైన కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 11వ పిఆర్‌సి నివేదికను బయటపెట్టకుండానే బలవంతంగా ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ఈ బకాయిలను కూడా ప్రభుత్వం ఇప్పటి వరకు చెల్లించలేదని, 12వ పిఆర్‌సి బకాయిలను ఎప్పుడు చెల్లిస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించకపోతే ఉద్యోగులు, ఉపాధ్యాయ, సిపిఎస్ సంఘాలను కలుపుకుని రాబోయే కాలంలో పెద్దఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సంస్కరణల పేరుతో విద్యారంగంలో తీసుకొచ్చిన జిఓ 117 వల్ల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు కనుమరుగవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు ఉద్యోగ, ఉపాధ్యాయులందరినీ ఎటువంటి షరతులు లేకుండా క్రమబద్ధీకరించాలని, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి 2022 పిఆర్‌సి ప్రకారం మినిమం టైం స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సెక్రటరీ జనరల్ సిహెచ్ మంజుల మాట్లాడుతూ.. జిఓ 117తో వేలాది ఉపాధ్యాయ పోస్టులు కుదించబడ్డాయని, ఉన్నవారిపై బోధన భారం పెరిగిందని చెప్పారు. 3వ తరగతి నుంచే సబ్జెక్టు టీచర్లతో బోధన చేయిస్తామని చెబుతున్న ప్రభుత్వం ప్రాథమికోన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు లేకుండా చేసిందన్నారు. ఉద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఇప్పటికే అన్ని జిల్లాల కలెక్టర్లకు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందించామన్నారు.

ఈ నెల 25 నుంచి సెప్టెంబరు ఒకటి వరకు ఆందోళనలు చేపడతామని తెలిపారు. ఈ నెల 25న విజయనగరం, పశ్చిమగోదావరి, కర్నూలు జిల్లాల్లో, జులై 2న విశాఖ, కృష్ణా, చిత్తూరు, తూర్పుగోదావరి, అనంతపురం, నెల్లూరు జిల్లాల్లో, జులై 9న గుంటూరు, కడప, శ్రీకాకుళం, ప్రకాశం జిల్లాల్లో సదస్సులు జరుగుతాయని వెల్లడించారు. ఈ సమావేశంలో ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎస్ చిరంజీవి, కార్యదర్శి ఎంఎస్ ఇమామ్ బాషా, కార్యవర్గ సభ్యులు కెఎస్ఎస్ ప్రసాద్, జి హృదయరాజు, నాయకులు రఘుబాబు, మజ్ను తదితరులు పాల్గొన్నారు.

500 మద్యం దుకాణాలు మూసివేత

- స్టాలిన్ ప్రభుత్వ నిర్ణయం

చెన్నై: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న 500 మద్యం దుకాణాలను మూసివేస్తూ తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని ప్రభుత్వ రిటైలర్ టాస్మాక్ బుధవారం వెల్లడించింది. తొలి విడతలో గురువారం నుంచి పాఠశాలలు, ఆలయాల సమీపంలో ఉన్న మద్యం దుకాణాలను మూసివేస్తున్నట్టు తెలిపింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తామని డిఎంకె పార్టీ హమీ ఇచ్చింది. హామీలో భాగంగానే డిఎంకె అధికారంలోకి వచ్చాక మద్యం విధానంలో కీలక మార్పులు చేశారు. ప్రస్తుతం ఇడి అరెస్టు చేసిన సెంథిల్ బాలాజీ ఏప్రిల్‌లోనే మద్యం దుకాణాల మూసివేతపై ప్రకటన చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మార్చి 31 నాటికి 5329 రీటైల్ మద్యం దుకాణాలు ఉండగా.. 500 దుకాణాలను తొలుత మూసివేసేందుకు గుర్తించినట్టు ఏప్రిల్ 12న సెంథిల్ బాలాజీ ప్రకటించారు. ఏప్రిల్ 20న ఇచ్చిన జీవోను ఈ సందర్భంగా తమిళనాడు రాష్ట్ర మార్కెటింగ్ కార్పొరేషన్ (టాస్మాక్) గుర్తు చేసింది. ఆ జీవో ఆధారంగానే 500 రీటైల్ మద్యం దుకాణాలను గుర్తించి గురువారం నుంచి మూసివేస్తున్నట్టు తెలిపింది.

నిర్వాసిత యువతకు ద్రోహం !

- అర్హులను నిర్ణయించే విధానం లోపభూయిష్టం
- 2017 జూన్ నెలాఖరుకు 18 ఏళ్లు నిండిన వారికే పరిహారమట!
- ఈ ఆరేళ్లలో మేజర్లుగా మారిన యువత ఏలూరు జిల్లాలో 20 వేల మందిపైనే

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

పోలవరం ప్రాజెక్టుతో నిర్వాసితులవుతున్న కుటుంబాల్లోని యువతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీరని ద్రోహం చేస్తున్నాయి. నిబంధనల ప్రకారం... గ్రామాలను ఖాళీ చేయించే సమయానికి 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులను కుటుంబంగా గుర్తించి ప్రభుత్వం ప్రకటించిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వడంతోపాటు, ఇంటిని నిర్మించి ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. 18 ఏళ్లు నిండిన యువతను అర్హులుగా తేల్చడంలో లోపభూయిష్టమైన విధానాలను అవలంభిస్తూ తీరని అన్యాయం చేస్తోంది. 2017 జూన్ నెలాఖరుకు 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులకు మాత్రమే పరిహారం ఇస్తామంటూ ప్రభుత్వం చెపుతోంది. ప్రస్తుతం 2023 సంవత్సరం నడుస్తోంది. ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని నిర్వాసితులకు పరిహారం ఇవ్వడంగానీ, ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడంగానీ, భూములకు ప్రకటించిన పరిహారం ఇవ్వడంగానీ పూర్తి స్థాయిలో అమలు జరగలేదు. ప్రాజెక్టులోని కాఫర్ డ్యాం నిర్మాణంతో వరదలు గ్రామాలను ముంచెత్తుతున్నప్పటికీ నిర్వాసితులంతా ఎన్నో కష్టాలను అనుభవిస్తూ అక్కడే నివసిస్తున్నారు. ప్రభుత్వం విధించిన కటాఫ్ తేదీ 2017 జూన్ తర్వాత గడిచిన ఆరేళ్లలో 18 ఏళ్లు నిండిన యువత ఏలూరు జిల్లాలోనే వేల సంఖ్యలో ఉంది. వీరందరికీ పరిహారం ఇవ్వాలంటూ నిర్వాసితులంతా కోరుతున్నారు. పోలవరం నిర్వాసితులకు జరుగుతున్న అన్యాయంపై సిపిఎం పోలవరం పోరుకేక పేరుతో పోలవరం ముంపు గ్రామాల్లో పాదయాత్ర చేస్తోంది. ఏలూరు జిల్లాలోని కుక్కునూరు మండలంలో 41.15, 45.72 కాంటూర్ల పరిధిలో 59 గ్రామాలు ముంపునకు గురవుతుండగా 13,565 నిర్వాసిత కుటుంబాలు, వేలేరుపాడు మండలంలో

మిగతా 2లో

కటాఫ్ తేదీ మార్చాలి

2017 జూన్ నాటికి నాకు 17 ఏళ్లు ఉన్నాయి. 18 ఏళ్లు నిండలేదని పరిహారపు అర్హుల జాబితాలో చేర్చలేదు. ఇప్పుడు 23 ఏళ్లు వచ్చాయి. పరిహారం కోసం దరఖాస్తు చేసుకున్నాను. కానీ, ఎటువంటి సమాధానమూ లేదు. ఇప్పటికీ గ్రామాలను ఖాళీ చేసి వెళ్లలేదు. అటువంటప్పుడు పరిహారం ఇవ్వకుండా వట్టిచేతులతో పంపిస్తే అన్నీ కోల్పోయి ఎలా బతకాలి? గ్రామాలను ఖాళీ చేసిన రోజు ప్రాతిపదికన కటాఫ్ తేదీ మార్చి యువతకు పరిహారమందించేలా చర్యలు తీసుకోవాలి.

- సంగేపు ప్రేమ్‌కుమార్, రజక బజార్, కుక్కునూరు

22 ఏళ్లున్నా పరిహారం లేదు

నేను 2001లో పుట్టాను. 2017 నాటికి నాకు 18 ఏళ్లు నిండలేదని పరిహారం ఇచ్చే అర్హుల జాబితాలో చేర్చలేదు. అప్పటి నుంచి మాధవరం గ్రామంలోనే ఉంటున్నాము. ఇప్పుడు నాకు 22 ఏళ్లు వచ్చాయి. అయినా, పరిహారం రాదని చెబుతున్నారు. పరిహారం ఇవ్వకపోతే మా పరిస్థితి ఏమిటి? వివాహం చేసుకున్న తర్వాత ఎలా బతకాలి? గ్రామాన్ని ఖాళీ చేసే నాటికి 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం ఇవ్వాలి.

- కోట పూజిత, మాధవరం గ్రామం, కుక్కునూరు మండలం.

యాసిడ్ దాడి బాధితురాలు మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

యాసిడ్ దాడిలో తీవ్రంగా గాయపడి గుంటూరు జిల్లా తాడేపల్లిలోని మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఫ్రాన్సిక బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరులోని జెవియర్ నగర్‌కు చెందిన ఎడ్ల ఫ్రాన్సిక(35) స్థానిక డెంటల్ ఆస్పత్రిలో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్నారు. ఈనెల 13న విధులు ముగించుకుని ఆమె రాత్రికి ఇంటికి వెళ్తుండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆమెపై యాసిడ్ దాడి చేశారు. మెరుగైన వైద్యం కోసం మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. మృత్యువుతో పోరాడి మరణించారు. పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి మృతదేహాన్ని తరలించారు.

తిరుమల ఘాట్‌లో పోలీస్ వాహనం బోల్తా

- నలుగురు ఎస్‌పిఎఫ్ సిబ్బందికి గాయాలు

ప్రజాశక్తి -తిరుపతి బ్యూరో

తిరుమల ఘాట్ రోడ్డులో వరుస ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. నిత్యం ఏదో ఒక ప్రమాదం సంభవిస్తుండటంతో యాత్రికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. నెల రోజుల వ్యవధిలోనే పదికి పైగా ప్రమాదాలు జరిగాయి. తాజాగా బుధవారం తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో జిఎంసి టోల్ గేటు దాటే మలుపు వద్ద ఎస్‌పిఎఫ్ కానిస్టేబుళ్లు ప్రయాణిస్తున్న వాహనం అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో నలుగురు గాయపడ్డారు. దుర్గ వరప్రసాద్, సాదిక్ భాషకు తీవ్రగాయాలు అయ్యాయి. మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. తిరుమల అశ్విని ఆస్పత్రిలో వారు చికిత్స పొందుతున్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

పిడుగుపాటుకు వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-పెదకూరపాడు

పిడుగుపాటుకు వృద్ధుడు మృతి చెందిన సంఘటన పల్నాడు జిల్లా పెదకూరపాడులో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదకూరపాడుకు చెందిన గుంటూరు పోలయ్య (70) పొలంలో పనులు చేస్తుండగా ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పిడుగుపడడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. పోలయ్యకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

భీమవరం కమిషనర్ ఇంట్లో ఎసిబి సోదాలు

ప్రజాశక్తి-ఉండ్రాజవరం (తూర్పు గోదావరి జిల్లా)

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మున్సిపల్ కమిషనర్ శివరామకష్ణ ఇంట్లో ఎసిబి అధికారులు బుధవారం సోదాలు చేశారు. భీమవరంలోని ఆయన నివాసంతోపాటు తణుకు, తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం పాలంగిలో ఆయన కుటుంబ సభ్యులకు సంబంధించిన ఎస్టేట్‌లో అధికారులు సోదాలు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయన్న సమాచారంతో సోదాలు చేపట్టినట్టు ఎసిబి డిఎస్‌పి పి.శరత్ బాబు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి ఏకకాలంలో తనిఖీలు కొనసాగుతున్నట్లు చెప్పారు.

వికలాంగుల సంక్షేమంలో రాష్ట్రం అగ్రగామి

- వి విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వికలాంగులకు సంక్షేమం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని వైసిపి ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు వి విజయసాయిరెడ్డి అన్నారు. వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ వికలాంగుల విభాగ సమావేశంలో విజయసాయిరెడ్డి బుధవారం మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వేలాది మంది వికలాంగులకు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పెన్షన్ అందిస్తూ.. వారికి అండగా నిలుస్తోందని అన్నారు. 14 రకాల రోగ పీడితులు, వైకల్యాలున్న 7,98,352 మందికి నెలకు రూ.255 కోట్లు పింఛన్లుగా అందిస్తోందన్నారు. అలాగే 2016 వికలాంగుల హక్కుల చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్నామని తెలిపారు. వికలాంగులకు మూడు శాతంగా వున్న రిజర్వేషన్లను నాలుగు శాతానికి పెంచామని చెప్పారు. సమావేశంలో పార్టీ వికలాంగుల విభాగం అధ్యక్షులు కిరణ్ రాజ్ పాల్గొన్నారు.

నిర్వాసిత యువతకు ద్రోహం !

మొదటి పేజీ తరువాయి

48 గ్రామాలు ముంపు పరిధిలో ఉండగా 8,205 నిర్వాసిత కుటుంబాలు ఉన్నాయి. ఈ రెండు మండలాల్లో మొత్తంగా 21,770 కుటుంబాలను గ్రామాల నుంచి తరలించాల్సి ఉంది. 2017 జూన్ తర్వాత 18 ఏళ్లు నిండిన యువత ప్రతి కుటుంబంలోనూ ఒకరు లేదా ఇద్దరు చొప్పున ఉన్నారు. ఆ ప్రకారం చూస్తే, ప్రభుత్వం నిర్దేశించిన కటాఫ్ తేదీ తర్వాత 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు 20 వేల మందికిపైగా ఉన్నట్లు తెలుస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ముంపు గ్రామాల లెక్కలు కూడా కలిపితే ఈ సంఖ్య 50 వేలు దాటే అవకాశం ఉంది. వీరందరినీ ప్రత్యేక కుటుంబంగా గుర్తించి చట్టప్రకారం ప్రభుత్వం ప్రకటించిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, రూ.పది లక్షలు, ఇల్లు నిర్మాణం చేసి ఇవ్వాల్సి ఉంది. గ్రామాలను ఖాళీ చేయించే రోజు వరకూ 18 ఏళ్లు నిండిన యువతకు పరి హారం ఇవ్వాల్సి ఉంది. లేకపోతే వేల సంఖ్యలో యువతీ, యువకులకు తీరని నష్టం.

విద్యుత్ రంగంలో కార్పొరేట్ల దోపిడీ

- వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళనలు

విజయవాడలో జరిగిన పోరుబాటలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు తదితరులు

ప్రజాశక్తి - యంత్రాంగం

ట్రూఅప్, సర్వీసు, ఇంధన ఛార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ప్రతిపాదన విరమించుకోవాలని, పెంచిన కరెంటు బిల్లులను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం పలు జిల్లాల్లో ఆందోళనలు చేపట్టారు. విజయవాడలోని మధురానగర్, దుర్గాపురం, గులాబీతోట, కొబ్బరి తోట, కృష్ణలంక తదితర ప్రాంతాల్లో విద్యుత్ పోరుబాట యాత్ర సాగింది. నేతలు, కార్యకర్తలు ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ... హిందూజా సంస్థకు చెల్లించిన రూ.1200 కోట్లు అక్రమమని రుజువైందన్నారు. ఈ మొత్తాన్ని సర్దుబాటు ఛార్జీల పేరుతో వినియోగదారులపై భారం వేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అదాని సంస్థలతో సోలార్ విద్యుత్, స్మార్ట్ మీటర్ల సరఫరాపై చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని, విద్యుత్ రంగంలో కార్పొరేట్ల దోపిడీ ఆపాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ కంపెనీలతో చేసిన విద్యుత్ ఒప్పందాలను సమీక్షించాలని, అడ్డగోలు ఒప్పందాలు రద్దు చేసి ముఖ్యమంత్రి తన చిత్తశుద్ధిని రుజువు చేసుకోవాలని బాబూరావు డిమాండ్ చేశారు.

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని విద్యుత్‌శాఖ డిఇ కార్యాలయం వద్ద వామపక్షాలు, ప్రజా సంఘాలు ధర్నా చేశాయి. అనంతరం ఇఇ వివి కిషోర్‌కు వినతిపత్రం అందజేశారు.పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని విద్యుత్ ఇఇ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అమరావతి మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు.

క్రమశిక్షణ, చిత్తశుద్ధితో పని చేయండి

- ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉద్యోగులు క్రమశిక్షణ, చిత్తశుద్ధితో పనిచేస్తూ సంస్థ పురోభివృద్ధికి కృషి చేయాలని ఎపిఎస్‌ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. విజయవాడలోని విద్యాధరపురంలోని ఆర్‌టిసి ట్రైనింగ్ కాలేజీలో ఇటీవల కొత్తగా కారుణ్య నియామకాల కింద నియామకమై శిక్షణ పొందుతున్న ఉద్యోగులను ఉద్దేశించి ఎమ్‌డి బుధవారం మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 2016 జనవరి ఒకటి నుంచి 2019 డిసెంబరు 31 వరకు మరణించిన ఆర్‌టిసి ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఎంతో ఔదార్యంతో కారుణ్య నియామకాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలిపారు. ఈ కారుణ్య నియామకాలలో జూనియర్ అసిస్టెంట్లు 34 మంది, 99 మంది ఆర్‌టిసి కానిస్టేబుల్స్, ఒక డ్రైవర్, 61 మంది కండక్టర్లు, 99 మంది మెకానిక్ అసిస్టెంట్లు కలిపి మొత్తం 294 మంది ఎపిఎస్‌ఆర్‌టిసిలో కొత్తగా ఉద్యోగంలో చేరారని పేర్కొన్నారు. కొత్తగా కారుణ్య నియామకాల నుంచి వచ్చిన వారిలో ఉన్నత చదువులు చదివినవారు వున్నారని, సంస్థలో అంకితభావంతో పనిచేస్తూ ఉద్యోగోన్నతులతో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మూడు నెలలపాటు జరిగే ఈ శిక్షణలో విధి నిర్వహణపై మెరుగైన అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా కొత్తగా ఉద్యోగంలో చేరినవారందరికీ ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు కెఎస్ బ్రహ్మానందరెడ్డి, ఆర్‌టిసి ట్రాన్స్‌పోర్టు అకాడమీ ప్రిన్సిపల్ డి సామ్రాజ్యం, చీఫ్ మెడికల్ ఆఫీసర్ అప్పారావు, ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

50 శాతం సబ్సిడీతో చేనేత మగ్గాలు : నారా లోకేష్

ప్రజాశక్తి-వెంకటగిరి (తిరుపతి జిల్లా)

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే 50 శాతం సబ్సిడీతో చేనేత కార్మికులకు మగ్గాలు అందజేస్తామని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తెలిపారు. యువగళం పాదయాత్ర బుధవారం వెంకటగిరి నియోజకవర్గం డక్కిలి నుండి ప్రారంభమై లింగసముద్రం, మోపూరు క్రాస్‌రోడ్డు, మిట్టపాళెం గ్రామం మీదుగా కాంపాళెం వరకు సాగింది. డక్కిలి క్యాంప్ సైట్‌లో చేనేత కార్మికులతో లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసిపి ప్రభుత్వం చేనేత కార్మికులకు ఇచ్చే అన్ని సబ్సిడీలను రద్దు చేసిందని తెలిపారు. నేతన్న నేస్తం అంటూ చేనేతను దారుణంగా మోసం చేసిందని విమర్శించారు. 60 మంది నేతన్నలు ఆత్మహత్య చేసుకున్నా.. ఒక్క కుటుంబాన్ని కూడా ఆదుకోలేదన్నారు. టిడిపి హయాంలో ఒక్క సంతకంతో రూ.110 కోట్ల చేనేత రుణాలు మాఫీ చేశామని గుర్తు చేశారు. ఆదరణ పథకంలో భాగంగా 50 శాతం సబ్సిడీతో మగ్గాలను అందించామన్నారు. వెంకటగిరిలో మెరుగైన టెక్స్‌టైల్ పార్కు తీసుకొచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. తెలుగుగంగ మెయిన్ కాలువ 34.290 కిలోమీటరు వద్ద ఒటి స్లూయిజ్ పనులు టిడిపి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక ఏలాంటి పనులూ చేయలేదని విమర్శించారు. స్లూయిజ్ పనులు పూర్తి చేస్తే నాయుడుపాళెం, చాకలపల్లి, పాతనాలపాడు, కొత్తనాలపాడు, మోపూరు కెబిపల్లి, యల్లావజ్జులపల్లి గ్రామాలకు ఉపయోగంగా ఉంటుందని పేర్కొన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలన్ని అమలు చేస్తామన్నారు. పాదయాత్రలో మాజీ శాసనమండలి ఛైర్మన్ షరీఫ్, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, టిడిపి నాయకులు డాక్టర్ మస్తాన్ యాదవ్, ప్రముఖ పారిశ్రామికవేత్త గంగోటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డిమాండ్లను సిఎం దృష్టికి తీసుకెళ్తాం

- విద్యుత్ ఉద్యోగుల సంఘాలతో మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ ఉద్యోగుల సంఘాల డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని ఆ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హామీ ఇచ్చారు. పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరు నాగేశ్వరరావుతో కలిసి విద్యుత్ ఉద్యోగుల సంఘాల ప్రతినిధులతో సచివాలయంలో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘాల నాయకులు పిఆర్‌సిలో ప్రస్తుత విధానం కొనసాగిస్తూ సింగిల్ మాస్టర్ స్కేల్ అమలు చేయాలని కోరారు. జెన్‌కో ఉద్యోగులకు అలవెన్స్‌లు, ఇతర అలవెన్స్‌లను యథాతథంగా కొనసాగించాలని, వెయిటేజ్‌తోపాటు ఫిట్‌మెంట్లను కొనసాగించాలని కోరారు. అలా కానిపక్షంలో అధిక ఫిట్‌మెంట్ ఇవ్వాలన్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకుంటామని నాయకులకు మంత్రి హామీ ఇచ్చారు. ఉద్యోగుల సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్న వన్‌మెన్ కమిషన్ నివేదికపై పూర్తిస్థాయిలో పరిగణనలోకి తీసుకోవడం లేదని వివరించారు. ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ మాట్లాడుతూ.. ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని ఉద్యోగులు సహకరించాలని కోరారు. ఆర్థికంగా లోటుతో ఉన్న రంగాన్ని కాపాడుకునేందుకు అన్ని రకాల ఖర్చులను తగ్గించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో జెన్‌కో ఎమ్‌డి కెవిఎన్ చక్రధర్‌బాబు, ఇపిడిసిఎల్ సిఎమ్‌డి పృథ్వీతేజ్, ఇంధనశాఖ డిప్యూటీ సెక్రటరీ కుమార్ రెడ్డి, ట్రాన్స్‌కో జెఎమ్‌డి మల్లారెడ్డి, విద్యుత్ ఉద్యోగుల జెఎసి ఛైర్మన్ చంద్రశేఖర్, కన్వీనర్ సాయికృష్ణ, సెక్రటరీ జనరల్ ప్రతాప్ రెడ్డి, కో ఛైర్మన్ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గవర్నరుతో సిఎం భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర గవర్నరు జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భేటీ అయ్యారు. బుధవారం సాయంత్రం విజయవాడలోని గవర్నరు బంగ్లాకు వెళ్లి ఆయనను సిఎం కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున గురువారం సాయంత్రం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా గౌరవార్థం నిర్వహించే సత్కారం, విందు కార్యక్రమానికి రాష్ట్ర గవర్నరును సిఎం ఆహ్వానించారు. రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా పనిచేసిన జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ఇటీవల సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందిన విషయం తెలిసిందే.

ఐఎఎస్ రావత్‌కు బెయిలబుల్ వారెంట్

ప్రజాశక్తి-అమరావతి

కోర్టు ధిక్కార కేసులో విచారణకు హాజరుకావాలన్న ఉత్తర్వులను అమలు చేయని ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్‌కు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరీ బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. వినుకొండ మున్సిపాల్టీలో సిసి రోడ్డు నిర్మాణ వ్యవహారంలో ఎర్నస్ట్ మనీ డిపాజిట్ (ఇఎండి), ఫ్యూచర్ సెక్యూరిటీ డిపాజిట్ (ఎఫ్‌ఎస్‌డి) డబ్బు తిరిగి ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేయాలంటూ కాంట్రాక్టరు జె వెంకటేశ్వరరెడ్డి గతంలో పిటిషన్ దాఖలు చేశారు. అందుకు అనుగుణంగా వెలువడిన ఉత్తర్వులను అమలు చేయకపోవడంతో ఆయన కోర్టు ధిక్కార పిటిషన్ వేశారు. తమ ఆదేశాలు ఎందుకు అమలు చేయలేదో స్వయంగా హాజరై చెప్పాలని గతంలో హైకోర్టు ఆ అధికారిని ఆదేశించింది. బుధవారం జరిగిన విచారణకు వచ్చినప్పుడు వారం రోజుల సమయం కావాలని ఆయన తరపున న్యాయవాది కోరారు. దీంతో విచారణ మధ్యాహ్నానికి వాయిదా పడింది. అయితే, మధ్యాహ్నం విచారణకు ప్రభుత్వ న్యాయవాది హాజరుకాలేదు. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ పిటిషన్ కూడా వేయలేదు. దీంతో హైకోర్టు, రావత్‌కు బెయిలబుల్ వారెంట్ జారీ చేసి విచారణను జులై 12కు వాయిదా వేసింది.

హైకోర్టులో యోగాడే

ప్రజాశక్తి-అమరావతి

అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా హైకోర్టులో బుధవారం యోగా వేడుకలు ఘనంగా జరిగాయి. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎవి శేషసాయి, పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఉద్యోగులు కార్యక్రమంలో పాల్గొన్నారు. యోగా గురువు బైసు మల్లికార్జునరావు ఆధ్వర్యంలో అందరూ యోగా చేశారు.

కోనసీమ రైతులను ఆదుకుంటాం

- ముమ్మిడివరంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్

ప్రజాశక్తి-అమలాపురం, ముమ్మిడివరం



జనసేన పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు అండగా ఉంటామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. వారాహి విజయయాత్రలో భాగంగా అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో బుధవారం నిర్వహించిన బహిరంగ సభలో పవన్ మాట్లాడారు. తన వద్ద రూ.వేల కోట్లు లేవని, సుపారీ గ్యాంగులు లేవని, కేవలం జాతీయ నేతల స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. కోనసీమ ప్రాంతంలో ఎటు చూసినా గోదావరి నది పారుతూ ఉంటుందని అలాంటి కోనసీమకే తాగునీటి సమస్యలు ఉన్నాయని, ఇక్కడ మంచి ఆస్పత్రి కూడా అందుబాటులో లేకపోవడం పాలకుల పాపమేనన్నారు. కోనసీమలో బాలయోగి అనేక మంచి పనులు చేశారని, ఒక్క వ్యక్తి అన్ని మంచి పనులు చేస్తే అధికారంలో ఉన్న ప్రభుత్వం ఎన్ని పనులు చేయాలని ప్రశ్నించారు. జనసేన పార్టీని బలపరిస్తే ఉభయ గోదావరి, కోనసీమ జిల్లాల ప్రజలకు అండగా ఉంటానన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఇసుక దోపిడీని అరికడతామని హామీ ఇచ్చారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, యువతకు పెట్టుబడి కింద ఉచితంగా రూ.10 లక్షలు ఇస్తామని తెలిపారు. రాష్ట్రంలో అన్ని కీలకమైన పదవులను ఒకే సామాజిక తరగతికి ఇస్తారా? మిగతా వారిలో ప్రతిభ లేదా? ఒక్క సామాజిక తరగతికే పదవులు కట్టబెట్టడం సామాజిక న్యాయమా అని ప్రశ్నించారు. మన రాష్ట్రంలో ఒక ఎంపిని కొట్టించగలరు.. ఒక దళితుడిని చంపి ఎమ్మెల్సీ డోర్ డెలివరీ చేయగలరు అని దుయ్యబట్టారు. కోనసీమకు అంబేద్కర్ జిల్లాగా పేరు పెడితే గొడవలు జరిగాయని, అంబేద్కర్ పేరును వ్యతిరేకించిన వర్గాలకు సిఎం నచ్చజెప్పాలని సూచించారు. మనం అనైక్యంగా ఉంటే మళ్లీ వైసిపి ప్రభుత్వమే వస్తుందన్నారు. 'వైసిపి ప్రభుత్వం ఉప్మా ప్రభుత్వం..సామాజిక తరగతులూ గురించి మాట్లాడితే వైసిపి నేతలకు ఇబ్బందిగా ఉంది. సామాజిక తరగతి గురించి మీరు మాట్లాడవచ్చు. నేను మాట్లాడవద్దా? అన్ని సామాజిక తరగతులూ బాగుపడాలి..అందరూ పైకి రావాలి. రైతుల కష్టాలను పోగొట్టే ప్రభుత్వం మనకు కావాలి. రైతులు దూరంగా ఉండే మిల్లులకు ధాన్యం తీసుకెళ్తున్నారు. మేం వచ్చాక దగ్గరున్న మిల్లులకే ధాన్యం తరలిస్తాం' అని పవన్ కల్యాణ్ అన్నారు.

సమాజంలో ఇంజనీర్ల పాత్ర కీలకం

వివిఐటి స్నాతకోత్సవంలో హైకోర్టు న్యాయమూర్తి రామకృష్ణ ప్రసాద్

మాట్లాడుతున్న న్యాయమూర్తి రామకృష్ణప్రసాద్

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

దేశ భవిష్యత్తులో, మెరుగైన సమాజంలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమని హైకోర్టు న్యాయమూర్తి జి.రామకృష్ణ ప్రసాద్ అన్నారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజిలో బుధవారం జరిగిన కళాశాల స్నాతకోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. డిగ్రీ పొందిన విద్యార్థులు సమాజంపై తమ బాధ్యత పెరిగిందని గుర్తించాలని, అదే సమయంలో తల్లిదండ్రుల అభిరుచులు, ఆశయాలనూ గౌరవించాలని అన్నారు. మంచి లక్ష్యాలతో మెరుగైన ఉపాధికి బాటలు వేసుకోవాలని సూచించారు. సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. జెఎన్‌టియు కాకినాడ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జివిఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ.. విద్యార్థులకు సాంకేతికను నేర్పించేందుకు, విద్యతోపాటు మానవత్వపు విలువలను, ఆలోచనా విధానాలను పెంపొందించేందుకు జెఎన్‌టియు ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. వివిఐటి ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదిగి సమాజంపై బాధ్యతతో వ్యవహరించాలన్నారు. కళాశాల వార్షిక ప్రణాళికను ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి వివరించారు. ఈ వేడుకల్లో 2019-2023 బ్యాచ్‌కు చెందిన 897 మంది పట్టభద్రులకు సర్టిఫికెట్లు అందించారు. కళాశాల టాపర్‌గా నిలిచిన విద్యార్థి కె.సాయికుమార్‌కు వాసిరెడ్డి వెంకటాద్రి గోల్డ్ మెడల్‌ను ప్రదానం చేశారు. మరో ఆరుగురికి బంగారు పతకాలు అందించి, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో వివిఐటి వైస్ ఛైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, కళాశాల విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందూజా రివ్యూ పిటిషన్ కొట్టివేత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

హిందూజా ప్రాజెక్టు పెట్టుబడి వ్యయం, టారీఫ్, సవరణలతో కూడిన పిపిఎకు అనుమతిస్తూ కమిషన్ జారీ చేసిన ఉత్తర్వులను, ఇతర అంశాలను తిరిగి పున:సమీక్షించాలని కోరుతూ హిందూజా పవర్ కార్పొరేషన్ దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) కొట్టేసింది. హిందూజా లేవనత్తిన అంశాలను గతంలోనే పరిశీలించి ఉత్తర్వులు ఇచ్చినట్లు ఎపిఇఆర్‌సి మంగళవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. గత ఉత్తర్వుల్లో 2022 ఆగస్టు ఒకటి ముందు కాలంలో సరఫరా చేసిన విద్యుత్‌కు గతంలో నిర్ణయించిన తాత్కాలిక ఛార్జీలే తుది అని కమిషన్ ఉత్వరుల్లో పేర్కొంది. అయితే ప్రభుత్వం ఆదేశం మేరకు డిస్కంలు డిమ్‌డ్ జనరేషన్ కింద హిందూజాకు స్థిర ఛార్జీలు చెల్లించాయని, ఇది కమిషన్ ఇచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘించడమేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, విద్యుత్ రంగ నిపుణులు ఎం వేణుగోపాలరావు కమిషన్‌కు నివేదించారు. 2022-23 ట్రూఅప్ క్లయిమ్‌లను డిస్కంలు తమ పరిశీలనలోకి తీసుకొచ్చిన సమయంలో పరిశీలిస్తామని కమిషన్ పేర్కొంది. ఉత్తర్వులకు భిన్నంగా చెల్లింపు అయినట్లు తేలితే ట్రూఅప్ క్లయిమ్‌లను తిరస్కరిస్తామని 2022-23 టారీఫ్ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ అంశంపై కమిషన్ తానంతట తానే బహిరంగ విచారణ జరిపించాలని బాబూరావు, గోపాలరావు కోరినా కమిషన్ పట్టించుకోలేదు. ట్రూఅప్ క్లయిమ్‌లను విచారణ చేపట్టినప్పుడు చట్ట విరుద్ధ వైఖరిపై కమిషన్ ఎలాంటి వైఖరి తీసుకుంటుందో చూడాల్సి ఉంది.

చిన్నబాబుది వ్యవస్థ చేసిన హత్య

- నంద్యాల ఘటనపై టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నంద్యాలలో దళిత యువకుడు చిన్నబాబు ఆత్మహత్య వ్యవస్థ చేసిన హత్య అని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. వైసిపి పాలనలో ఆంధ్రప్రదేశ్ నేరాంధ్రప్రదేశ్‌గా మారిపోయిందని బుధవారం ట్విట్టర్‌లో విమర్శించారు. వ్యవస్థలు చేస్తున్న హత్యలకు బడుగులు బలవుతున్నారని పేర్కొన్నారు. దొంగతనం నేరం మోపి పోలీసులు వేధించడంతో చిన్నబాబు ప్రాణాలు తీసుకోవడం అత్యంత బాధాకరమని తెలిపారు. 2020 నవంబరులో అబ్దుల్ సలాం కుటుంబం ఆత్మహత్యకు ఏ పోలీసులైతే కారణమయ్యారో, అదే పోలీస్ స్టేషన్ అధికారుల వేధింపుల కారణంగా చిన్నబాబు రైలు కింద పడి ప్రాణాలు తీసుకోవడం విషాదకరమని పేర్కొన్నారు. రక్షణ ఇవ్వాల్సిన పోలీసుల వల్లే ప్రాణాలు పోయే పరిస్థితుల్లోకి రాష్ట్రాన్ని తీసుకెళ్లారని విమర్శించారు. నంద్యాల ఘటనలో బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, బాధ్యులపై పోలీసులు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

ప్రజాశక్తి-కర్నూలు క్రైం, తెనాలి

భార్యను హత్య చేసిన కేసులో భర్తకు, యువకుడి హత్య కేసులో 13 మందికి బుధవారం జీవిత ఖైదు పడింది. మద్యానికి డబ్బులు అడిగితే ఇవ్వలేదన్న కోపంలో 2021 జూన్ 3న ఇంట్లో నిద్రిస్తున్న భార్య హైమావతి తలపై రోకలి బండతో కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం డేగులహాలు గ్రామినికి చెందిన వెంకటస్వామి దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే మరణించారు. మృతురాలి తండ్రి బోయలాలప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. ముద్దాయిని 2021 జూన్ 10న అరెస్టు చేసి రిమాండ్ పంపారు. సాక్ష్యాలు, ఫోరెన్సిక్ రిపోర్ట్‌ను ఆధారం చేసుకుని ఆదోని రెండో కోర్టు అదనపు జడ్జి పిజె.సుధారాణి బుధవారం తీర్పు చెప్పారు. భార్యను హత్య చేసినట్లు రుజువయినందున వెంకటస్వామికి జీవిత ఖైదు, రూ. 1,000 జరిమానా విధించారు.

హత్య కేసులో 13 మందికి యావజ్జీవం

2016 జులై 17న జరిగిన యువకుడి హత్య కేసులో 13 మందికి జీవిత ఖైదు పడింది. ఈ మేరకు గుంటూరు జిల్లా తెనాలి 11వ అదనపు జిల్లా జడ్జి తీర్పును వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ప్రస్తుత బాపట్ల జిల్లా రేపల్లె మండలం అడవులదీవి పంచాయతీ పరిధి మహమ్మదీయపట్నం గ్రామానికి చెందిన యువతి జాస్మిన్, అడవులదీవికి చెందిన షణ్ముఖ శ్రీసాయి ప్రేమికులు. తన మిత్రుడు పవన్‌తో కలిసి జాస్మిన్ ఇంటికి శ్రీసాయి వచ్చాడు. అయితే జాస్మిన్ ఇంట్లోకి ఇద్దరు యువకులు వెళ్లడాన్ని స్థానికుడైన బాషా గమనించి జాస్మిన్ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. వారు వెళ్లిన కొద్దిసేపటికే తాను చనిపోతున్నానంటూ శ్రీసాయికి జాస్మిన్ ఫోన్ చేసింది. శ్రీసాయి, పవన్ జాస్మిన్ ఇంటికి చేరుకునేలోగా ఆమె ఉరేసుకుంది. బయటకు వెళ్లిన జాస్మిన్ తల్లిదండ్రులు ఇంటికి చేరుకున్నారు. జాస్మిన్ మృతికి శ్రీసాయి, పవన్ కారణమంటూ బాషా చెప్పటంతో వారిపై దాడి చేశారు. శ్రీసాయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ కేసులో మొత్తం 21 మందిని పోలీసులు నిందితులుగా చేర్చారు. విచారణ సమయంలో నలుగురు మృతి చెందారు. మిగిలిన 13 మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధించారు.

సంఘాలతో సమావేశాలు జరపండి

- భేటీలపై మూడు తేదీలను ఇచ్చిన జిఎడి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఒకవైపు ఉద్యోగుల ఆందోళనలు కొనసాగుతున్నప్పటికీ, వారి సమస్యలపై ప్రభుత్వ శాఖలు మాత్రం ఆశించిన రీతిలో స్పందించడం లేదు. ప్రతినెలా మొదటి, రెండో సోమవారాల్లో ఉద్యోగ సంఘాలతో ఆయా శాఖలు సమావేశాలు నిర్వహించేలా చూస్తామని ముఖ్యమంత్రి పేషీ ఇచ్చిన హామీ నీటిమీద రాతగానే మిగిలిపోయింది. ఒపిఎస్ పునరుద్ధరణ, పిఆర్‌సి వంటి అంశాలపై ఆందోళన చేస్తున్న ఉద్యోగ సంఘాలతో మొక్కుబడిగా చర్చలు జరిపింది. శాఖల కార్యదర్శులు కూడా తమతమ శాఖల్లోని ఉద్యోగుల సమస్యలపై నెలకు రెండు వారాలు సంఘం నేతలతో సమీక్షిస్తారని చెప్పినా ఆ దిశగా ఇంతవరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఎన్నికలు సమీపిస్తున్నందున ఉద్యోగులను దూరం చేసుకోకూడదన్న ఉద్దేశంతో కావచ్చు.. ఉద్యోగ సంఘాలతో చర్చలు తక్షణమే నిర్వహించాలంటూ ముఖ్యమంత్రి కార్యాలయంతోపాటు సిఎస్ జవహర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. దీనికోసం ప్రధానంగా మూడు తేదీలను సిఎస్, సిఎంఓ అధికారులు ప్రకటించారు. ఈ నెల్లోనే 23, 27, 30వ తేదీల్లో అనుకూలంగా ఉన్న ఒకదానిని ఎంచుకుని, ఆ తేదీలో ఉద్యోగ సంఘాలతో భేటీలు నిర్వహించాలని ఆదేశించారు.

జులై 5న స్టాఫ్ కౌన్సిల్ భేటీ

ఈ నేపథ్యంలోనే వచ్చే నెల ఐదో తేదీన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నెల్లో శాఖలు ఉద్యోగ సంఘాల నేతలతో చర్చలు జరిపి జులై 3 నాటికి నివేదికలను సమర్పించాలని సాధారణ పరిపాలన శాఖ ఆదేశించింది.

యోగా సాధనతో మానసిక ఒత్తిళ్లను అధిగమించొచ్చు

- గృహ నిర్మాణ సంస్థ ఎమ్‌డి లక్ష్మీశా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రతిరోజూ యోగా సాధనతో మానసిక ఒత్తిళ్లను అధిగమించొచ్చని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎమ్‌డి లక్ష్మీశా తెలిపారు. విజయవాడలోని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్యాలయంలో బుధవారం యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీశా మాట్లాడుతూ.. యోగా విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పింది మన దేశమేనని అన్నారు. మానసిక ఒత్తిడిని తగ్గించడంలో యోగా బాగా ఉపకరిస్తుందని తెలిపారు. ఉద్యోగులంతా ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని అధిగమించడంతోపాటు ఆరోగ్యంగా కూడా వుంటారని అన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు కె సురేష్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ యోగా చేయాలన్నారు. యోగాతో వచ్చే ప్రయోజనాలపై అవగాహనను పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ ఎస్‌ఇలు జయరామాచారి, నాగభూషణం, వెంకటరెడ్డి, ప్రాజెక్టు డైరెక్టరు రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం రైల్వేస్టేషన్‌లోని గూడ్స్ యార్డులో బుధవారం గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. గూడ్స్ రైలు పార్కింగ్ ట్రాక్ నుంచి మెయిన్ ట్రాక్‌కు వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనపై స్పందించిన రైల్వే అధికారులు, సిబ్బంది ట్రాక్ మరమ్మతు పనులు శరవేగంగా చేపట్టారు. రైళ్ల రాకపోకలు యథాతథంగా కొనసాగాయి. ఈ ఘటనలో ఎలాంటి నష్టమూ వాటిల్లలేదు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

పాదయాత్రలో కదంతొక్కుతూ ముందుకు సాగుతున్న గిరిజన యువత

నిర్వాసితుల సమస్యలను ఆలకిస్తున్న శ్రీనివాసరావు

మహా పాదయాత్రకు మేముసైతం అంటూ కదిలిన గిరిజనం

ప్రతి నిర్వాసితునికీ న్యాయం కోసం పాదయాత్ర

ఎర్రజెండా చేపట్టి ఉద్యమంలో భాగమైన చిన్నారులు

ప్రజాశక్తి- కూనవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా)

పోలవరం నిర్వాసితులందరికీ న్యాయం కోసం పోలవరం పోరుకేక మహా పాదయాత్ర చేపట్టినట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన ఈ మహా పాదయాత్ర రెండో రోజు కార్యక్రమంలో భాగంగా కూనవరం మండలంలోని పల్లూరు గ్రామంలో బుధవారం జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. ముందుగా గ్రామంలోని ఆవుల నాగమయ్య స్థూపానికి శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థూపం వద్ద ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ, ఆవుల నాగమయ్య స్ఫూర్తితో అందరూ ఆయన బాటలో నడవాలని కోరారు. ఈ మహా పాదయాత్ర ఒక పార్టీకి సంబంధించింది కాదని, ప్రతి నిర్వాసితుని సమస్యపై చేపట్టిందని తెలిపారు. వరదలు వచ్చినప్పుడు ఈ ప్రాంత ప్రజలు కంటిమీద కునుకులేకుండా ఇబ్బంది పడుతున్నారని గుర్తు చేశారు. గతేడాది వచ్చిన వరదలకు మునిగిపోయిన ఈ గ్రామం ముంపు జాబితాలో లేకపోవడం శోచనీయమన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, గతేడాది వచ్చిన వరదలకు ఈ గ్రామం మునిగిపోయిన సమయంలో బాధితులను అధికార పార్టీ ఎంపి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎవరూ పట్టించుకోలేదన్నారు. సిపిఎం మాత్రమే ఆపన్నహస్తం అందించి ఆదుకుందని గుర్తు చేశారు. పోలవరం నిర్వాసితులకు పునరావాసం, పరిహారం, ఆర్ అండ్ ఆర్, యూత్ ప్యాకేజీ, ఇతర సమస్యల పరిష్కారానికి సిపిఎం మొదటి నుంచీ పోరాడుతోందని, ఇప్పుడు వారి సమస్యలపై మహా పాదయాత్ర చేపట్టిందని తెలిపారు. ప్రతి నిర్వాసితునికీ న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. గతేడాది వరదలు వచ్చి నిర్వాసితులు ఇబ్బంది పడుతుంటే, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ముంపేలేని చింతూరు వచ్చి వెళ్లారని విమర్శించారు. తమ గ్రామాన్ని 41.15 కాంటూరులో చేర్చేలా, కటాఫ్ తేదీ నుంచి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇప్పించేలా చూడాలని కోరుతూ వి.శ్రీనివాసరావుకు స్థానికులు వినతిపత్రం అందించారు.

పోలవరం పోరుకేక మహా పాదయాత్రలో వి శ్రీనివాసరావు

పల్లూరులో ఆవుల నాగమయ్య స్థూపం వద్ద సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

మోడీ భజన చేస్తారా... నిర్వాసితులకు న్యాయం చేస్తారా?

- వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- కూనవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా)

ప్రధాని మోడీకి భజన చేస్తారా? పోలవరం నిర్వాసితులకు న్యాయం చేస్తారా? అని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. పోలవరం పోరుకేక మహా పాదయాత్ర 2వ రోజు అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలంలో కొనసాగింది. ఈ సందర్భంగా కూళ్లపాడులో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయడానికి ముందుగానే నిర్వాసితులందరికీ పూర్తి స్థాయిలో పునరావాసం, పరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిర్వాసితుల కోసం నిర్మించిన పునరావాస కాలనీలు గత వరదలకు మునిగిపోయాయని గుర్తు చేశారు. దీనిని బట్టి కాంటూర్ లెక్కలు ఎంత అశాస్త్రీయంగా ఉన్నాయో స్పష్టమైందన్నారు. కాంటూరు లెక్కలు, లైడర్ సర్వే పేరుతో నిర్వాసితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసగిస్తున్నాయని విమర్శించారు. నిర్వాసితులకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వైసిపి, టిడిపి, జనసేన పార్టీ రాష్ట్ర ప్రయోజనాలను బిజెపికి తాకట్టు పెడుతున్నాయని విమర్శించారు. దేవీపట్నంలో కొందరి నిర్వాసితులకు నేటికీ పునరావాసం కల్పించలేదని తెలిపారు. ముస్లిం, మైనార్టీలకు అండగా ఉంటానని చెబుతున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్... బిజెపితో చేతులు కలుపుతామనడం శోచనీయమన్నారు. అమిత్ షా రోడ్డు మ్యాప్‌తో వెళ్తున్న ఆయనకు ముంపు ప్రాంత ప్రజల సమస్యలు పట్టవా? అని ప్రశ్నించారు. పోలవరం పోరుకేక మహా పాదయాత్ర ముగింపు సందర్భంగా వచ్చే నెల నాలుగున విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. మీడియా సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు, రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, కూనవరం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, కూనవరం వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, మీడియా ఇన్‌ఛార్జి యర్రంశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధి కార్మికుల సమస్యలు వింటూ వారి పనిలో నిమగ్నమైన శ్రీనివాసరావు

సమస్యలు వింటూ.. భరోసానిస్తూ..

ప్రజాశక్తి- కూనవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా)

పోలవరం పోరుకేక మహా పాదయాత్ర రెండో రోజు మురుమూరు గ్రామం నుంచి ఉత్సాహంగా బుధవారం ప్రారంభమైంది. ముంపు గ్రామాల గిరిజనులు అడుగడుగునా హారతులతో పాదయాత్రకు స్వాగతం పలికారు. ఈ గ్రామంలో 'ఉపాధి హామీ' పనులు చేస్తున్న కార్మికులను పాదయాత్ర బృందం సభ్యులు కలిసి వారితో కాసేపు మాట్లాడారు. ఈ బృందానికి నాయకత్వం వహిస్తోన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఉపాధి పనుల్లో పాల్గొన్నారు. గునపంతో మట్టిని తవ్వారు. పాదయాత్ర బృందం దృష్టికి ఉపాధి కార్మికులు తమ సమస్యలు తీసుకొచ్చారు. వేసవి అలవెన్సులు ఇవ్వడంలేదని, బిల్లులు సరిగా రావడంలేదని తెలిపారు. గోదావరి 45 అడుగులకే తమ గ్రామం ముంపు బారిన పడుతున్నందున 41.15 కాంటూరులో కలిపి న్యాయం జరిగేలా చూడాలని మురుమూరు గ్రామస్తులు కోరారు. అనంతరం పోచవరం గ్రామానికి మహా పాదయాత్ర చేరుకుంది. ఆ గ్రామస్తులూ ఘనంగా స్వాగతం పలికారు. యాత్రకు టిడిపి నాయకులు సంఘీభావం తెలిపారు. నిర్వాసితుల కోసం సిపిఎం చేపట్టిన పాదయాత్ర అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. తదుపరి కాచవరం ఎస్‌సి కాలనీకి పాదయాత్ర చేరుకుంది. తమకు వరద ముంపు సమయంలో ప్రభుత్వం నిత్యావసరాలు ఇవ్వలేదని ఎస్‌సి కాలనీ వాసులు పాదయాత్ర బృందం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం పోలిపాక గ్రామానికి పాదయాత్ర చేరుకుంది. గోదావరి ముంపులో తమ గ్రామం ఉన్నా ముంపులో లేదని అధికారులు చెపుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కూళ్లపాడులో జరిగిన పాదయాత్రలో ఆ గ్రామానికి చెందిన మడకం లక్ష్మి తన గోడు వినిపించారు. గతేడాది ముంపునకు గురై తన ఇల్లు పాడైందని, ప్రభుత్వం రూ.10 వేలు ఇచ్చిందని, అది ఎటూచాలక ఇప్పటికీ కట్టుకోలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కళ్లు ఉండి చూడలేని, చెవులుండి వినలేని స్థితిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయని విమర్శించారు. అనంతరం పాదయాత్ర నర్సింగపేట చేరుకుంది. యాత్రకు టిడిపి, వైసిపి నాయకులు సంఘీభావం తెలిపారు. పొట్లవాయిగూడెం, కరకగూడెం, కొండాయిగూడెం, గొమ్ముగూడెం జంక్షన్, పల్లూరు, మర్రిగూడెం, చూచిరేవులగూడెం, భీమవరం, జగ్గవరం మీదుగా టేకులబోరు వరకు మహా పాదయాత్ర కొనసాగింది. వందలాది మంది గిరిజనులు సమరోత్సాహంతో పాల్గొన్నారు.

3 రకాలుగా 'అసైన్డ్' పట్టాలు

- మొబైల్ యాప్‌లో లబ్ధిదారుల వివరాలు
- భూములు కేటాయించాలంటూ పెరుగుతున్న ఒత్తిళ్లు
- కలెక్టర్ల నుంచి ప్రభుత్వానికి నివేదికలు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా భూమి లేని నిరుపేదలకు ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల్లో అర్హులైన లబ్ధిదారులకు సుమారు 55 వేల ఎకరాల అసైన్డ్ భూములను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి పాఠకులకు విధితమే. అయితే అనేక ప్రాంతాల్లో పెద్దఎత్తున భూములు తమకు కేటాయించాలంటూ స్థానిక ప్రజా ప్రతినిధులపై ఒత్తిళ్లు అధికమైనట్లు సమాచారం. ప్రస్తుతానికి ఒక్కో లబ్ధిదారునికి రెండెకరాల నుంచి ఐదెకరాలు మించకుండా పట్టాలిచ్చేందుకు రెవెన్యూ యంత్రాంగం రికార్డులు తయారు చేసే పనిలో నిమగ్నమైనట్లు సమాచారం. అసైన్డ్ భూములకు సంబంధించి 26 జిల్లాల కలెక్టర్ల నుంచి ఆయా జిల్లాల్లో లభ్యతగా ఉన్న భూములు, అర్హులైన లబ్ధిదారుల పేర్లను జిల్లా అసైన్డ్ కమిటీలు అప్రూవల్ చేసిన వివరాలతో కూడిన నివేదికలు ప్రభుత్వానికి అందాయి. ఇందుకు సంబంధించి ఎప్పుడు ఎలా పంపిణీ చేయాలనే విషయంపై ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ముఖ్యమంత్రి అసైన్డ్ భూముల పట్టాల పంపిణీకి ఎప్పుడైనా గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశమున్నట్లు రెవెన్యూ వర్గాల్లో చర్చ నడుస్తోంది. గతంలో మాదిరి మండల తహాశీల్దార్లకు పూర్తి అధికారాలు కట్టబెట్టకుండా, ఈ దఫా ఎపి ఆన్‌లైన్ సేవ పేరుతో మొబైల్ యాప్‌ను ప్రభుత్వం సిద్ధం చేసింది.

ఎ, బి, సి క్లాస్‌లుగా విభజన

రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీకి సిద్ధం చేసే భూములను మూడు రకాలుగా వర్గీకరించారు. ఇందులో ప్రధానంగా వ్యవసాయ భూమి, లంక భూములు (ఎ-క్లాస్, బి-క్లాస్), లంక భూములు (సి-క్లాస్) పేరుతో విభజించినట్లు సమాచారం. వ్యవసాయ భూములకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చే పట్టాపై తహాశీల్దారు సంతకం ఉండనుంది. లంకభూములు (ఎఅండ్‌బి క్లాస్), లంకభూములు (సి-క్లాస్) పట్టాలపై ఆయా జిల్లా కలెక్టరు సంతకంతో మంజూరు చేయనున్నారు.

ఆధార్‌తో సహా అన్ని వివరాలతో పట్టా

పట్టాలపై లబ్ధిదారుని వివరాలకు సంబంధించి ఆధార్ నెంబరు, లబ్ధిదారుని పేరు, జెండర్, సమీప బంధువు పేరు, ఏ రకంగా బంధువు, జిల్లా, మండలం, గ్రామం పేరు నమోదు చేయనున్నారు. వీటితోపాటు భూమికి సంబంధించి జిల్లా, మండలం, గ్రామం, సర్వే నెంబరు/ల్యాండ్ పార్శిల్ నెంబరు (మల్టిపల్ సర్వే నెంబరు/ఎల్‌పి నెంబర్స్,) విస్తీర్ణంతోపాటు ఖాతా నెంబరు, భూమి స్వభావం, విస్తీర్ణం నమోదు చేస్తారు. అంతేకాకుండా సర్వే నెంబరు వారీ భూమి మొత్తం విస్తీర్ణాన్ని గుణించి పట్టాపై నమోదు చేయనున్నారు.

అక్రమాలకు అడ్డుకట్ట!

పట్టా మీద లబ్ధిదారుని పూర్తి వివరాలు నమోదు చేయడంతో భవిష్యత్తులో మరొకరికి బదలాయించే అవకాశం, లేక అమ్ముకునే అవకాశం ఉండదని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. లబ్ధిదారుని ఆధార్ నెంబరు నమోదు చేస్తుండటంతో మరో దఫా వ్యవసాయ భూమి కావాలని దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుండా చేయడం ద్వారా అక్రమాలకు అడ్డుకట్ట వేసినట్లవుతుందని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. అనంతరం తహాశీల్దార్ లాగిన్‌కు బదలాయింపు జరుగుతుంది. అక్కడ పరిశీలన అనంతరం అప్రూవల్ కోసం ఆయా జిల్లా కలెక్టర్లకు ఫైలు ఆన్‌లైన్‌లో పంపనున్నట్లు ప్రభుత్వ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. ప్రభుత్వం నూతనంగా అసైన్డ్ పట్టాల పంపిణీకి ఆన్‌లైన్ విధానాన్ని ఎన్నుకోవడంతో లబ్ధిదారుల వివరాలు తారుమారుకావడానికి అవకాశం ఉండదని పలువురు భావిస్తున్నారు.

జీతం 15 రోజులకు మించి ఉండదు

- 75% మంది వద్ద డబ్బులు లేదు
- అత్యవసరాలకు నిధుల కటకటే
- 25 శాతం మంది వద్దే ఎమర్జెన్సీకి సొమ్ము
- గడ్డుకాలంలో తల్లిదండ్రులు, స్నేహితులే ఆధారం
- ఫినోలాజీ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ : భారతీయుల్లో మూడొంతుల మంది వద్ద అత్యవసరానికి నగదు లేదని ఓ రిపోర్ట్‌లో వెల్లడయ్యింది. నాలుగింటిలో ఒక్క వంతు మంది వద్ద మాత్రమే ఎమర్జెన్సీకి సొమ్ము ఉందని పర్సనల్ ఫైనాన్స్ ప్లాట్‌ఫాం ఫినోలాజీ సర్వేలో వెల్లడయ్యింది. "ఇండియా మనీ హాబిట్స్" పేరుతో ఫినోలాజీ నిర్వహించిన సర్వే రిపోర్ట్ ప్రకారం.. "పదవీ విరమణ, పిల్లల విద్య, వివాహం వృద్ధాప్య ఆరోగ్య సంరక్షణ ఖర్చులు వంటి దీర్ఘకాలిక ప్రణాళికలో భారతీయులు గొప్పగా ఉన్నారు. అయితే.. అకస్మాత్తుగా ఉద్యోగం కోల్పోవడం లేదా కరోనా లాంటి సంక్షోభం ఏర్పడినప్పుడు 25 శాతం మంది వద్ద మాత్రమే ఎమర్జెన్సీ అవసరాలకు నిధులు ఉన్నాయి. మిగితా 75 శాతం భారతీయుల వద్ద అత్యవసర నిధులు లేవు. ఆకస్మికంగా ఉద్యోగం కోల్పోతే వారి నెలవారీ వాయిదాల (ఇఎంఐ) చెల్లింపుల్లో విఫలం కానున్నారు. గడ్డుకాలంలో భారతీయులు తమ తల్లిదండ్రులు, స్నేహితులను అత్యవసర నిధిగా పరిగణిస్తారు. ముగ్గురిలో ఒకరికి ఆరోగ్య రక్షణ లేదా అత్యవసర నిధి లేదు. మరో దారుణమైన, ఆందోళనమైన విషయం ఏంటంటే.. 29 శాతం మంది భారతీయుల జీతం 15 రోజులకు మించి ఉండదు." అని ఫినోలాజీ సర్వేలో తేలింది.

అత్యవసర నిధి అంటే..!

జీవితంలో ఊహించని పరిణామాలు చోటు చేసుకున్నప్పుడు ఆర్థిక అవసరాల కోసం ముందే పక్కనే పెట్టుకున్న డబ్బు. "ఉద్యోగ నష్టం, అనారోగ్యాలు లేదా వైకల్యం కారణంగా ఆదాయాన్ని కోల్పోయే కాలంలో ఊహించని ఖర్చులను ఎదుర్కోవటానికి లేదా అనివార్యమైన ఖర్చులను కవర్ చేయడానికి ఆర్థిక నిధిని రూపొందించుకోవడం. కీలకమైన ఆర్థిక లక్ష్యాల కోసం కేటాయించిన తన పెట్టుబడులను నగదులోకి మార్చుకోవాల్సి ఉంటుంది. లేదా అటువంటి ఆర్థిక అవసరాలను ఎదుర్కోవడానికి చాలా ఎక్కువ వడ్డీ రేట్లకు రుణాలను పొందవలసి వచ్చింది" అని పైసా బజార్ సహ వ్యవస్థాపకుడు, సిఇఒ నవీన్ కుక్రేజ్ పేర్కొన్నారు.

అత్యవసర నిధి ఎంతుండాలి..!

ఇప్పటికే ఉన్న ఇఎంఐలు, రోజువారీ గృహ ఖర్చులు, పిల్లల ట్యూషన్ ఫీజు, యుటిలిటీ బిల్లులు, మందుల కోసం ఖర్చులు, బీమా ప్రీమియంలు మొదలైన అనివార్యమైన ఖర్చులను కనీసం 6 నెలల పాటు కవర్ చేయడానికి అత్యవసర నిధి తగినంత పెద్దదిగా ఉండాలి. తక్కువ ఆదాయం ఉన్నవారికి ఈ ఫండ్ కనీసం 12 నెలల పాటు ఈ ఖర్చులను కవర్ చేయగలగాలి. ఈ మొత్తాన్ని తక్కువ రిస్కు కలిగిన వాటిలో పెట్టుబడిగా పెట్టి ఉండాలి. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఎక్కువ మొత్తం కూడా అవసరం ఉండొచ్చని ఫిన్‌ఎడ్జ్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ అనిరుద్ధ బోస్ పేర్కొన్నారు.

146 మందిపై ఉపా కేసులు ఎత్తేయాలి

- పిఒడబ్ల్యు ధర్నాలో వక్తలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

146 మందిపై తెలంగాణ పోలీసులు పెట్టిన ఉపా కేసులు ఎత్తేయాలని ప్రగతిశీల మహిళా సంఘం (పిఒడబ్ల్యు) ధర్నాలో వక్తలు పేర్కొన్నారు. ఉపా కేసులు ఎత్తేయాలని బుధవారం ఉదయం విజయవాడ ధర్నా చౌక్‌లో పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. పిఒడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షులు ఎన్ విష్ణు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బి పద్మ మాట్లాడుతూ.. ములుగు జిల్లా తాడ్వాయి పోలీసులు 2022 ఆగస్టు 19న పిఒడబ్ల్యు జాతీయ కన్వీనరు సంధ్య, ప్రొఫెసర్ హరగోపాల్‌తోపాటు 152 మందిపై ఉపా కేసులు నమోదు చేసి ఇప్పుడు ప్రకటించారని తెలిపారు. విమర్శలు రావడంతో హరగోపాల్‌తోపాటు ఆరుగురిని కేసు నుండి మినహా యించారని, మిగిలిన 146 మందిపై కేసులు కొనసాగు తున్నాయని తెలిపారు.తెలంగాణ కోసం వీరంతా కెసిఆర్‌తో కలిసి పోరాడిన విషయాన్ని ప్రభుత్వం మర్చిపో యిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్, న్యూడెమోక్రసీ నాయకులు ప్రసాద్, అరసవెల్లి కృష్ణ, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు గనిరాజు, దుడ్డు ప్రభాకర్, సిఎంఎస్ కన్వీనర్ రాధా, కొండారెడ్డి, రామకృష్ణ తదితరులు

డబ్బు కోసమే కిడ్నాప్

- సిబిఐ విచారణ కొరతా : ఎంపి ఎంవివి సత్యనారాయణ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ, విశాఖ

డబ్బు దోచుకోవాలన్న ఉద్దేశంతోనే నిందితులు హేమంత్, రాజేష్ తన కుటుంబ సభ్యులను, మిత్రుడు జి.వెంకటేశ్వరరావు (జివి)ను కిడ్నాప్ చేశారని, ఈ సంఘటనలో రాజకీయ కోణంగానీ, వ్యాపార లావాదేవీలుగానీ లేవని విశాఖ ఎంపి ఎంవివి సత్యనారాయణ చెప్పారు. తన కుటుంబ సభ్యుల కిడ్నాప్ ఘటనపై బుధవారం ఆయన లాస్యన్స్ బే కాలనీలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరణ ఇచ్చారు. 'నాకు అనుమానం వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం అందించా.. కేవలం రెండు గంటల్లోనే నా కుటుంబ సభ్యులను రక్షించారు' అని తెలిపారు. ప్రధాన నిందితుడు హేమంత్‌తో తనకు ఎటువంటి వ్యాపార లావాదేవీలూ లేవని, ఆయనను గతంలో ఏనాడూ చూడలేదని చెప్పారు. అనుమానం ఉంటే తన కాల్ రికార్డు పరిశీలించుకోవచ్చని తెలిపారు. గతంలోనే విశాఖ నుంచి తన వ్యాపార సంస్థలను హైదరాబాద్‌కు తరలిస్తున్నట్టు ప్రకటించానని, కేవలం రాజకీయ వ్యవహారాల కోసమే ఇక్కడ ఉంటానని తెలిపారు.

కిడ్నాప్ ఉదంతంపై నిజనిజాలు వెలుగులోకి తెచ్చేందుకు సిబిఐ విచారణ జరపాలని ప్రభుత్వాన్ని కోరనున్నానని వెల్లడించారు. నిందితులు హేమంత్, రాజేష్ ఇద్దరు జైల్లోనే ప్రణాళిక వేసుకొని పథకం ప్రకారం డబ్బు కోసమే కిడ్నాప్ చేశారన్నారు.

రాజేష్‌పై ఇప్పటికే 45 కేసులు, హేమంత్‌పై 12 కేసులు ఉన్నాయని తెలిపారు. బిజెపి నాయకుడు విష్ణుకుమార్‌రాజు, జనసేన నాయకుడు పీతల మూర్తియాదవ్ ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడిన విధానం తనను తీవ్రంగా కలిచి వేసిందన్నారు. ఎంపి రఘురామరాజు మాటలు పట్టించుకోవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. తన వల్ల పార్టీకి చెడ్డ పేరు రాకూడదన్న ఉద్దేశంతోనే తాను విశాఖ వీడనున్నట్లు తెలిపారు.

500 మందులపై 80% వరకు డిస్కౌంట్

- మరో వెయ్యి స్టోర్లు తెరుస్తాం
- మెడ్‌ప్లస్ ఎండి వెల్లడి

హైదరాబాద్ : తమ బ్రాండ్ ఔషధ ఉత్పత్తులపై 50 నుంచి 80 శాతం వరకు డిస్కౌంట్ అందిస్తున్నట్లు ప్రముఖ మెడిసిన్ రిటైలర్ చెయిన్ మెడ్‌ప్లస్ ఎండి, సిఇఒ గంగడి మధుకర్ రెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన ఆసంస్థ సిఒఒ చెరుకుపల్లి భాస్కర్ రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం 500 ఆఫ్ పేటెంట్ థెరప్యూటిక్, క్రానిక్ మెడిసిన్స్ ఉత్పత్తులపై ఈ భారీ తగ్గింపును అందిస్తున్నామని వెల్లడించారు.

వచ్చే మూడు మాసాల్లో మొత్తంగా 700-800 ఉత్పత్తులపై పెద్ద మొత్తంలో డిస్కౌంట్ అందించే యోచనలో ఉన్నామన్నారు. ఇందులో హృద్రోగ, కిడ్నీ, హైపర్‌టెన్షన్ తదితర వ్యాధులకు సంబంధించిన కీలక ఔషదాలు కూడా ఉంటాయన్నారు. ఆయా ఔషదాలపై కనీస కొనుగోలు చేస్తేనే తగ్గింపు ఉంటుందేనే షరతు ఏమీ ఉండదన్నారు. నాణ్యమైన మందులను పొందడంతో పాటుగా వినియోగదారులకు పెద్ద మొత్తంలో పొదుపు కానుందన్నారు. తమకు సొంత డిస్ట్రిబ్యూషన్ సిస్టం, కాంట్రాక్టు మాన్యుఫాక్చరింగ్ వ్యవస్థ ఉండటంతో అధిక డిస్కౌంట్లను ఇవ్వగలుగుతున్నామన్నారు. ప్రస్తుతం తమకు దేశ వ్యాప్తంగా ఏడు రాష్ట్రాల్లో 3,827 మెడ్‌ప్లస్ స్టోర్లు ఉన్నాయన్నారు. 22వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారన్నారు. గతేడాది 1024 కొత్త అవుట్‌లెట్లను ఏర్పాటు చేశామని.. ఈ ఏడాది మరో 800-1000 మెడికల్ స్టోర్లను తెరువాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.4500 కోట్ల టర్నోవర్ నమోదు చేశామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 25 శాతం వృద్ధి అంచనా వేస్తున్నామన్నారు.

ఫారం G
ఆసక్తి వ్యక్తీకరణ కొరకు ఆహ్వానము
M/s RKI బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్
ప్రభుత్వ సివిల్ కాంట్రాక్ట్‌లను అమలు చేయడం
ఇన్సాల్వెన్సీ మరియు బ్యాంక్రప్టసీ బోర్డ్ ఆఫ్ ఇండియా (కార్పొరేట్ వ్యక్తుల కొరకు ఇన్సాల్వెన్సీ తీర్మాన ప్రక్రియ) రెగ్యులేషన్స్, 2016లోని రెగ్యులేషన్ 36ఎ(1) క్రింద

సంబంధిత వివరములు

1.	కార్పొరేట్ డెటార్ యొక్క పేరు వారి PAN/CIN/LLP No.	M/s RKI బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ CIN No. U45200TG2003PTC040886 PAN NO.AACCR4323C
2.	రిజిష్టర్డ్ ఆఫీస్ యొక్క చిరునామా	ప్లాట్ నెం.3/ఎ/1 & 3/ఎ/2-IDA, ఫేజ్ I TSIIC IALA చర్లపల్లి, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్-51, తెలంగాణ
3.	వెబ్‌సైట్ యొక్క URL	అందుబాటులో లేదు
4.	స్థిరాస్తులలో ఎక్కువభాగం ఉన్న స్థలం వివరాలు	హైదరాబాద్
5.	ప్రధాన ఉత్పత్తులు / సర్వీసుల ఇన్‌స్టాల్‌చేయబడిన సామర్థ్యం	స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్ (సివిల్) కాంట్రాక్ట్స్, తెలంగాణ మరియు ఎపి ప్రభుత్వాలలో నమోదు చేయబడినది. (ఒక సంవత్సరంలో రూ.500 కోట్ల వరకు కాంట్రాక్టుల కోసం వేలం వేయడానికి అర్హులు)
6.	గత ఆర్థిక సంవత్సరంలో విక్రయించబడిన ప్రధాన ఉత్పత్తులు / సేవల పరిమాణం / విలువ	ఫైనాన్షియల్ ఇయర్ 20-21: రూ.75.66 కోట్లు ఫైనాన్షియల్ ఇయర్ 21-22: రూ.27.79 కోట్లు
7.	ఉద్యోగులు / కార్మికుల సంఖ్య	4
8.	రెండు సంవత్సరాలుగా అందుబాటులో ఉన్న ఆర్థిక నివేదికలు (షెడ్యూల్స్‌తో) రుణదాతల జాబితా, ప్రక్రియ యొక్క తదుపరి ఈవెంట్‌ల సంబంధిత తేదీలతో సహా మరిన్ని వివరాలు:	cirp.rkibuilders@gmail.com నుండి మెయిల్ ద్వారా పొందవచ్చు
9.	కోడ్‌లోని సెక్షన్ 25(2)(h) క్రింద రిజల్యూషన్ దరఖాస్తుదారుకు కావలసిన అర్హతలు	పై విధముగా
10.	ఆసక్తి వ్యక్తీకరణను స్వీకరించడానికి చివరి తేదీ	07-07-2023
11.	కాబోయే రిజల్యూషన్ దరఖాస్తుదారుల తాత్కాలిక జాబితా జారీ తేదీ	17-07-2023
12.	తాత్కాలిక జాబితాపై అభ్యంతరాల సమర్పణకు చివరి తేదీ	22-07-2023
13.	EOIని సబ్మిట్ చేయడానికి ఇమెయిల్ అడ్రస్:	cirp.rkibuilders@gmail.com

తేది : 22.06.2023
ప్రదేశం : హైదరాబాద్

సం/- కల్వకొలను మురళీ కృష్ణ ప్రసాద్
రెజల్యూషన్ ప్రొఫెషనల్
IBBI/IPA-001/IP-P00967/2017-2018/11588
For RKI బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్
ప్లాట్ నెం.106, హెచ్.నెం.8-27,
మైత్రీపురం కాలనీ, వైషాలినగర్ పోస్ట్, హైదరాబాద్.

సంపాదకీయం

ఖరీఫ్ సన్నద్ధత ఏదీ?

ఈ మారు తొలకరి పలకరింపు ఆలస్యమైంది. జూన్ మూడవ వారానికీ వర్షాల్లేక ఏరువాక కదల్లేదు. ఖరీఫ్ సేద్యానికి అదను పదును తప్పేలా ఉంది. తుపాన్లు, వరదలు, అకాల వానలు, వర్షాభావం నిరుడు ఖరీఫ్ రైతుల ఉసురు తీశాయి. పంటలకు ధర సమస్య తిష్ట వేసింది. ప్రభుత్వ నిర్లిప్తత, నిర్లక్ష్యం ఉండనే ఉన్నాయి. ఈ తడవైనా ఖరీఫ్ పంటలు వేయబోతే ఆదిలో హంసపాదులా నైరుతి రుతుపవనాలు ఆలస్యమయ్యాయి. సీజన్‌లో 21 రోజులు గడిచినా మబ్బు జాడ లేదు. ఆ ప్రాంతం ఈ ప్రాంతం అని లేకుండా అధిక ఉష్ణోగ్రతలు, వడగాలులు, ఉక్కపోతలు కొనసాగుతున్నాయి. రాష్ట్రంలో ఇప్పటికి పడాల్సిన సాధారణ వర్షంలో 61 శాతానికిపైన తక్కువ పడింది. చిత్తూరు మినహా అన్ని జిల్లాలూ 50-80 శాతం వర్షపు లోటు ఎదుర్కొంటున్నాయి. ఎ.పి.లో 679 మండలాలుండగా 527 చోట్ల తక్కువ వర్షం పడింది. 11 మండలాల్లో చినుకు లేదు. 91 మండలాల్లో మాత్రమే నార్మల్, అంతకంటే కొంచెం వర్షం కురిసింది. ఈ గణాంకాలు ప్రభుత్వానివి. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులు భయంకరంగా ఉన్నాయి.

వ్యవసాయ రాష్ట్రం ఎ.పి.కి ఖరీఫ్ కీలకమైనది కాగా రానురాను రైతులకు సీజన్ భారంగా కష్టంగా తయారైందని సాగు లెక్కలు తెలుపుతున్నాయి. గతేడాది నిర్ణయించుకున్న సాధారణ సాగు విస్తీర్ణంలో ఐదున్నర లక్షల ఎకరాల్లో విత్తనం పడక బీడు పడ్డాయి. రబీలోనూ పది లక్షల ఎకరాల్లో పంటల్లేక ఖాళీ పడ్డాయి. క్రమేపి సాగు తగ్గుతుండటంతో నిర్ణయించుకునే నార్మల్ సాగు అంచనాలూ తగ్గిపోతున్నాయి. ఉదాహరణకు నిరుడు ఖరీఫ్ కంటే ఈ సారి ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం ఆరు లక్షల ఎకరాలు పడిపోయింది. ఒక్క సంవత్సరంలో అన్నేసి లక్షల ఎకరాల తగ్గుదల ఆందోళన కలిగిస్తుంది. రాయలసీమలో వేరుశనగ విస్తీర్ణం తగ్గి పత్తి, ఇతర వాణిజ్య పంటలు పెరుగుతున్నాయి. ధాన్యాగారాలైన గోదావరి, కృష్ణా, పెన్నా డెల్టాలలో వరి కుదించుకుపోయి ఆక్వా, ఇతర కమర్షియల్ క్రాప్స్ వేస్తున్నారు. ఈ ధోరణులు ప్రభుత్వాల విధానాల పర్యవసానాలు. ఏ పంట వేసినా పెట్టుబడులకు కనీస గ్యారంటీ లేనందున సేద్యం రైతులకు జూదాన్ని తలపిస్తోంది. అందుకే తలో దిక్కు పోయి చేతులు కాల్చుకొని నష్టపోతున్నారు. చివరికి చిన్న, సన్నకారు, మధ్యతరగతి రైతులతో స్వంత వ్యవసాయం మాన్పించి కార్పొరేట్ల చెప్పుచేతల్లోకి చేర్చే కుట్ర జరుగుతోంది. ఇది రైతాంగానికి ప్రజల ఆహార భద్రతకు ప్రమాదం.

ఖరీఫ్ సన్నద్ధతకు రాష్ట్ర ప్రభుత్వం అంతగా ప్రాధాన్యత ఇవ్వనట్లే కనిపిస్తోంది. పంటలేయాలంటే రైతులకు కావాల్సినవి అదనకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పరపతి, సాగునీరు. వర్షాలు పడలేదు కాబట్టికానీ, లేకపోతే విత్తనాల కోసం వెదుకులాటే. రాయితీ వేరుశనగ విత్తన పంపిణీని మమ అనిపించారు. ఇండెంట్ బాగా తగ్గించారు. వరి, ఇతర పంటలదీ అదే తీరు. నిరుడు నకిలీ, కల్తీ మిర్చి విత్తనాలు, నారుతో రైతులు భారీగా నష్టపోయారు. పత్తి విత్తనాలూ అంతే. ఇప్పటి వరకు రైతులకు నష్ట పరిహారం అందలేదు. కాగా ఈ ఏడాది ఖరీఫ్ మొదలుకాకముందే చాలా చోట్ల నకిలీ విత్తనాలను సీజ్ చేశారు. పట్టుకున్నది గోరంత, పట్టుకోకుండా చెలామణి అవుతున్నది కొండంత. పురుగు మందుల అక్రమాలు చెప్పనలవికావు. నాణ్యత విషయంలో రాజీ లేదని ప్రభుత్వం హూంకరిస్తుండగా జరిగేది జరిగిపోతోంది. నిరుడు ఎరువుల సరఫరాలో అస్తవ్యస్తత వలన అదనుకు ఎరువులు దొరక్క రైతులు ఇబ్బందులు పడ్డారు. బ్యాంక్ రుణాల లక్ష్యాలు వందకు వంద శాతం చేరాయంటున్నా కౌలు రైతుల పరపతి అధమస్తంగా ఉంది. కేంద్ర బీమా పథకంలో చేరడంతో ఖరీఫ్ బీమా ఇంకా అందలేదు. అకాల వర్షాల బారిన పడ్డ రైతుల్లో చాలా మందికి పరిహారం దక్కలేదు. రైతు భరోసా చాలా మందికి పడలేదు. పి.ఎం కిసాన్ జాడ లేదు. కేలండర్ ప్రకారం కాల్వలకు నీళ్లొదులుతున్నామంటున్నా చివరి భూములకు అందట్లేదు. మరమ్మతుల్లేక కాల్వల్లో తగినంత నీరు పారట్లేదు. రిపేర్లు లేక చిన్న వానలకే డ్రైన్లు పొంగి పొలాలపై పడుతున్నాయి. శ్రీశైలం దగ్గరే రిపేర్లు లేవు. ప్రభుత్వం మాత్రం ఆర్‌బికెల జపం చేస్తోంది. ఏర్పాట్లు లేకుండా ఖరీఫ్ సజావుగా సాగదు. ప్రభుత్వం ఖరీఫ్ సన్నద్ధతపై దృష్టి నిలపాలి.

మహనీయుల మాట

ఒక దేశం అనేకానేక కుటుంబాల సమాహారం. ఇంట్లో న్యాయం, సమానత్వం పాటించకుండా...అవి ప్రజా జీవితంలో మాత్రం ఉండాలని ఆశించలేం. ఇంట్లో అణచివేతకు పాల్పడే పురుషుడు...వీధి లోకి, చట్టసభల లోకి, న్యాయస్థానాల లోకి వచ్చే సరికి హఠాత్తుగా మారిపోయి సాధువు కాలేడు.

-సుబ్రమణ్య భారతి,
స్వాతంత్ర్య సమరయోధుడు,
సంఘ సంస్కర్త.

తల్లిదండ్రుల మూలుగలు పీలుస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలు

సమస్య

ఆంజనేయ రాజు

రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో కలిపి దాదాపు 62,063 పాఠశాలలున్నాయి. ఇందులో ప్రాథమిక, ప్రీ-ప్రైమరీ, ఎలిమెంటరీ, సెకండరీ, సీనియర్ సెకండరీ పాఠశాలలు ఉన్నాయి. భారతదేశంలోని గ్రామీణ ప్రైవేట్ పాఠశాలల్లో చేరిన పిల్లల వాటా గురించి 2018లో నిర్వహించిన సర్వే ప్రకారం...7 నుండి 10 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలలో దాదాపు 39.5 శాతం మంది గ్రామీణ ఆంధ్రప్రదేశ్ లోని ప్రైవేట్ పాఠశాలల్లో చేరారు. అలాగే 11 నుండి 16 సంవత్సరాల వయసున్న పిల్లలు 32 శాతానికి పైగా ప్రైవేటు పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. పైలెక్కలను చూస్తే ప్రాథమిక, మాధ్యమిక విద్యలో ప్రైవేటు పాఠశాలల పాత్ర గణనీయమైనదని అర్థమవుతుంది. ఇంత ప్రాముఖ్యత గలిగిన ప్రైవేటు పాఠశాలలు విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రమాణాలు పాటిస్తున్నాయో లేదో చూసుకోవలసిన బాధ్యత ప్రభుత్వం మీద ఉన్నది. కానీ ప్రైవేటు పాఠశాలల నిర్వహణ పట్ల ప్రభుత్వం ఉదాసీనతతో వ్యవహరిస్తున్నది.

ఈ ప్రైవేటు పాఠశాలలు విద్యా హక్కు చట్టాన్ని బాహాటంగానే ఉల్లంఘిస్తున్నాయనేది జగమెరిగిన సత్యం. పోయిన సంవత్సరం మొదటిసారిగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో నర్సరీ నుండి పదో తరగతి వరకు, ప్రైవేట్ ఎయిడెడ్ జూనియర్ కాలేజీలలో ఇంటర్మీడియట్ కోర్సుల కోసం 2023-24 వరకు ఫీజులను నిర్ణయించింది. ప్రభుత్వం ప్రాథమిక విద్య అయిన నర్సరీ నుండి 5వ తరగతి వరకు పంచాయతీలలో రూ. 10,000, మునిసిపాలిటీలలో రూ. 11000, మునిసిపల్ కార్పోరేషన్లలో రూ. 12000గా నిర్ణయించింది. అలాగే మాధ్యమిక విద్య అయిన 6 నుండి 10వ తరగతులకు పంచాయితీలలో రూ.12000, మునిసిపాలిటీలలో రూ.15000, మునిసిపల్ కార్పోరేషన్లలో రూ. 18000గా నిర్ణయించింది. కానీ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు బాహాటంగానే ఈ ఫీజు నియమాలను ఉల్లంఘిస్తున్నాయి. పంచాయితీలలో సాధారణంగా ప్రైవేటు పాఠశాలలు తక్కువగా ఉంటాయి, మండల కేంద్రాలలోనే ప్రైవేటు పాఠశాలలు కేంద్రీకృతం అయ్యి విద్యార్థులను బస్సుల ద్వారా పాఠశాలలకు రవాణా చేస్తూ ఉంటాయి. మండల కేంద్రాలలో సరాసరి ప్రతి ప్రైవేటు పాఠశాల నర్సరీ, 5వ తరగతి విద్యార్థుల నుండి రూ. 10,000 వేల నుండి రూ. 25,000 వరకు వసూలు చేస్తున్నాయి. అలాగే మాధ్యమిక విద్య అయిన 6 నుండి పదవ తరగతులకు రూ. 20,000 నుండి రూ.60,000 వేల వరకు వసూలు చేస్తున్నాయి. దీనికి అదనంగా ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు బహిరంగంగానే అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రాథమిక తరగతుల విద్యార్థుల నుండి రూ.3 వేల నుండి రూ.5 వేల వరకు, అలాగే మాధ్యమిక విద్యార్థుల నుండి రూ.5 వేల నుండి రూ.10 వేల వరకు పుస్తకాలు అమ్ముతున్నాయి. వేల రూపాయల పుస్తకాలను అంత చిన్న వయసులోనే ఎందుకు కొనిపిస్తున్నారో తెలియక తల్లిదండ్రులు సతమతమవుతున్నారు. డిగ్రీ వంటి పైచదువులకు కూడా పుస్తకాల ఖర్చు సంవత్సరానికి రూ. 3000కు మించదు. అలాంటిది పాఠశాల స్థాయిలోనే తల్లిదండ్రుల నుండి ఈ ప్రైవేటు యాజమాన్యం ఫీజులకు అదనంగా వేలకు వేల రూపాయలను పుస్తకాల పేరుతో దోచుకుంటున్నాయి.

ఇలా బాహాటంగా చట్టాలను ఉల్లంఘిస్తున్నప్పటికీ ప్రభుత్వం, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఎక్కడైనా విద్యార్థి సంఘం నాయకులు విషయాలను గుర్తించి ఆందోళన చేసినట్లైతే అధికారులకు రాజకీయ నాయకుల నుండి వత్తిళ్లు వస్తాయి. అధికారుల ఉదాసీనతపై చర్యలు తీసుకుంటామని చెప్పి ఏదోరకమయిన రాజీ కుదురుస్తున్నారు.

విద్యా హక్కు చట్టం ప్రకారం 1 నుండి మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న ఈ ప్రైవేటు పాఠశాలలు 25 శాతం పేద విద్యార్థులకు ఉచిత విద్య చెప్పాలని చట్టం చెబుతున్నాగానీ ఎక్కడా అమలు చేయటం లేదు. నూతన విద్యావిధానం పేరుతో ప్రాథమిక పాఠశాలలను కూడా ప్రభుత్వం దుర్మార్గంగా దగ్గరలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలల్లో కలిపి పేద పిల్లలు బడికి దూరం అయ్యేలా చేస్తున్నది. విద్యార్థులను ఆటోలలో తరలించకూడదని చట్టం చెబుతున్నా సెవెన్ సీటర్ ఆటోలలో పాఠశాలలకు తీసుకువెళు తున్నారు. ఇలా ప్రయాణ సమయాలలో ప్రమాదాలు జరిగిన ఉదంతాలు ఎన్నో వున్నాయి. ప్రమాదం జరిగినపుడు కొంత హడావుడి చేసే అధికారులు చివరగా యాజమాన్యానికే మద్దతు తెలిపి ఏ చర్యా తీసుకోకపోవటమో లేదా నామమాత్రపు చర్యలు తీసుకోవటమో పరిపాటిగా మారింది.

ఇక ప్రైవేటు పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయుల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఉపాధ్యాయులకు మండల కేంద్రాలలో రూ. 5000 నుండి గరిష్ఠంగా రూ. 13000 వరకు జీతం చెల్లిస్తున్నారు. ఈ చాలీచాలని జీతాలతో ఉపాధ్యాయులకు కుటుంబ పోషణ కష్టంగా మారింది. కరోనా కాలంలో ఎంతో మంది ఉపాధ్యాయులు కూలిపనులకు వెళ్ళటం వంటి దృశ్యాలు ప్రజలందరినీ కలచివేశాయి. ఉపాధ్యాయుల మీద ప్రేమతో పూర్వపు విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు ఆదుకున్నాయి తప్పితే ప్రభుత్వం గానీ పాఠశాల యాజమాన్యం గానీ ఆదుకున్నది శూన్యం. విద్య అనేది వ్యాపారం కాదు ధార్మికమైనదిగా ఉండాలని విద్యా హక్కు చట్టం చెబుతున్నా బహిరంగంగా వ్యాపారమయం అయ్యింది. విద్యా హక్కు చట్టం ప్రకారం ఫీజుల సొమ్ము మొత్తంలో 95 శాతం ఉపాధ్యాయుల జీతాలు, విద్యార్థుల సదుపాయాలకు ఉపయోగించాలని యాజమాన్య లాభం 5 శాతానికి మించకూడదని చెబుతున్నా ఎవరూ పాటించటం లేదు. ఉపాధ్యాయులకు వేసవి సెలవులలో కూడా జీతం చెల్లించాలని చట్టం చెబుతున్నప్పటికీ యాజమాన్యం వారు అడ్మిషన్ల కోసం ఊరూరా తిరిగి విద్యార్థులను చేర్పితేనే ఇస్తామని మెలిక పెడుతున్నారు. వారికి టార్గెట్లు పెట్టి ఉపాధ్యాయులను ఇబ్బంది పెడుతున్నారు.

చట్ట ఉల్లంఘనకు పాల్పడుతున్న ఈ సంస్థలు విద్యార్థులకు మంచి చదువు అందిస్తున్నాయా అంటే అదీ లేదు. కార్పోరేటు కంపెనీలకు మానవ యంత్రాలను తయారు చేసే విధంగా పని చేస్తున్నాయి. విద్యార్థులకు సామాజిక అంశాలను నేర్పటం లేదు. కెరీరిజం వంటి వ్యక్తిగత పోకడలను విద్యార్థుల మెదళ్లలోకి ఎక్కించి పంపిస్తున్నాయి. మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం కోసం అవసరమైన క్రీడలను విద్యార్థులకు నామమాత్రంగా అందిస్తున్నాయి. 10వ తరగతికి దగ్గరయిన విద్యార్థులకు 8వ తరగతి నుండి 365 రోజులు పాఠాలను బట్టీ పట్టిస్తున్నాయి. టీం వర్కు, సహకారం వంటి అంశాలను నేర్పకపోవటం వలన ఉద్యోగ సమయాలలో, అలాగే సమాజంలోకి వచ్చిన తరువాత వారు సమిష్టి కార్యక్రమాలను సరిగా నిర్వహించలేకపోతున్నారు. ఒత్తిడికి తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న విద్యార్థులను అనేకమందిని చూస్తున్నాం. ఎక్కువగా ప్రైవేటు సంస్థలలో చదువుతున్న వారే బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఈ సంస్థలు సున్నితమయిన బాల్యాన్ని, వారి సృజనాత్మకతను నాశనం చేస్తున్నాయి. తల్లిదండ్రుల దగ్గర ఉన్న సొమ్మును ప్రాథమిక, మాధ్యమిక విద్య సమయంలోనే మొత్తం లాగేసుకుంటే పైచదువులకు అవసరమైన సొమ్ము వారి దగ్గర మిగలడంలేదు. అందుకే మన దగ్గర ఎక్కువ మంది విద్యార్థులను ఫీజు రీయంబర్స్‌మెంటు ఉన్న ఇంజనీరింగు లోనే చేరుస్తున్నారు. సాధారణ మండల కేంద్రాలలో ఇద్దరు పిల్లలు ఉన్న కుటుంబం వారి చదువు కోసం సంవత్సరానికి రూ. 50000 నుండి రూ.100000 వరకు వెచ్చించాల్సి వస్తుందంటే అతిశయోక్తి కాదు. ఒక సాధారణ రైతు, కార్మికుడికి ఆఖరికి మధ్యతరగతి ఉద్యోగికి ఈ ఖర్చు కత్తి మీద సాము లాగా మారుతుంది. ఈ కారణంగా ఆ కుటుంబాలు తీసుకునే ఆహారం, కుటుంబ సదుపాయలను తగ్గించుకుంటున్నాయి. ఆహారం తగ్గించుకోవటం వల్ల పిల్లలలో ఎదుగుదల తగ్గి శారీరకంగా బలహీనంగా ఉన్న భావిపౌరులు సమాజంలోని నెట్టబడుతున్నారు.

ప్రభుత్వాలు ఏటికి ఏడు స్వాతంత్ర్య ఆకాంక్షలను తుంగలో తొక్కుతూ విద్యకు కేటాయించాల్సిన నిధులను తగ్గిస్తున్నాయి. చట్ట ఉల్లంఘనలపై ఉదాసీనత ప్రదర్శిస్తూ ప్రైవేటీకరణకు సహకరిస్తున్నాయి. విద్యార్థులపై, ప్రజలపై భారాలు మోపుతున్నాయి. ప్రపంచబ్యాంకు, ఐ.ఎం.ఎఫ్ సంస్థల ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వం ఉచిత విద్యను అందించే బాధ్యత నుండి తప్పుకుంటున్నది. 90 శాతానికి పైగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేవని 2019లో ప్రజాసంఘాలు పల్నాడు ప్రాంతంలో నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. నాడు-నేడు కార్యక్రమం రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించింది. ఇది ఆహ్వానించదగ్గ విషయం. అయితే వాటిని సక్రమంగా నిర్వహించటానికి అవసరమైన నిధులను అందించవలసిన బాధ్యత ప్రభుత్వం మీద వుంది. 85 శాతానికి పైగా పాఠశాలల్లో భర్తీ చేయవలసిన పోస్టులున్నాయి. ప్రభుత్వం ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులు నింపకుండా మీనమేషాలు లెక్కిస్తున్నది. పరోక్షంగా ప్రైవేటు పాఠశాలల్లో మరింతమంది విద్యార్థులు చేరటానికి సహకరిస్తున్నది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నయా ఉదార విధానాలకు తల వంచకుండా విద్యకు జిడిపి లో కనీసం 6 శాతం నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి. చట్ట ఉల్లంఘన చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి. అప్పుడే భారాల నుండి ప్రజలు ఉపశమనం పొందగలుగుతారు. అమ్మ వడి లాంటి సంక్షేమ పథకాలు కొంత ఉపశమనం కలిగిస్తాయే తప్ప భారాల నుండి దూరం చేయవు. విద్యార్థులు, ప్రజలు సంఘటితమై ఉచిత విద్యను ప్రాథమిక హక్కుగా ప్రభుత్వాలకు గుర్తు చేసి, విద్యని తప్పనిసరిగా పూర్తి ప్రభుత్వ రంగంలోనే ఉండేలా ప్రభుత్వం మెడలు వంచి సాధించుకోవాలి.

(వ్యాసకర్త డివైఎఫ్ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి)



నాడు-నేడు కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించింది. ఇది ఆహ్వానించదగ్గ విషయం. అయితే వాటిని సక్రమంగా నిర్వహించటానికి అవసరమైన నిధులను అందించవలసిన బాధ్యత ప్రభుత్వం మీద వుంది. 85 శాతానికి పైగా పాఠశాలల్లో భర్తీ చేయవలసిన పోస్టులున్నాయి. ప్రభుత్వం ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులు నింపకుండా మీనమేషాలు లెక్కిస్తున్నది. పరోక్షంగా ప్రైవేటు పాఠశాలల్లో మరింతమంది విద్యార్థులు చేరటానికి సహకరిస్తున్నది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నయా ఉదార విధానాలకు తలవంచకుండా విద్యపై జిడిపిలో కనీసం 6 శాతం నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి. చట్ట ఉల్లంఘన చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి. అప్పుడే భారాల నుండి ప్రజలు ఉపశమనం పొందగలుగుతారు.

రాబందుల రెక్కల చప్పుడు

సందర్భం

ఉందుర్తి సుధాకర్

ఆలోచనాపరులనూ సామాజిక పరిశోధకులనూ ఇప్పటికీ ఒక ప్రశ్న వేధిస్తూ ఉంటుంది: 'ఉత్తమ స్థాయి తత్వవేత్తలకూ మత సంస్కర్తలకూ శాస్త్రవేత్తలకూ కష్టించి పనిచేసే స్వభావం కలిగిన శ్రామికవర్గానికీ అత్యంత నాణ్యమైన ఉత్పత్తులను అందించే పరిశ్రమలకూ విద్యావంతులైన మధ్యతరగతికీ నిలయంగా ఉండిన జర్మనీలో హిట్లర్ వంటి పరమ మూర్ఖుడు, యుద్ధోన్మాది...అలాగే నేరచరిత్ర కలిగిన అతని పార్టీ నేతలు ఎలా అధికారంలోకి వచ్చారు?'.

1920-30ల నాటి ఐరోపా ఖండంలోని పరిస్థితుల్ని గమనిద్దాం. పారిశ్రామికంగా అత్యంత వేగవంతమైన అభివృద్ధిని చవిచూసిన ఇంగ్లాండు లోనో లేదా జర్మనీ లోనో సోషలిస్టు విప్లవం వస్తుందని మార్క్స్‌తో సహా సిద్ధాంతకారులంతా ఊహించారు. ఆ దేశాల్లో పటిష్టమైన కార్మికవర్గం అప్పటికే సంఘటితమై ఉంది. పెట్టుబడిదారీ వ్యవస్థను నడిపించే దురాశ, తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కుంటుందని మార్క్స్ సూత్రీకరించి ఉన్నాడు. 1929 నాటి ఆర్థిక సంక్షోభం, అతని మాటను నిజమని మరోసారి నిరూపించింది. రాత్రికిరాత్రే అమెరికా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది. వ్యాపారాలు మూతబడ్డాయి.

కంపెనీలు బోర్డులు తిప్పేశాయి. లక్షలకొద్దీ ఉద్యోగులు, కార్మికులు వీధిన పడ్డారు. వారి కుటుంబాలు చితికిపోయాయి. ఇవన్నీ పెట్టుబడికి ఆలవాలమైన అమెరికా, ఐరోపాలలో జరిగినప్పటికీ, సంక్షోభపు దుష్ఫలితాలు ప్రపంచాన్ని కుదిపివేశాయి.

జర్మన్ ఆర్థిక వ్యవస్థ కూడా అతలాకుతలం అయిపోయింది. డబ్బుకి విలువ లేకుండా పోయింది. కరెన్సీ నోట్లు చిత్తుకాగితాలయ్యాయి. ఈ సంక్షోభానికి కారకులు యూదులే అని హిట్లర్ ప్రకటించాడు. ఆ అపవాదును గోబెల్స్ సహకారంతో పెద్ద ఎత్తున ప్రచారం చేశాడు. ఆర్థిక, సామాజిక సంక్షోభాలను ఫాసిస్టులు తమ రాజకీయ ఎదుగుదలకూ, ప్రత్యర్థులను తుదముట్టించడానికీ, ప్రజాస్వామిక వ్యవస్థలను నిర్మూలించి, నిరంకుశాధికారాన్ని చేజిక్కించుకోవడానికీ అత్యంత సమర్థవంతంగా వినియోగించుకుంటారని చరిత్ర ఘోషిస్తూనే ఉంది. కానీ ఆనాటికది కొత్త. మొదటి ప్రపంచ యుద్ధంలో ఓడిపోయి, ఇతర ఐరోపా దేశాల అత్యాశకు బలికావడం మూలాన జర్మన్ ప్రజలలో పేరుకుపోయిన అసంతృప్తి, అవమానభారం కూడా నాజీలకు ఉపయోగపడింది.

గోబెల్స్ ప్రింటు మాధ్యమాన్ని, రేడియోను హస్తగతం చేసుకొని పూర్తిస్థాయిలో తిమ్మినిబమ్మి చేశాడు. ప్రజల్ని గందరగోళానికి గురిచేశాడు. హిట్లర్ విజయాలకు, నాజీ పార్టీ సృష్టిస్తున్న 'నూతన జర్మనీ'కి విశేషమైన ప్రచారం కల్పించాడు. నాజీ పార్టీ అభిప్రాయాలతో బహిరంగంగా విభేదించే అవకాశం లేకుండా చేశాడు. స్వచ్ఛమైన జర్మన్ రక్తం, అన్ని జాతుల్లోకీ మిన్న అయిన ఆర్యులదేననీ, మిగతా జాతులు పూర్తిస్థాయి మానవులే కాదనీ నాజీలు నమ్ముతారు.

నాజీ మూకలు యూదుల దుకాణాలపై, వ్యాపారాలపై దాడులు చేశాయి. యూనివర్సిటీలపై, గ్రంథాలయలపై దాడులు చేసి పెద్ద స్థాయిలో పుస్తకాలను తగలబెట్టారు. విద్యార్థి సంఘాలను నిషేధించారు. విద్యా వ్యవస్థను సమూలంగా 'సంస్కరించారు'.

ఒకనాటి అర్థరాత్రి కొంతమంది నాజీ గూండాలు పార్లమెంటు భవనానికి నిప్పంటిచారు. ఈ బృందానికి హిట్లర్ ప్రధాన అనుచరుడైన గోరింగ్ నాయకుడని అంటారు. పార్లమెంటును తగులబెట్టింది కమ్యూనిస్టులని ప్రకటించి ఆ పార్టీని నిషేధించారు. కమ్యూనిస్టు నాయకుల్ని దేశద్రోహులుగా చిత్రించి, జైళ్లకు పంపారు.

ఉదారవాదులతోనూ, సోషలిస్టులతోనూ నిండిన జర్మన్ పార్లమెంటరీ రాజకీయ వ్యవస్థ హిట్లర్‌నీ, అతని పార్టీ సభ్యుల్నీ చాలా కాలంపాటు జోకర్లుగా భావించి పట్టించుకోలేదు. నిజానికి హిట్లర్, కొద్దికాలం జైల్లో ఉన్నప్పుడు రాసిన 'మెయిన్ కాంఫ్' పుస్తకంలో తన లక్ష్యాలను, పథకాలను స్పష్టంగా వెల్లడించాడు. వాటినే ఆ తరువాత ఆచరణలో పెట్టాడు.

ఆర్థిక సంక్షోభం ఇచ్చిన అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకొని, యూదుల్నీ, బోల్షివిక్కుల్నీ జర్మన్ ప్రజలకు బద్ధశత్రువులుగా చిత్రించి, మేధావులను తూలనాడుతూ, ప్రత్యర్థులను హేళన చేస్తూ, వారి సమావేశాలను భగ్నంచేస్తూ, వీధి రౌడీల ఎత్తుగడలను ఆచరిస్తూ, పార్లమెంటులో చర్చలు జరగకుండా అడ్డుకుంటూ, నాజీలు తమ నిరంకుశ అధికారానికి ఎదురులేకుండా చేసుకున్నారు. తమ ప్రత్యర్థుల్ని ఒక్కరొక్కరుగా నిర్మూలిస్తూ వచ్చారు.

యూదులు ప్రత్యేక గుర్తింపు పత్రాలను కలిగి ఉండాలని, భుజాలకు పచ్చరంగు గుడ్డను చుట్టుకోవాలని ఉత్తర్వులు జారీ చెయ్యడంతో మొదలుపెట్టి, లక్షలాది యూదుల్నీ, రాజకీయ ప్రత్యర్థుల్నీ కాన్సంట్రేషన్ క్యాంపులకు తరలించి, గ్యాస్ చాంబర్లలో చంపించడం వరకూ నడిచిన నాజీల దుష్టచరిత్ర...మానవులలో ఇంత క్రూరత్వం ఉంటుందా అనిపించి జగుప్స కలిగిస్తుంది. తాను కారణ జన్ముడననీ, జర్మన్ ప్రజలను ఉద్ధరించడానికే తాను పుట్టాననీ హిట్లర్ దృఢంగా నమ్మాడు. ఒకవైపు పశ్చిమ రంగంలో ఫ్రాన్సు, ఇంగ్లాండులతో యుద్ధం జరుగుతూండగానే, మరోవైపు సోవియట్ యూనియన్‌పై ఆకస్మిక దాడి చేసి తూర్పు దిశగా కూడా యుద్ధరంగానికి తెర తీశాడు. 1941 జూన్ 22 నాటి దుర్దినాన 30 లక్షల మంది సైనికులతో జర్మన్ సైన్యం, సోవియట్ యూనియన్‌పై విరుచుకు పడింది. మితిమీరిన ఆత్మవిశ్వాసంతో ఉభయ రంగాలలో యుద్ధానికి పూనుకోవడమే అతని సేనల పరాజయానికి ప్రధాన హేతువు. ఆరు నెలలపాటు సాగిన అత్యంత భీకరమైన స్టాలిన్‌గ్రాడ్ పోరాటంలో ఎర్ర సైన్యం ఘన విజయాన్ని సాధించింది. జర్మన్లపై ప్రతి దాడి మొదలైంది. సోవియట్ సైన్యం బెర్లిన్ నగరాన్ని చుట్టుముట్టినప్పుడు బంకర్‌లో తలదాచుకున్న హిట్లర్ ఆత్మహత్య చేసుకున్నాడు. యుద్ధానంతరం జర్మనీ రెండు ముక్కలైంది.

నాజీలు అధికారాన్ని హస్తగతం చేసుకున్న క్రమం ప్రజాస్వామ్యవాదులు వహించాల్సిన జాగరూకతకై హెచ్చరికగా చరిత్రలో మిగిలిపోయింది. అలాగే నాజీల పతనం తప్పదని... ప్రజాశక్తులదే అంతిమ విజయం అని ఢంకా బజాయించి చెబుతుంది. అయితే నాజీల ఎదుగుదల-పతనాల నడుమ లక్షలకొద్దీ సామాన్యులు తమ ప్రాణాలను పోగొట్టుకోవడమే అత్యంత విషాదం.

నియంతలు అధికారంలోకి రావడానికి ప్రధాన కారణాలు ఆర్థిక-సామాజిక సంక్షోభం, ప్రజలలో తీవ్రమైన అసంతృప్తి, ఒక సమూహాన్ని శత్రువులుగా చిత్రించడం, బూటకపు ప్రచారం. జర్మన్ ప్రజలు జాగరూకతతో మెలిగి, ఆ నాటి ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టి ఉంటే...? ఈ సందర్భంగా జర్మన్ మతగురువు నీల్ ముల్లర్ (1892-1984) మాటల్ని గుర్తుచేసుకోవాలి:

మొదట వారు కమ్యూనిస్టుల కోసం వచ్చారు. నేను మాట్లాడలేదు - ఎందుకంటే నేను కమ్యూనిస్టుని కాదు.

వారు ట్రేడ్ యూనియనిస్టుల కోసం వచ్చారు. నేను మాట్లాడలేదు - ఎందుకంటే నేను ట్రేడ్ యూనియనిస్టుని కాదు.

పిదప వారు కేథలిక్కుల కోసం వచ్చారు. నేను మాట్లాడలేదు - ఎందుకంటే నేను కేథలిక్కుని కాదు.

అప్పుడు వారు యూదుల కోసం వచ్చారు. నేను మాట్లాడలేదు - ఎందుకంటే నేను యూదుని కాదు.

చివరికి వారు నాకోసం వచ్చారు. నా కోసం మాట్లాడేందుకు ఇంకెవరూ మిగల్లేదు.

/ ఆపరేషన్ బార్బరోసా దాడి (22 జూన్, 1941) జరిగి 82 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా /
/ వ్యాసకర్త సెల్ : 9000 6010 68 /

యూదులు ప్రత్యేక గుర్తింపు పత్రాలను కలిగి ఉండాలని, భుజాలకు పచ్చరంగు గుడ్డను చుట్టుకోవాలని ఉత్తర్వులు జారీ చెయ్యడంతో మొదలుపెట్టి, లక్షలాది యూదుల్నీ, రాజకీయ ప్రత్యర్థుల్నీ కాన్సంట్రేషన్ క్యాంపులకు తరలించి, గ్యాస్ చాంబర్లలో చంపించడం వరకూ నడిచిన నాజీల దుష్టచరిత్ర...మానవులలో ఇంత క్రూరత్వం ఉంటుందా అనిపించి జగుప్స కలిగిస్తుంది.

జర్మన్ దళాలు 1941లో రష్యా లోకి ప్రవేశించినప్పటి దృశ్యం

కవిత్వం

నోట్లు కనిపించటం లేదు...?

రెండు సంవత్సరాల నుంచి
రెండు వేల నోట్లు ...అస్సలు
కంటికి కనిపించటం లేదు...???
ఎక్కడ తిష్ట వేసాయో...
మేధావులు వెతికి పెట్టుకోవాలి..!
నల్ల ధనాన్ని వెలికి తీద్దామని..
అవినీతి డబ్బులు అంత మొందించేందుకు
ఉగ్రవాదాన్ని తరిమి కొట్టేందుకు
భీష్మ ప్రతిజ్ఞ చేసి ....
ఎనిమిది సంవత్సరాలు క్రితం ఏలికలు
వెయ్యి నోట్లను రద్దు చేసి
రెండు వేలు కొత్త నోట్లను
లక్షల కోట్లు ముద్రించారు..!!
రెండు వేల నోట్లు చెలామణీ లోకి వచ్చాక
పాలకుల లక్ష్యాలు ఇసుమంత నెరవేర
లేదు గాని....
రాజకీయ అవినీతి రెట్టింపయిందని
మేధావుల మనోగతం.!?
కరోనా కాలంలో
కంటికి కనిపించిన... రెండు వేల నోట్లు
అనంతరం అదృశ్యమయ్యాయి!!?
అప్పటి నుంచి రెండు వేల నోట్లు
సామాన్యుడి జేబులో కనిపించటం
లేదు...?
మరలా రెండు వేల నోట్లు రద్దుతో ....
బడా రాజకీయ నాయకుల ముడుపులు
పెట్టెలోంచి
వాణిజ్యవేత్తల దోపిడీ ఖజానా నుండి
గులాబీ రంగు రెండు వేల నోట్లు..
మెల్లగా బయటకు వస్తున్నాయి..!!!
దొంగలెవరో.. దొరికారు కదండీ..!

- సుకవి, దివిసీమ.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

జెఎన్‌టియు ఇంజినీరింగ్ విభాగాలకు ఎన్‌బిఎ గుర్తింపు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాలలోని కెమికల్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాలకు మూడు సంవత్సరాల పాటు నేషనల్ బోర్డ్ అఫ్ అక్రిడేషన్(ఎంబిఎ) గుర్తింపు వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.సుజాత తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ యూనివర్సిటీ అధికారులు, కళాశాల భోధన, భోధనేతర సిబ్బంది సహాయంతో 2025 సంవత్సరం వరకు సివిల్, కెమికల్ ఇంజినీరింగ్ విభాగాలకు ఎన్‌బిఎ గుర్తింపు సాధించగలిగామని తెలిపారు. జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల నేషనల్ బోర్డ్ అఫ్ అక్రిడేషన్ గుర్తింపు పొందిన సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపాల్, భోధన, భోధనేతర సిబ్బందికి ఉపకులపతి జి.రంగజనార్ధన, రెక్టార్ ఆచార్య యం.విజయకుమార్, రిజిస్ట్రార్ ఆచార్య సి. శశిధర్‌లు అభినందనలు తెలిపారు.

కోమలమ్మ సత్రంలోకి శ్రీనివాస కల్యాణం ప్రాజెక్ట్

తిరుపతి బ్యూరో : తిరుపతి శ్వేత భవనంలోని టిటిడి శ్రీనివాస కల్యాణం , వైభోత్సవాల ప్రాజెక్ట్ కార్యాలయాన్ని కోమలమ్మ సత్రం ప్రాంగణంలోకి మార్చారు. ఈ సందర్భంగా జెఇఒ మాట్లాడుతూ...టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, ఇఒ ఎవి ధర్మారెడ్డి సూచనల మేరకు 1.5 ఎకరాల విస్తీర్ణంలోని కోమలమ్మ సత్రం లో శ్రీనివాస కల్యాణం ప్రాజెక్ట్‌లోని స్వామి అమ్మవార్ల విగ్రహాలను ఇక్కడ ఉంచి నిత్య పూజ, కైంకర్యాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కరెంట్ షాక్‌తో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి - తడ (తిరుపతి)

తిరుపతి జిల్లా తడ మండలంలోని ఎపిఐఐసి రోడ్డు, నేషనల్ హైవే కలిసే మలుపు వద్ద బైక్ మెకానిక్ షాపులో బైక్ వాటర్ సర్వీసు చేస్తుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అశోక్‌కుమార్ (35) మృతిచెందాడు. తడ పోలీసులు అందించిన సమాచారం మేరకు.. సూళ్లూరుపేట మండలం అటకానితిప్ప గ్రామానికి చెందిన అన్నదమ్ములు సుగానందం అశోక్‌కుమార్ (35), సుగానందం బాలసుందరం ఇరువురూ కలిసి మూడు నెలల కిందట హైవే రోడ్డులో చిన్న సర్వీసు షాపు ప్రారంభించారు. బుధవారం బైక్ సర్వీసు చేస్తుండగా అశోక్‌కుమార్ విద్యుత్ షాక్‌తో విగతజీవుడై పడి ఉన్నాడు. బాలసుందరం వచ్చి చూసేసరికి అప్పటికే మరణించి పడి ఉన్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తగ్గుతున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు

న్యూఢిల్లీ : తాజా గణాంకాల ప్రకారం కేంద్ర ప్రభుత్వంలో పౌర ఉద్యోగాలు చేస్తున్న వారి సంఖ్య 30.13 లక్షలు. 2010 తర్వాత పౌర ఉద్యోగుల సంఖ్య ఇంత కనిష్ట స్థాయిలో ఉండడం ఇదే మొదటిసారి. ప్రస్తుతం కేంద్రంలో మంజూరై ఉన్న పోస్టుల సంఖ్య 39.77 లక్షలు. గత మూడు సంవత్సరాలలో మంజూరైన పోస్టుల సంఖ్యను పరిశీలిస్తే ఇది కూడా చాలా తక్కువే. ప్రస్తుతం 9.64 లక్షల కేంద్ర ప్రభుత్వోద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన వ్యయ విభాగం విడుదల చేసిన వార్షిక నివేదికలో ఈ వివరాలను పొందుపర్చారు. 2021 మార్చి, 2022 మార్చి మధ్య కాలంలో మంజూరైన పోస్టుల సంఖ్య 40.35 లక్షల నుండి 39.77 లక్షలకు తగ్గిపోయింది. గ్రూప్ సీ పోస్టుల సంఖ్యను తగ్గించడమే దీనికి కారణం. ఇదే కాలంలో ఉద్యోగుల సంఖ్య కూడా 30.56 లక్షల నుండి 30.13 లక్షలకు తగ్గిపోయింది. రైల్వేలు, రక్షణ (పౌర), హోం వ్యవహారాలు, తపాలా, రెవెన్యూ శాఖలలో ఉద్యోగాల మంజూరు, ఉద్యోగుల సంఖ్య తక్కువగానే ఉంది.

రైల్వేలకు పాడి కుండలా బొగ్గు రవాణా

న్యూఢిల్లీ : బొగ్గు రవాణా రైల్వేలకు పాడి కుండలా మారుతోంది. వాస్తవానికి సరకు రవాణా ద్వారానే రైల్వేలు అధిక ఆదాయాన్ని పొందుతున్నాయి. 2022-23లో సరకు రవాణా ద్వారా రైల్వేలకు రూ.1.62 లక్షల కోట్ల ఆదాయం పొందింది. ఇందులో కూడా బొగ్గు రవాణా ద్వారా అధిక ఆదాయం లభించింది. అయితే ఇంధన ఉద్గమనాలను సాధ్యమైనంత వరకూ తగ్గించేందుకు భారత్ చేస్తున్న ప్రయత్నాలకు ఇది విఘాతం కలిగిస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎందుకంటే బొగ్గుపై ఆధారపడడాన్ని తగ్గించుకుని, పునరుద్పాదక ఇంధన వనరులపై దృష్టి సారిస్తేనే లక్ష్యం నెరవేరుతుంది.

ఇనుము, ఉక్కు, ఇనుప ఖనిజం, ఆహారధాన్యాలు, సిమెంట్, పెట్రోలియం ఉత్పత్తులు, ఎరువుల రవాణా ద్వారా కూడా రైల్వేలకు ఆదాయం సమకూరుతున్నప్పటికీ బొగ్గు రవాణా ద్వారా లభించే ఆదాయమే ఎక్కువగా ఉంటోంది. వినియోగ వస్తువులు, ఆటోమొబైల్స్ వంటి ప్యాకింగ్ చేసిన సామగ్రి రవాణా ద్వారా ఆదాయాన్ని పెంచుకునేందుకు రైల్వేలు ప్రయత్నిస్తున్నాయి.

పనిచేస్తున్న వారిని ఎలా తొలగిస్తారు..?

- కొత్తవారి కోసం పాతవారికి అన్యాయం
- ఎస్‌ఎస్‌ఎలో ఉద్యోగాల కౌన్సిలింగ్‌ను అడ్డుకున్న సిఐటియు
- ఉద్రిక్తతల నడుమ కౌన్సిలింగ్‌ను నిలిపేసిన అధికారులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో కొత్త నియామకాల పేరుతో ప్రస్తుతం పని చేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ, టీచర్‌లను ఎలా తొలగిస్తారని, ఇది అన్యాయమైన చర్యని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో నూతనంగా కాంట్రాక్ట్ పద్ధతిన 250 పోస్టుల భర్తీ కోసం ఎంపికైన అభ్యర్థులకు బుధవారం నాడు అనంతపురం ఎస్ఎస్ఎ కార్యాలయం వద్ద కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇది వరకే ఆ పోస్టుల్లో గెస్ట్ ఫ్యాకల్టీగా సిబ్బంది పని చేస్తున్నారు. కాంట్రాక్ట్ పద్ధతిన ఆ పోస్టులను భర్తీ చేయడానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ పోస్టులకు గెస్ట్ ఫ్యాకల్టీలు కూడా దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఎంపిక జాబితాలో వారి పేర్లు లేకపోవడంతో తమకు అన్యాయం చేస్తున్నారంటూ సిఐటియు ఆధ్వర్యంలో ఎస్ఎస్ఎ కార్యాలయం ఆవరణంలో బుధవారం మధ్యాహ్నం నుంచి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, నగర కార్యదర్శి వెంకటనారాయణ, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డిలు హాజరై కౌన్సిలింగ్‌ను అడ్డుకున్నారు. ప్రస్తుతం పని చేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీలను కొనసాగించాల్సిందే అంటూ ఆందోళన నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో రాష్ట్రంలో ఉన్న కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని, దానిని అమలు చేయకపోగా ఉన్న పోస్టులను తొలగించడం అన్యాయంగా ఉందన్నారు. కెజిబివిల్లో పని చేయడానికి గెస్ట్ ఫ్యాకల్టీలను 8 ఏళ్ల క్రితం నోటిఫికేషన్ జారీ చేసి భర్తీ చేశారని తెలిపారు. 8 సంవత్సరాలుగా పనిచేస్తున్న వారిని రెన్యువల్ చేయకుండా వాళ్లని తొలగించి కొత్త నోటిఫికేషన్ ఇవ్వడం దుర్మార్గంగా ఉందన్నారు. రాష్ర వ్యాప్తంగా 1280 పోస్టులు, జిల్లాలో 280 పోస్టులకు కొత్త నోటిఫికేషన్ జారీ చేశారని తెలిపారు. ఉన్న వారినే తొలగించే కుట్రలో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందన్నారు.

ఈ కొత్త నోటిఫికేషన్ వల్ల జిల్లాలో పని చేస్తున్న 250 మంది కుటుంబాలు రోడ్డున పడుతాయని తెలిపారు. ఇప్పటి వరకు పని చేస్తున్న వారిని కొనసాగించాలన్నారు. వారిని కొనసాగించి మిగిలి ఉన్న ఖాళీ పోస్టును కొత్త వారికి అవకాశం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళన తీవ్రం కావడంతో అధికారులు కౌన్సెలింగ్‌ను నిలిపివేశారు. రాత్రి పొద్దుపోయే వరకు గెస్ట్ ఫ్యాకల్టీలు ఎస్ఎస్ఎ కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. ఒకటవ పట్టణ ఎస్ఐ తిప్పయ్య నాయక్, పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. ఫోన్ ద్వారా డిఇఒ సాయిరాంతో మాట్లాడారు. వీరి డిమాండ్ న్యాయమైనదే అని, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామి ఇచ్చారు. ఆ విషయాన్ని ఎస్ఐ ఆందోళన కారులకు తెలియజేశారు. అయితే కౌన్సెలింగ్ నిలిపివేయాలని, తమ సమస్య పరిష్కరించిన తరువాతనే మిగతా ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇందుకు అధికారులు అంగీకరించి బుధవారం నాడు కౌన్సిలింగ్‌ను నిలిపేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, రజిత, గెస్ట్ ఫ్యాకల్టీలు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విజ్ఞాన కేంద్రం.. రాష్ట్రపతి నిలయం...

- ఏడాదంతా సందర్శకులకు అవకాశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయం జ్ఞాన సమపార్జన కేంద్రం అని రాష్ట్రపతి భవన్ (న్యూఢిల్లీ) పిఆర్ఒ కుమార్ సమ్రేశ్ అన్నారు. రాష్ట్రపతి నిలయం చరిత్రను, అందులోని గార్డెన్ల విశిష్టతను, నాల్డెజ్ గ్యాలరీ ప్రాముఖ్యతను వివరించారు. రాష్ట్రపతి విడిది, ప్రతి సోమవారం తప్ప మిగతా అన్ని రోజుల్లోనూ సందర్శకులను ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు వీక్షించే అవకాశాన్ని ఇప్పటికే కల్పిస్తున్నామన్నారు. సీనియర్ సిటిజన్లు, చిన్న పిల్లలకు నిలయంలో సందర్శించేందుకు ఈకార్ట్ వాహనాలను అందుబాటులో ఉంచామని చెప్పారు. నిలయంలోని విశిష్టతలను వివరించేందుకు హిందీ, ఇంగ్లీషు, తెలుగు భాషల్లో ప్రావీణ్యం ఉండి ప్రత్యేక శిక్షణ పొందిన 20 మంది గైడ్లను నియమించామని తెలిపారు. కిచెన్ నుంచి డైనింగ్ హాల్ వరకు ఉన్న టన్నెల్‌ను గ్రామీణ జీవనం ఉట్టిపడేలా, బాగా చదువుకుని మహిళలు ఎదుగుతున్న క్రమాన్ని వివరించే చేర్యాల ఆర్ట్ ద్వారా ఆకట్టుకునేలా బొమ్మలను గీయించామన్నారు. ఫ్లాగ్ పోస్ట్‌పాయింట్, జైహింద్ ర్యాంపు, నిజాం సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేస్తూ సైన్యం-నిజాం పాలకుల మధ్య జరిగిన ఒప్పందపత్రాలు అందజేసిన ప్రాంతాలను ప్రతి ఒక్కరూ చూసి చారిత్రక నేపథ్యాన్ని తెలుసుకోవాలన్నారు. నాల్డెజ్ సెంటర్‌ను పునరుద్ధరించామనీ, అందులో రాష్ట్రపతులకు ఆయా దేశాల నేతలు ఇచ్చిన గిఫ్టులు, చేతిరాతతో రాసిన రాజ్యాంగ ప్రతి, దేశంలో ఇచ్చే అత్యున్నత పురస్కారాల నమూనాలు, రాష్ట్రపతులు వాడిన గుర్రపు బగ్గీ, బుల్లెట్ ప్రూఫ్ కారులను అందులో పొందుపర్చామని చెప్పారు. స్వాతంత్ర్యం కోసం తెలంగాణలో జరిగిన పోరాటం, రైతాంగ పోరాట వీరుల ఫొటోలను అందులో ఉంచామని తెలిపారు. రాక్, హెర్బల్, బట్టర్‌ఫ్లై, నక్షత్రాల గార్డెన్‌ల గురించి, అందులో ఉన్న చెట్ల ప్రాముఖ్యత గురించి వివరించారు. మాజీ గార్డెన్, చిల్డ్రన్ పార్కులను కొత్తగా నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది మార్చి 22 నుంచి సందర్శకులకు అన్ని రోజులూ అందుబాటులో ఉండేలా వర్చువల్ పద్ధతిలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారని తెలిపారు. రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించాలనుకునేవారు ష్ట్రజూ://ఱఱంఠ.త్ఱుంష్ట్రత్ఱుజూఫ-అఎష్ట్రుఱుఖఅ.స్త్రశీఱ.ఱఅ వెబ్‌సైట్‌లో టిక్కెట్లు బుక్ చేసుకోవాలనీ, డైరెక్టుగా కూడా తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. స్వదేశీ సందర్శకులకు రూ.50, విదేశీ సందర్శకులకు రూ.250 టిక్కెట్ ధర ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలు స్కూల్ తరపున బుక్ చేసుకుంటే ఉచిత సందర్శనకు అవకాశం కల్పిస్తామన్నారు. గ్రూపుగా 30 మంది సందర్శనకు వస్తే టికెట్ ధరపై 20 శాతం రాయితీ ఇస్తామని చెప్పారు. రాష్ట్రపతి నిలయంలో ఆయా ప్రదేశాల గురించి వివరించేందుకు గైడ్లను నియమించామనీ, ఫ్రీ పార్కింగ్, వృద్ధుల కోసం వీల్‌చైర్లు, రెస్ట్‌రూమ్, ఫస్ట్‌ఎయిడ్, క్యూరియోషాప్, తదితర సౌకర్యాలను కల్పించామని తెలిపారు. రాష్ట్రపతి నిలయంలోని ముఖ్యమైన ప్రాంతాలను మీడియా ప్రతినిధులకు చూపెట్టి వివరించారు.

మోటార్ సైకిళ్ల చోరీ కేసులో బిటెక్ విద్యార్థులు

16 బైక్‌లు స్వాధీనం

ప్రజాశక్తి - కాళ్ల (పశ్చిమగోదావరి జిల్లా)

ఓ ప్రముఖ కాలేజీలో ఉన్నత చదువులు చదువుతూ విలాసాలకు, వ్యసనాలకు బానిసలై దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు బిటెక్ విద్యార్థులు, మరో ఇద్దరు యువకులు పోలీసులకు పట్టుబడిన సంఘటన కాళ్ల మండలంలో చోటుచేసుకుంది. భీమవరం డిఎస్‌పి బి.శ్రీనాధ్ బుధవారం సాయంత్రం కాళ్ల పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బుధవారం ఉదయం ఏలూరుపాడు చెక్ పోస్ట్ దగ్గర కాళ్ల పోలీసులు గస్తీ నిర్వహిస్తుం డగా ముగ్గురు విద్యార్థులు, ఇద్దరు యువకులు పోలీసులను చూసి కంగారుపడుతూ పారిపోతుండగా వారిని అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. భీమవరం మండలం కొత్తపూసలమర్రుకు చెందిన బస్వాని యశ్వంత్ వెంకట ధర్మతేజ, అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి గ్రామానికి చెందిన ఇంజేటి అనిష్, పెనుగొండ గ్రామానికి చెందిన బుర్రా అనిల్ కుమార్, భీమవరానికి చెందిన గుదివిందల సోమేశ్వరరావు, బోను మోజేష్ ఒక టీంగా ఏర్పడి మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామన్నారు. ఈ విచారణలో పశ్చిమగోదావరి, కృష్ణా, ఏలూరు జిల్లాల పరిధిలోని కాళ్ల, కలిదిండి, గణపవరం, ముదినేపల్లి, ఏలూరు టూటౌన్, బంటుమిల్లి, కృత్తివెన్ను, కైకలూరు స్టేషన్లలో చోరీకి గురైన 16 మోటారు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసును ఛేదించిన ఆకివీడు సిఐ జి.గీతా రామకృష్ణ, కాళ్ల ఎస్ఐ ఎజిఎస్ మూర్తి, ఎఎస్ఐ రామరాజు, కానిస్టేబుల్స్ రాజేష్, సుధాకర్, ఉమా మహేశ్వరరావు, రవికుమార్ డిఎస్‌పి శ్రీనాథ్ అభినందించారు.

హమాలీ, రవాణా ఛార్జీల కథ కంచికేనా..?

- జెసి ఆదేశించినా రైతులకు అందని కళాసీ ఖర్చులు
- సుమారు రూ.23 కోట్లు స్వాహా?
- ఎపి రైతు సంఘం పోరాటంతో వెలుగులోకి

ప్రజాశక్తి - జామి (విజయనగరం)

ఖరీఫ్ ధాన్యం రవాణా, కళాసీ ఛార్జీల్లో అక్రమాల కథ కంచికేనా..? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. గత ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి రవాణా, కళాసీ ఛార్జీల చెల్లింపులో భారీఅవినీతి చోటు చేసుకుందని రైతులు, రైతు సంఘాల నాయకులు ఆందోళనలు చేస్తున్న విషయం విదితమే. దీనిపై స్పందన కార్యక్రమాల్లో అనేక ఫిర్యాదులు చేశారు. ఉన్నతాధికారులు స్పందించి, రైతులకు కళాసీ ఛార్జీలు చెల్లించాలని, రవాణా ఛార్జీల నమోదు ప్రక్రియపై విచారణ చేయాలని ఆదేశించారు. ఇది జరిగి నెల రోజులు కావస్తున్నా... ఒక్కరైతుకూ కళాసీ ఛార్జీలు చెల్లించిన పాపాన పోలేదు. పైగా ఫిర్యాదులు చేసిన రైతులు.. పిఎసిఎస్‌లకు వెళ్లి అడిగితే... తమకు ఎటువంటి సంబంధం లేదని చెబుతున్న వైనం. ఇక రవాణా ఛార్జీల వ్యవహారంపై జరుగుతున్న విచారణ కథ కంచికేనని రైతులు వాపోతున్న పరిస్థితి నెలకొంది. విజయనగరం జిల్లాలో 2021-22 ఖరీఫ్ ధాన్యాన్ని ఆర్‌బికెలు, పిఎసిఎస్‌లు, పిపిసిల ద్వారా కొనుగోలు చేశారు. సుమారుగా 4.12 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. హమాలీ, రవాణా ఛార్జీలు కింద క్వింటాకు రూ.52 వరకు ప్రభుత్వం మంజూరు చేస్తుందని, ముందుగా రైతే భరించాలని అధికారులు చెప్పడంతో రైతులే ఖర్చు చేసిన పరిస్థితి. అధికారులు చెప్పినట్లు ప్రభుత్వం ఈ మొత్తాన్ని కొనుగోలు ఏజెన్సీలుగా ఉన్న పిఎసిఎస్, పిపిసిలకు జమ చేసింది. హమాలీ ఛార్జీల కింద 2021-22 కు గానూ రూ.12.06 కోట్లు విడుదల చేయాల్సి ఉండగా, పరపతి సంఘాలకు రూ.9.45 కోట్లు విడుదల చేసింది. ఈ సొమ్మును తక్షణమే రైతుల ఖాతాలకు జమ చేయాలని గత నెల 26వ తేదీన జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశాలు జారీ చేశారు. కానీ ఇంత వరకు రైతులకు చెల్లించిన పాపాన పోలేదు. రవాణా ఛార్జీలకు సంబంధించి కొనుగోలు ఏజెన్సీలు నమోదు చేసిన పోర్టల్ ఆధారంగా విచారణ చేయాలని ఆదేశాలు జారీ అయినా, వాటిని పట్టించుకున్న నాథులే లేరని రైతు సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

రూ.23 కోట్ల అక్రమాలపై ఎందుకీ ఉదాసీనత?

జిల్లాలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి హమాలీ, రవాణా ఛార్జీలకు సంబంధించి సుమారుగా రూ.23 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. ఇప్పటికే కొన్ని కోట్ల రూపాయలు విడుదల చేశామని, వాటిని రైతులకు చెల్లించాలని ఉన్నతాధికారులు ఆదేశించినా, ఫలితం లేకపోవడం గమనార్హం. ఆర్‌బికెల్లోనే ధాన్యం కొనుగోలు ప్రక్రియ నమోదు జరిగింది. రైతుల ధాన్యాన్ని వారి సొంత రవాణా వాహనం ద్వారా మిల్లుకు చేర్చారు. కానీ జిల్లా వ్యాప్తంగా నామమాత్రంగా రైతుల వాహనాలు నమోదు చేసి, మెజారిటీ ధాన్యం ఏజెన్సీల వాహనాలు రవాణా చేసినట్లు నమోదు చేశారు. అంటే ఆదిలోనే తప్పు జరిగింది. ఈ నేపథ్యంలోనే ఉన్నతాధికారుల విచారణ అదేశాలు బుట్టదాఖలు అవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటి వెనుక పెద్దల హస్తం ఉందన్న అనుమానాల నేపథ్యంలో ఉదాసీనత నెలకొందని రైతులు ఆరోపిస్తున్నారు.

గ్లోబల్ జెండర్ ఇండెక్స్‌లో భారత్‌కు 127వ ర్యాంకు

- పాక్ మినహా పొరుగు దేశాల ప్రదర్శన మనకంటే మెరుగు
- డబ్ల్యూఈఎఫ్ నివేదిక

న్యూఢిల్లీ : భారత్ లింగ సమానత్వం పరంగా ప్రపంచవ్యాప్తంగా 146 దేశాలకు గానూ 127వ ర్యాంకును పొందింది. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) వార్షిక లింగ వ్యత్యాస నివేదిక, 2023లో ఈ విషయం వెల్లడైంది. గతేడాది భారత ర్యాంకు 135గా ఉన్నది. ఆర్థిక భాగస్వామ్యం, అవకాశాలపై భారత్ కేవలం 36.7 శాతం సమానత్వానికి చేరుకున్నదని నివేదిక నొక్కి చెప్పింది. లింగ సమానత్వం విషయంలో భారత్‌కు పొరుగు దేశాలైన చైనా (107వ ర్యాంకు), బంగ్లాదేశ్ (59), నేపాల్ (116), శ్రీలంక (115), భూటాన్ (103)లు మనకంటే మంచి ర్యాంకులు సాధించి మెరుగైన ప్రదర్శనను కనబర్చటం గమనార్హం. పాకిస్థాన్ ర్యాంకు మాత్రం 142గా ఉన్నది.

ఐస్‌ల్యాండ్‌లో అత్యధిక లింగ సమానత్వం

ఐస్‌ల్యాండ్ వరుసగా 14వ సంవత్సరం ప్రపంచంలో అత్యధిక లింగ సమానత్వం కలిగిన దేశంగా నిలిచింది. 90 శాతం కంటే ఎక్కువ లింగ వ్యత్యాసానికి ఇది ముగింపు పలికింది. భారత్‌లో వేతనాలు, ఆదాయాలలో సమానత్వం ఉన్నప్పటికీ.. సీనియర్ స్థానాలు, సాంకేతిక పాత్రలలో మహిళల సంఖ్య గతం నుంచి కొద్దిగా పడిపోయిందని నివేదిక ఎత్తి చూపింది. రాజకీయ సాధికారతపై భారత్ 25.3 శాతం సమానత్వాన్ని నమోదు చేసింది. మహిళలు 15.1 శాతం మంది పార్లమెంటేరియన్‌లుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మొత్తమ్మీద దక్షిణాసియా ప్రాంతం 63.4 శాతం లింగ సమానత్వాన్ని సాధించింది.

భారత్‌లో మహిళా మంత్రుల సంఖ్య ఏడు శాతం కంటే తక్కువ

భారత్‌లో మహిళా మంత్రుల సంఖ్య ఏడు శాతం కంటే తక్కువగా ఉన్నది. అజర్‌బైజాన్, సౌదీ అరేబియా, లెబనాన్ వంటి దేశాల్లో ఎవరూ లేకపోవట గమనార్హం. మొత్తమ్మీద ప్రపంచవ్యాప్తంగా లింగ సమానత్వం కోవిడ్ పూర్వస్థాయికి పుంజుకున్నదని నివేదిక పేర్కొన్నది. ఏ దేశమూ ఇంకా పూర్తి లింగ సమానత్వాన్ని సాధించనప్పటికీ.. మొదటి తొమ్మిది దేశాలు తమ అంతరాన్ని కనీసం 80 శాతం తగ్గించుకున్నాయి. ఆర్థిక భాగస్వామ్యం మరియు అవకాశం, విద్యా సంబంధమైన నైపుణ్యం, ఆరోగ్యం మరియు మనుగడ, రాజకీయ సాధికారత అనే నాలుగు రంగాలలో లింగ ఆధారిత అంతరాల పరిణామాన్ని గ్లోబల్ జెండర్ గ్యాప్ రిపోర్టు ప్రస్తుత 17వ ఎడిషన్‌లో పరిగణలోకి తీసుకున్నది.

ఐర్లాండ్‌కు మరో షాక్

చివరి బంతికి స్కాట్లాండ్ చేతిలో ఓటమి

హరారే: ఐసిసి వన్డే ప్రపంచకప్ క్వాలిఫయర్స్ మ్యాచుల్లో ఐర్లాండ్ జట్టుకు మరో చేదు అనుభవం ఎదురైంది. బుధవారం జరిగిన గ్రూప్-బి లీగ్ పోటీలో స్కాట్లాండ్ జట్టు చివరి బంతికి ఫోర్ కొట్టి ఐర్లాండ్‌పై సంచలన విజయం నమోదు చేసుకుంది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్ జట్టు 50 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 286పరుగులు చేసింది. క్యాంపర్(120) సెంచరీకి తోడు డాక్రెల్(69) అర్ధసెంచరీతో మెరిసాడు. స్కాట్లాండ్ బౌలర్ మెక్ ముల్లెన్‌కు ఐదు వికెట్లు దక్కాయి. ఛేదనలో స్కాట్లాండష్ట్ర నిర్ణీత 50 ఓవర్లలో 9వికెట్లు కోల్పోయి 289పరుగులు చేసి గెలిచింది. చివరి ఓవర్లో విజయానికి 8పరుగులు చేయాల్సిన స్కాట్లాండష్ట్ర తొలి రెండు బంతుల్లో 5పరుగులు రాబట్టింది. ఆ తర్వాత షరీఫ్ వికెట్‌ను కోల్పోయి. ఆ తర్వాతి 2బంతులకు ఒక్క పరుగే చేయగల్గింది. ఆ దశలో చివరి బంతికి లీస్క్(91) ఫోర్ కొట్టి స్కాట్లాండ్‌ను గెలిపించాడు. ఐర్లాండ్ బౌలర్లు అడైర్‌కు మూడు, లిట్టిల్, డాక్రెల్‌కు రెండేసి వికెట్లు దక్కాయి.

ఓమన్ ఖాతాలో రెండో గెలుపు

గ్రూప్-బిలో ఓమన్ జట్టు వరుసగా రెండో విజయాన్ని సొంతం చేసుకుంది. రెండో లీగ్ మ్యాచ్‌లో ఓమన్ జట్టు 5వికెట్ల తేడాతో యుఏఇని చిత్తుచేసింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన యుఏఇ నిర్ణీత 50 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 227పరుగులు చేయగా.. ఛేదనలో ఓమన్ జట్టు 46ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 228పరుగులు చేసి గెలిచింది. దీంతో గ్రూప్-బిలో ఓమన్ జట్టు 4పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా.. 23న జరిగే శ్రీలంకను చిత్తుచేస్తే.. ప్రధాన టోర్నీకి చేరువ కానుంది.

టాప్‌లోనే అశ్విన్

టెస్ట్ ర్యాంకింగ్స్ టాప్ టెన్ లో రిషబ్ పంత్

ఒక స్థానం కోల్పోయి 14వ స్థానంలో నిలిచిన కోహ్లీ

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్‌మండలి (ఐసిసి) తాజా ర్యాంకింగ్స్ బౌలర్ల జాబితాలో రవిచంద్రన్ అశ్విన్, బ్యాటర్ల జాబితాలో జో రూట్ అగ్రస్థానంలో నిలిచారు. యాషెస్ సిరీస్‌లో భాగంగా తొలిటెస్ట్‌లో సెంచరీతో కదం తొక్కిన జో రూట్.. ఆస్ట్రేలియా బ్యాటర్ మార్కస్ లబూషేన్‌ను వెనక్కి నెట్టి అగ్రస్థానానికి ఎగబాకాడు. గత ఏడాది రోడ్డు ప్రమాదంలో గాయపడిన రిషబ్ పంత్ టాప్-10లో చోటు దక్కించుకున్నాడు. దీంతో టాప్ 10లో ఉన్న ఏకైక టీమిండియా బ్యాటర్ పంత్ మాత్రమే. పంత్ ఖాతాలో 758 రేటింగ్ పాయింట్స్ ఉన్నాయి. అలాగే రోహిత్ శర్మ 12వ స్థానంలో, విరాట్ కోహ్లీ ఒకస్థానం దిగజారి 14వ స్థానానికి పడిపోయాడు. చటేశ్వర పుజాలా 25వ ర్యాంకులో నిలిచాడు. ఇక బౌలింగ్ విషయానికి వస్తే అశ్విన్ మొదటి ర్యాంకులో నిలిచాడు. అశ్విన్ ఖాతాలో 860 రేటింగ్ పాయింట్స్ ఉన్నాయి. ఆస్ట్రేలియా వేదికగా జరుగుతున్న యాషెస్ సిరీస్ ఫస్ట్ టెస్ట్ మ్యాచ్‌లో విఫలమైన మార్నస్ లబూషేన్ బ్యాటింగ్ ర్యాంకింగ్‌లో రెండు ర్యాంకులు దిగజారి మూడో స్థానానికి పడిపోయాడు. ఇంగ్లాండ్ ఆటగాడు జో రూట్ మొదటి స్థానంలో నిలిచాడు. రెండో స్థానలో కేన్ విలియమ్స్ ఉన్నాడు.

మైనింగ్.. మా ఇష్టం

- పొందూరులో చెలరేగిపోతున్న అక్రమార్కులు
- డి-పట్టా భూముల్లో అక్రమ క్వారీల నిర్వహణ
- అనుమతులు లేకున్నా యథేచ్ఛగా తవ్వకాలు
- ప్రమాదకరమైన పేలుడు పదార్థాల వినియోగం
- కన్నెత్తి చూడని అధికార యంత్రాగం

ప్రజాశక్తి - పొందూరు (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలంలో మైనింగ్ అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. డి-పట్టా భూముల్లో అక్రమంగా క్వారీలను నిర్వహిస్తూ అనుమతులు, నిబంధనలతో తమకు అవసరం లేదనట్లు వ్యవహరిస్తున్నారు. ఎవరికి అందాల్సిన వాటా వారికి అందుతుండడంతో, ఇక తమకు అడ్డు పడే వారు లేరన్న ధీమాతో యథేచ్ఛగా తవ్వకాలను సాగిస్తూ కొండలను పిండి చేస్తున్నారు. నిపుణుల పర్యవేక్షణలో క్వారీలో చేయాల్సిన పేలుళ్లను కూలీలతోనే చేయించేస్తున్నారు. ఇందుకోసం ప్రమాదకరమైన డైనమైట్స్, జిలిటెన్‌స్టిక్స్, అమ్మోనియా తదితర పేలుడు పదార్థాలను వినియోగిస్తున్నారు. పేలుళ్ల సమయంలో ప్రమాదాలు సంభవిస్తే బాధిత కుటుంబాలకు ఎంతో కొంత ముట్టజెప్పి చేతులు దులిపేసుకుంటున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నా... ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నా... ప్రభుత్వ యంత్రాంగానికి మాత్రం ఇవేవీ పట్టడం లేదు.

మండలంలోని రాపాక, ఇల్లయ్యగారిపేట, వావిలపల్లిపేట, కృష్ణాపురం, పుల్లాజీపేట గ్రామాల సమీపంలో నల్లరాతి కొండలు బాగా విస్తరించి ఉన్నాయి. ఈ కొండల్లో క్వారీల నిర్వహణకు మైనింగ్ లీజుల అనుమతితో పాటు క్వారీ పేలుళ్లకు సంబంధిత శాఖల అనుమతులు తప్పనిసరి. ఈ అనుమతులేవీ లేకపోయినా యథేచ్ఛగా అక్రమంగా క్వారీలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా రాపాకలోని సర్వే నంబరు 335లో, కృష్ణాపురంలోని సర్వే నంబరు 224లో లీజులు, అనుమతులు లేకుండానే అక్రమంగా మైనింగ్‌ను నిర్వహిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా క్వారీలు నిర్వహిస్తున్నా అధికారులు కన్నెత్తి చూడడం లేదు. పలు శాఖల అధికారులకు అక్రమ క్వారీ నిర్వాహకుల నుంచి నెల వారీ మామూళ్లు అందతుండడంతో, అక్రమ మైనింగ్‌పై చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విధానం మారినా మారని పద్ధతి

క్వారీల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నూతన విధానాన్ని రూపొందించింది. గతంలో లీజులు, సీనరీస్ వంటి వ్యవహారాలను భూగర్భ గనులశాఖ అధికారులు చూసేవారు. మైనింగ్ నిర్వహణలో పారదర్శకతను తీసుకొచ్చేందుకు విశ్వసముద్ర సంస్థకు కట్టబెట్టింది. ఈ సంస్థ ముందుగానే ప్రభుత్వానికి సీనరీస్ చెల్లించి మైనింగ్ నిర్వహణ కాంట్రాక్టును దక్కించుకుంది. ఇక్కడి క్వారీ నిర్వాహకులు ప్రభుత్వానికి సీనరీస్‌లు కట్టకుండానే క్వారీలను నిర్వహించేవారు. ఇప్పుడు తప్పనిసరి పరిస్థితుల్లో చెల్లించాల్సి వస్తుండడంతో అడ్డదారులు తొక్కుతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి భారీస్థాయిలో గండి పడుతున్నా, తమకు రావాల్సిన ఆదాయం వస్తుండడంతో కొందరు అధికారులు తమవంతు సాయం చేస్తున్నారు.

నిపుణులు లేకుండానే పేలుళ్లు

క్వారీల నిర్వహణలో పేలుళ్లు చేయడం సాధారణం. నిబంధనల ప్రకారం క్వారీల్లో పేలుడు పదార్థాలను వినియోగించి చేస్తారు. ఇందుకు తప్పనిసరిగా సంబంధిత శాఖల అనుమతులు అవసరం. అనుమతులు పొందాక నిష్ణాతుల పర్యవేక్షణలో పేలుళ్లు చేయాలి. క్వారీలే అక్రమంగా నిర్వహిస్తుంటే, పేలుళ్లకు అనుమతులు సాధ్యం కాదు కాబట్టి ఎటువంటి భద్రతా పరికరాల్లేకుండా ఇక్కడ పనిచేసే కూలీలతోనే చేయించేస్తున్నారు. పేలుళ్ల సమయంలో ప్రమాదాలు సంభవించి పలువురు మృతి చెందడం, అంగవైకల్యానికి గురైనట్లు తెలుస్తోంది. ఇలాంటి ఘటనల్లో బాధిత కుటుంబాలకు క్వారీ నిర్వాహకులు ఎంతోకొంత ముట్టజెప్పి చేతులు దులిపేసుకుంటున్నారు. విషయాన్ని బయటకు పొక్కకుండా చేయాల్సినవన్నీ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం కళ్లు తెరిచి అక్రమ క్వారీల నిర్వహణపై చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా అధికారులు కదులుతారా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.

వైసిపిని వెనకేసుకొస్తున్న బిజెపి

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అధికార పార్టీని, రాష్ట్ర ప్రభుత్వాన్ని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు వెనకేసుకొస్తున్నారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు విమర్శించారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుపై వీర్రాజు చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిఎం జగన్‌పై చర్యలు తీసుకోవాలని కోరితే ఎందుకంత కోపం, అసహనమని ప్రశ్నించారు. వివేకా హత్య కేసులో సిబిఐపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన దాడిని చూడలేదా? అని నిలదీశారు. ప్రత్యేక హోదా తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానన్న జగన్ హామీని అమలు చేయమని కోరడం తప్పా? అని అన్నారు.

టిడిపి ఎస్‌సి సెల్ ఆధ్వర్యాన సిఎం దిష్టిబొమ్మ దహనం

టిడిపి ఎస్‌సి సెల్ ఆధ్వర్యాన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను టిడిపి కార్యాలయం వద్ద దహనం చేశారు. సిఎం సొంత జిల్లా కడపలో దళితులపై హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నా సిఎం కనీసం స్పందించడం లేదంటూ ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఎంఎస్ రాజు ఆధ్వర్యాన నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దళితులపై జరిగినన్ని దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు ఎన్నడూ లేవని రాజు విమర్శించారు. సిఎం కనీసం స్పందించడం లేదని, దళిత హోంమంత్రి ఉన్నప్పటికీ ఉపయోగం లేదని ఆరోపించారు. కడప ఇన్‌ఛార్జి మంత్రిగా ఉన్న ఆదిమూలపు సురేష్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. సిఐడి డిజిగా సంజయ్ అనర్హుడని, వెంటనే రాజీనామా చేయాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు.

సుదర్శన్‌రెడ్డి నియామకం చెల్లదని రిట్

ప్రజాశక్తి-అమరావతి

డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ (డిఒపి)గా జె సుదర్శన్‌రెడ్డి నియామకాన్ని రద్దు చేయాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. తనకు అన్ని అర్హతలూ ఉన్నా ఆయనను నియమించడం అన్యాయమంటూ ప్రాసిక్యూషన్స్ అదనపు డైరెక్టరు బి రామకోటేశ్వరరావు రిట్ దాఖలు చేశారు. దీనిని తాత్కాలిక సిజె ఎవి శేషసాయి, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. చట్ట విరుద్ధంగా సుదర్శన్‌రెడ్డి నియామకం జరిగిందని, దీనిని హైకోర్టు పాలనాపరంగా సమ్మతి చెప్పడం అన్యాయమని పిటిషనర్ వాదన. రాజకీయ నేతగా ఉన్న వ్యక్తిని డిఒపిగా నియమించడం చెల్లదన్నారు. వాదన తర్వాత సుదర్శన్‌రెడ్డికి నోటీసులు జారీ చేసిన హైకోర్టు విచారణను ఈ నెల 26కు వాయిదా వేసింది.

క్లస్టర్ విధానం రద్దు చేయాలి : డివైఎఫ్‌ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైతు భరోసా కేంద్రాల్లో పశుసంవర్ధకశాఖకు సంబంధించి క్లస్టర్ విధానాన్ని ఎత్తివేసి, తక్షణం వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయాలని డివైఎఫ్‌ఐ కోరింది. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో డివైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్ నాగేశ్వరరావు, నాయకులు పి కృష్ణ కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పశుసంవర్ధకశాఖలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, క్లస్టర్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ప్రతి రైతు భరోసా కేంద్రానికి ఒక వెటర్నరీ పోస్టు వుంటే ఇప్పుడు ప్రభుత్వం మూడు నుంచి ఐదు రైతు భరోసా కేంద్రాలను కలిపి క్లస్టర్‌గా ఏర్పాటుచేసి వెటర్నరీ అసిస్టెంట్ నియమించాలనుకోవడం సరైందికాదని అన్నారు. ఈ ప్రక్రియ వల్ల పాడి రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో డెయిరీ ఒకేషనల్, డిప్లమో చదివిన అభ్యర్థులు సచివాలయ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. క్లస్టర్ విధానంతో పోస్టుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయే అవకాశం వుందన్నారు. తక్షణమే రాష్ట్రంలో ఖాళీగా వున్న 4,765 వెటర్నరీ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

డిగ్రీలో సింగిల్ సబ్జెక్టు విధానం రద్దు

- మంత్రికి ఎస్‌ఎఫ్‌ఐ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డిగ్రీలో సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానం రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను ఆ సంఘం కార్యదర్శి ఎ అశోక్ బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా డిగ్రీలో సింగిల్ విధానం తీసుకొచ్చి విద్యార్థులకు ఇష్టమైన కోర్సును చదువుకునే హక్కు లేకుండా చేశారని తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో కొత్త కోర్సులు ఏర్పాటు చేయకుండా, ఉన్న కోర్సులు ఎత్తివేసి ప్రభుత్వ ఖజానా తగ్గించుకోవడమే లక్ష్యంతో పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ విధానం అమలు చేస్తే భవిష్యత్తులో పేదవాడు ఉన్నత చదువుకు దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. డిగ్రీల ఈ విధానాన్ని రద్దు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు ఎం సోమేశ్వరరావు, నాయకులు మన్మథరావు, జాహిద్, భార్గవ్ పాల్గొన్నారు.

దక్షిణమధ్య రైల్వే

మమ్మల్ని @SCRailwayindia ద్వారా అనుసరించవచ్చు, ద.మ రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చు.

తేది: 20.06.2023, సవరణ

తేది:12.06.2023, టెండర్ నోటీసు నం.: బి-ఎస్‌జి-జిఎస్-05-2023-24,

PUB/0675

సవరణ వివరాలు క్రింద ఇవ్వబడ్డాయి :

1. టెండర్ బిడ్డింగ్ సిస్టం :

SL			
1	బిడ్డింగ్ సిస్టం	వర్తమానం	సింగిల్ ప్యాకెట్ సిస్టం
		సవరించబడినవి	టూ ప్యాకెట్ సిస్టం

2. టెండర్ విలువ/బిడ్ సెక్యూరిటీ విలువలు :

క్ర.సం.	వివరణ	వర్తమానం	సవరించబడినవి
1	టెండర్ ఆహ్వానించబడిన విలువ	Rs.11,71,05,259.37/-	Rs.11,05,84,459.37/-
2	బిడ్ సెక్యూరిటీ/ఇఎమ్‌డి విలువ	Rs.7,35,500.00/-	Rs.7,02,900.00/-

III. సవరించబడిన షెడ్యూల్ అంశముల వివరణ/పరిమాణాలు :

అంశం నం.	వర్తమానం	సవరించబడినవి
ఎస్‌సిహెచ్-ఎ1 అంశం-27	క్వాంటిటీ-5000 మీ.లు. రేటు-రూ.700/-	అంశం తొలగించబడినది
ఎస్‌సిహెచ్‌ఇ-ఎ1 అంశం-40	క్వాంటిటీ-12 (ప్రతి డిటెక్షన్ పాయింట్) రేట్-రూ.377600/-	క్వాంటిటీ (ప్రతి డిటెక్షన్ పాయింట్) రేట్-రూ.377600/- అంశం యొక్క వివరణ కూడా సవరించబడినది

A0950 డివై.చీఫ్ సిగ్నల్ అండ్ టెలికాం ఇంజనీర్/గాటి శక్తి, విజయవాడ.

IDBI BANK ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్ రిటైల్ రికవరీ, గవర్నర్‌పేట బ్రాంచి (151), విజయవాడ

APPENDIX IV [రూల్-8(1)]

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (2002 యొక్క 54) ప్రకారము ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి ...

తేది: 21.06.2023 ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్

న్యూఢిల్లీ : బీరేన్ సింగ్ నేతృత్వంలోని ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలు పూర్తిగా విశ్వాసం కోల్పోయారని పేర్కొంటూ మణిపూర్‌కు చెందిన 9 మంది బిజెపి ఎమ్మెల్యేలు ఆరోపించారు. ఈ విషయంలో ఇప్పటికే వారు ప్రధానికి ఐదు అంశాలపై మెమోరాండం సమర్పించారు. ప్రభుత్వంపై, పరిపాలనపై విశ్వాసం, నమ్మకం లేదని ఎమ్మెల్యేలు అందులో పేర్కొన్నారు. ఈ మెమోరాండంపై తొమ్మిది మంది ఎమ్మెల్యేలు సంతకాలు చేశారు. వీరంతా మెయిటీ కమ్యూనిటీకి చెందినవారే కావటం గమనార్హం. కుకీ ఎమ్మెల్యేలు, మెయిటీ ఎమ్మెల్యేల మధ్య సమావేశం ఏర్పాటు చేయాలని వీరు అభ్యర్థించారు. మణిపూర్‌లోని

మణిపూర్ బిజెపిలో అసమ్మతి సెగ

- రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయింది
- అధిష్టానానికి 9 మంది బిజెపి ఎమ్మెల్యేల మెమోరాండం

అన్ని ప్రాంతాలలో ఏకరీతిలో కేంద్ర బలగాలను మోహరించాలని కోరారు.

అయితే, ప్రభుత్వ వైఫల్యమంటూ బీరేన్ సింగ్‌పై సొంత పార్టీ ఎమ్మెల్యేలే ఇలా ప్రధానికి మెమోరాండం అందించటం రాజకీయంగా తీవ్ర చర్చకు దారి తీసింది. ఇది మణిపూర్ బిజెపిలో అసమ్మతి సెగ మరొక ఎపిసోడ్‌గా రాజకీయ విశ్లేషకులు పరిగణిస్తున్నారు. బీరెన్‌సింగ్‌కు విధేయులుగా ఉన్న మెయిటీ వర్గానికి చెందిన 28 మంది బీజేపీ ఎమ్మెల్యేలు కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్‌ను, నిర్మలా సీతారామన్‌లను కలిసిన రోజే (ఈ నెల 19న).. ఈ తొమ్మిది మంది ఎమ్మెల్యేలు ప్రధానికి ఈ మెమోరాండంను సమర్పించారు.

పేదల బియ్యంతో ఇథనాల్

- ఇంధన ఉత్పత్తి కోసం ఇవ్వాలంటూ అదేశాలు
- మోడీ నిర్ణయంతో రాష్ట్రాలకు కష్టాలు

న్యూఢిల్లీ : తన వద్ద ఆహార ధాన్యాల నిల్వలు పేరుకుపోతున్నప్పటికీ వాటిని పేదలకు సరఫరా చేసేందుకు కేంద్రం ససేమిరా అంటోంది. ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎఫ్) కోసం, సంక్షేమ పథకాల అమలు కోసం ఎఫ్‌సీఐ ద్వారా రాష్ట్రాలకు విక్రయించే బియ్యం, గోధుమలపై ఇప్పటికే కేంద్రం నిషేధం విధించింది. అయితే ఆ నిల్వలను ఇంధన తయారీలో వాడే ఇథనాల్ ఉత్పత్తికి మళ్లించాలని నిర్ణయం తీసుకుంది. తద్వారా పేదలకు అందాల్సిన బియ్యాన్ని ఇంధన ఉత్పత్తికి దారి మళ్లిస్తోంది. ఇథనాల్ ఉత్పత్తిలో బియ్యాన్ని ముడి పదార్థంగా వాడడం సరైన చర్య కాదని, ముఖ్యంగా ఆహార అవసరాల కోసం బియ్యం కొనకుండా రాష్ట్రాలను అడ్డుకోవడం సమర్థనీయమూ కాదని పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

బహిరంగ మార్కెట్‌లో అమ్మకం పథకం (ఓఎంఎస్‌ఎస్) కింద రాష్ట్రాలకు బియ్యం, గోధుమలను విక్రయించవద్దంటూ కేంద్రం ఈ నెల 13న ఎఫ్‌సీఐకి ఆదేశాలు జారీ చేసింది. అదే సమయంలో ఇథనాల్ ఉత్పత్తి కోసం మాత్రం రాష్ట్రాలకు బియ్యాన్ని కేటాయించవచ్చునంటూ ఎఫ్‌సీఐకి వెసులుబాటు ఇచ్చింది. 2013వ సంవత్సరపు ఆహార భద్రతా చట్టం ప్రకారం దేశంలోని 81.3 కోట్ల మంది లబ్దిదారుల కోసం ఆరు కోట్ల టన్నుల బియ్యం, గోధుమలను కేంద్రం పంపిణీ చేయాల్సి ఉంది. ఇందుకోసం కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా బియ్యం, గోధుమలను సేకరించి, నిల్వ చేసి, పంపిణీ చేస్తూ ఉంటుంది. గత కొన్ని సంవత్సరాలుగా పీడీఎస్, సంక్షేమ పథకాల కోసం అవసరమైన దాని కంటే ప్రభుత్వం ఎక్కువగానే ఆహార ధాన్యాలను సేకరిస్తోంది. ఈ సంవత్సరం జూన్ 1వ తేదీ నాటికి కేంద్రం వద్ద 41.4 మెట్రిక్ టన్నుల బియ్యం, 31.4 టన్నుల గోధుమల నిల్వ ఉంది.

ఓఎంఎస్‌ఎస్ ఎందుకు?

ఆహార ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడమే ఓఎంఎస్‌ఎస్ ఉద్దేశం. కేంద్రం వద్ద నిల్వ ఉన్న అదనపు ఆహార ధాన్యాలను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఎఫ్‌సీఐ విక్రయించవచ్చు. నిబంధనల కంటే కేంద్రం వద్ద ఎక్కువ నిల్వలు ఉన్నప్పుడు వాటిని తగ్గించుకునేందుకు ఓఎంఎస్‌ఎస్‌ను అమలు చేస్తారు. ఇలాంటి పరిస్థితులలో కేంద్రం సాధారణంగా రాష్ట్రాలకు అదనపు నిల్వల విక్రయాన్ని స్వాగతిస్తుంది. ఎందుకంటే ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ కింద తనకు కేటాయించిన ఆహార ధాన్యాలకు చెల్లించిన ధర కంటే ఓఎంఎస్‌ఎస్ కింద చెల్లించే ధరే ఎక్కువగా ఉంటుంది. ఉదాహరణకు ఈ సంవత్సరం మే 24 నుండి రాష్ట్ర ప్రభుత్వాలు ఓఎంఎస్‌ఎస్ కింద క్వింటాలుకు రూ.3,400 చొప్పున 1.16 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు కొనుగోలు చేశాయి. ఇందులో ఒక్క కర్నాటక రాష్ట్రమే 1.12 లక్షల మెట్రిక్ టన్నులు తీసుకుంది.

దిగుమతులను తగ్గించేందుకే : కేంద్రం

భారత ఇంధన అవసరాలలో 86% దిగుమతుల పైనే ఆధారపడి ఉన్నాయి. దిగుమతులపై ఆధారపడకుండా ఉండేందుకు ఇథనాల్ ఉత్పత్తి, వినియోగంపైన ప్రభుత్వం దృష్టి సారించింది. దేశీయంగా ఇథనాల్‌ను ఉత్పత్తి చేయాలంటే చెరకు, మొక్కజొన్న, బియ్యం ఉత్పత్తులను పెంచాల్సిన అవసరం ఉంది. అందుకే ఎఫ్‌సీఐ విక్రయించే బియ్యాన్ని ఇథనాల్ ఉత్పత్తి కోసం ప్రభుత్వం కేటాయిస్తోంది. ఇథనాల్‌ను ఉత్పత్తి చేసే డిస్టిలరీలకు బియ్యమే ప్రధాన వనరు. ఇథనాల్‌కు క్వింటాలుకు రూ.2,000 ధరగా ప్రభుత్వం నిర్ణయించింది. ఓఎంఎస్‌ఎస్ కింద రాష్ట్ర ప్రభుత్వాలకు నిర్ణయించిన రూ.3,400 కంటే ఇది చాలా తక్కువ. నీతి ఆయోగ్ కింద నిపుణుల కమిటీ రూపొందించిన డాక్యుమెంట్ ఆధారంగానే ఇథనాల్ ఉత్పత్తి కోసం బియ్యం కేటాయించాలన్న విధానాన్ని రూపొందించారు. కేంద్రం వద్ద ప్రతి ఏటా 30.9 మిలియన్ టన్నుల బియ్యం అదనంగా నిల్వ ఉంటోందని నీతి ఆయోగ్ డాక్యుమెంట్ తెలిపింది. 2020-21లో 1.06 మెట్రిక్ టన్నులు, ఈ సంవత్సరం 1.5 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఇథనాల్ ఉత్పత్తి కోసం కేంద్రం కేటాయించింది.

24, 25న రాష్ట్ర పెంటాథ్లాన్ క్రీడలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఈ నెల 24, 25 తేదీల్లో మోడరన్ పెంటాథ్లాన్ రాష్ట్రస్థాయి క్రీడలు జరగనున్నాయని పెంటాథ్లాన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రీడలు జూనియర్స్ సీనియర్స్, మాస్టర్స్ విభాగాల్లో జరుగుతాయన్నారు. 9 ఏళ్లు నిండిన వారు ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉందని, ఉత్సాహం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ క్రీడలు లేజర్ రన్, స్విమ్మింగ్ రెండు విభాగాల్లో జరుగుతాయన్నారు. క్రీడల్లో పాల్గొనదలిచిన ఔత్సాహికులు ఈ క్రింద తెలిపిన నెంబర్లకు ఫోన్ చేసి వారి వివరాలు నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లాల క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. 9030978888, 9490896851, 9848411027 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

900 బిఎస్‌ఎన్‌ఎల్ 4జి టవర్లు

ప్రజాశక్తి -సీలేరు

అల్లూరి సీతారామరాజు జిల్లాలో 900 బిఎస్‌ఎన్‌ఎల్ 4జి టవర్లు ఏర్పాటు చేయడానికి ప్రక్రియ పూర్తి చేసామని బిఎస్‌ఎన్‌ఎల్ జనరల్ మేనేజర్ పాల్ విలియమ్ వెల్లడించారు. బుధవారం సీలేరులో విస్తృతంగా పర్యటించి ఆయన బిఎస్‌ఎన్‌ఎల్ టవర్లు సిగ్నల్ పనితీరు తదితర అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బిఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో బోర్డులు తదితర సామాగ్రిని పరిశీలించారు. వినియోగదారులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా నెట్వర్క్ నిరంతరం ఉండేలా చర్యలు చేపట్టాలని డీఈ రాజకుమార్ ఆదేశించారు. అనంతరం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ టవర్లు ఏర్పాటుకు బేస్మెంట్ లెవల్ పనులు కూడా ప్రారంభించామన్నారు.

డోలిలోనే పోతున్న ప్రాణాలు

- మార్గమధ్యలో పిట్స్ రావడంతో గర్భిణీ మృతి
- రహదారి సౌకర్యం లేక అవస్థలు

- ప్రభుత్వమే బాధ్యత వహించాలని సిఐటియు, గిరిజన సంఘం
- అల్లూరి సీతారామ రాజు జిల్లాలో ఆదివాసీలకు దారి కష్టాలు

ప్రజాశక్తి-కొయ్యూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

పిట్స్ వచ్చిన గర్భిణికి సకాలంలో వైద్యం అందకపోవడంతో మృతి చెందిన సంఘటన కొయ్యూరు మండలం మూలపేట పంచాయతీ పరిధి కుమ్మర్ల గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... కుమ్మర్ల గ్రామానికి చెందిన గర్భిణి పాంగి (20) రోజాకు మంగళవారం పిట్స్ వచ్చింది. గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో వెంటనే కుటుంబ సభ్యులు డోలి కట్టి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న డౌనూరు పిహెచ్‌సికి తీసుకొని వెళుతుండగా, మార్గమధ్యలో పరిస్థితి విషమించి రోజూ మృతి చెందింది. రహదారి సౌకర్యం ఉండివుంటే వాహనంలో తరలించి సకాలంలో వైద్యం అందించి ఉండేవాళ్లమని, రహదారి లేకపోవడం వల్లే తన భార్య మృత్యువాత పడిందని రోజా భర్త చంటి కన్నీరుమున్నీరయ్యాడు.

సిఐటియు, గిరిజన సంఘం నాయకుల పరామర్శ

రోజు మృతి చెందిన విషయం తెలుసుకున్న సిఐటియు, గిరిజన సంఘం నాయకులు కుమ్మర్ల గ్రామానికి వెళ్లి మృతురాలి కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.అప్పలనాయుడు మాట్లాడుతూ రోజా మరణానికి ప్రభుత్వం, ఐటిడిఎ అధికారులే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

మారుమూల గిరిజన గ్రామాలకు నేటికీ రోడ్లు లేక గర్భిణులు, బాలింతలు, అనారోగ్యానికి గురయ్యేవారికి డోలి మోతలు తప్పడం లేదని, ఇలాంటి సమయాల్లో సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయని పేర్కొన్నారు. కుమ్మర్ల గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని అనేక మార్లు విన్నవించుకున్నా ఐటిడిఎ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదన్నారు. అందువల్ల రోజా మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించి తక్షణమే ఆమె కుటంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, రోజా భర్త చంటికి ఉద్యోగం కల్పించాలని, గ్రామానికి రహదారి నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండలి కమిటీ సభ్యులు కొర్ర చిన్నా, మర్రి వెంకటరావు, గెమ్మిలి సాన సోమయ్య, తాంబేలి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మరో గర్భిణీకి అవస్థలు

ప్రజాశక్తి-పెదబయలు

అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలంలోని మారుమూల గోమాంగిలో నిండు గర్భిణీ అవస్థలు పడింది. బుధవారం గోమాంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కరుగొండ సమీపంలో బొద్దాపుట్టు గ్రామంలో గర్భిణీ విజయ రెండవ కాన్పు నొప్పులు రావడంతో అంగనవాడి టీచర్ రెండు కిలో మీటర్ల దూరంలో కొండపైకి వెళ్లి సిగ్నల్ పాయింట్ నుండి 108 అంబులెన్సుకు సమాచారం అందించారు. అంబులెన్సు సుమారు రెండు గంటల తరువాత కారుగొండ గ్రామానికి చేరుకోంది. రోడ్డు సదుపాయం లేక అంబులెన్సు కారుగొండ గ్రామంలోనే ఉండటంతో డోలి మోత ద్వారానే నిండు గర్భిణీని అంబులెన్సులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. గంటలపాటు పురిటి నొప్పులతో ఆమె అవస్థలు పడ్డారు.

గర్భిణి మృతికి ప్రభుత్వం బాధ్యత వహించాలి : ఐద్వా

గర్భిణీ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఐద్వా జిల్లా అధ్యక్షులు వివి జయ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అరకులోయ ఏపీ ఆదివాసి గిరిజన సంఘం కార్యాలయంలో బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం మూలపేట పంచాయతి కుంబుర్ల గ్రామంలో 45 కుటుంబాలు, 230 మంది గిరిజనులు జీవిస్తున్నారన్నారు. గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదన్నారు. మంగళవారం గర్భిణీ స్త్రీ కొర్ర రోజా (22) పురిటి నొప్పులు రావడంతో డోలి మోతతో ఆసుపత్రిలో తీసుకెళ్తుండగా మార్గంలో మృతి చెందడం బాధాకరమన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

సవరణ

ఋణగ్రహీతలు: 1) కగ్గ శ్రీనివాస్ రావు, కగ్గ నాగమణి, 2) పోట్ల మరియమ్మ, తుమ్మల రవి లకు సంబంధించి ది.13-06-2023 తేదీన "ప్రజాశక్తి దినపత్రిక, విజయవాడ ఎడిషన్‌లో" ప్రచురించిన స్థిరాస్తుల స్వాధీనంకు సంబంధించిన ప్రకటనలో ప్రకటన చివరి భాగం ప్రింటింగ్‌లో ప్రచురితమవలేదు. దయచేసి ప్రకటన చివరి భాగంలో "సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు సంబంధించి చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై రుణగ్రహీత శ్రద్ధ వహించవలసిందిగా కోరబడుచున్నది" మరియు "తేది: 13-06-2023, ప్రదేశం: గుంటూరు" అని చదువుకోగలరు" ఇతరములలో ఎటువంటి మార్పులేదు.

సం/- అధీకృత అధికారి
హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ

అయోధ్యనగర్ బ్రాంచి : అయోధ్యనగర్, విజయవాడ, ఎన్‌టిఆర్ జిల్లా. ఎపి.

NOTICE UNDER SECTION 13 (2) OF ACT 54 OF 2002 FOR ENFORCEMENT OF SECURITY INTEREST

డిమాండ్ నోటీసు

టు : ఋణగ్రహీత : 1) శ్రీమతి ద్వారక పాలడుగు (ఋణగ్రహీత), భర్త : ఇలియ, డి.నెం. 42-39-19, మసీదు వీధి, అజిత్‌సింగ్ నగర్, విజయవాడ. 2) శ్రీ పాలడుగు ఇలియ (సహ ఋణగ్రహీత), తండ్రి : దానియేల్, డి.నెం. 42-39-19, మసీదు వీధి, అజిత్‌సింగ్ నగర్, విజయవాడ. 3) శ్రీ కోట మణిరాజు (హామీదారు) తండ్రి : కె. ప్రకాష్‌రాజు, డి.నెం. 42-2/1-176, దేవినగర్, 2వ లైన్, విజయవాడ. 4) శ్రీమతి పి. సుగుణమ్మ (హామీదారు) భర్త : రామచంద్రరావు, డి.నెం. 42-49-8, అజిత్‌సింగ్ నగర్, విజయవాడ.

నేచర్ ఆఫ్ లిమిట్	అమౌంట్ (లక్షల్లో)	బకాయి మొత్తము (రూ.) ది. 29-05-2023
Home Loan 640706650000019	రూ. 9,00,000/-	Rs. 10,43,309.80/-

ప్రాథమిక హామీ : శ్రీమతి ద్వారకా పాలడుగు గారి పేరిట విజయవాడ, అజిత్‌సింగ్ నగర్, మసీదు వీధి, ఆర్.ఎస్.నెం. 17 వద్ద అవిభక్త మరియు పేర్కొనబడని వాటా 25 చ॥గ॥లతో కలిపి మొత్తం 266.66 చ॥గ॥లు అందలి నిర్మించిన శ్రీ వెంకటేశ్వర ఎన్‌క్లేవ్ నందు నివాస ఫ్లాట్ నెం. ఎఫ్.ఎఫ్-1.

అమ్మా / అయ్యా,

విషయం : ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టము ప్రకారము నోటీసు - మీరు మా నుండి పొందిన ఋణ సౌకర్యములకు సంబంధించి - నిరర్ధక ఆస్తులుగా వర్గీకరణ.

ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా మీరు హోమ్ లోన్ క్రింద మా అయోధ్యనగర్ బ్రాంచి వద్దనున్న మీ ఋణ బకాయిలను / వడ్డీని చెల్లించుటలో విఫలమైనందున మీ ఖాతాను ది. 29-05-2023 న నిరర్ధక ఆస్తిగా (NPA) వర్గీకరించబడింది. ఎగువ తెలిపిన తేదిన మీ ఋణ ఖాతాల బకాయిలు మొత్తము పైన తెలుప బడినవి. అనేక మార్లు విన్నపములు చేసినప్పటికీ, మీరు మీ ఖాతాలోని బకాయి మొత్తములను చెల్లించలేదు / మీ ఋణములను చెల్లించలేదు. అందువలన సెక్యూరిటైజేషన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 యొక్క సెక్షన్ 13 (2) ప్రకారము మీ యొక్క బకాయి మరియు ఋణ పత్రములో అంగీకరించబడిన నియమ నిబంధనలలో ఉన్న ఒప్పందపు రేటు ప్రకారము పైన తెలుపబడిన బకాయి తేది తదుపరి నెలవారి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా ఈ నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసి ఉంటుందని, అట్లు చేయుటలో విఫలమైనచో మీరు మా బ్యాంకుకు హామీ ఇచ్చిన ఆస్తులపై సదరు చట్టం ప్రకారం లభించు ఏవేని లేదా అన్ని హక్కులను ప్రయోగించవలసి ఉంటుందని తెలియజేయడమైనది.

1) మీరు సదరు బకాయిలను 60 రోజులలోగా తిరిగి చెల్లించుటలో విఫలమైనచో, బ్యాంకు వారు సదరు చట్టం ప్రకారం వారికి సంక్రమించిన అన్ని హక్కులను వినియోగించి హామీ ఇవ్వబడిన ఆస్తుల విక్రయ ధనముతో బకాయిలను పూర్తిగా చెల్లించబడనప్పుడు, మిగిలిన బకాయి సొమ్ము మీ నుండి రాబట్టుకొనుటకు, న్యాయస్థానము / డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ నందు తగు న్యాయపరమైన చర్యలు తీసుకోబడునని తెలియజేయడమైనది.

2) సదరు చట్టం యొక్క సెక్షన్ 13 (13) ప్రకారము ఈ నోటీసు పొందిన అనంతరం మీరు పైన చెప్పబడిన ఆస్తులను సాధారణ వ్యాపార కార్యకలాపాలు తప్ప బ్యాంకు వారి అనుమతి లేకుండా విక్రయించరాదు. మరియు లావాదేవీలు జరుపరాదు సదరు సెక్షన్‌లో నిబంధనలలో ఏ విధమైన అతిక్రమణ జరిగిన తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని గమనించగలరు.

SARFAESI చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) ప్రకారము ఋణగ్రహీత తనఖా ఆస్తిని గడువు లోపల విడిపించుకొనుటకు గాను దృష్టిసారించవలసి ఉన్నది.

తేది : 03-06-2023 సం/- ఆథరైజ్డ్ ఆఫీసర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సెక్యూరిటి ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చట్టం, 2002 (ది యాక్ట్) మరియు ఆర్థిక ఆస్తుల సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ లోని సెక్షన్ 13 (2) కింద నోటీసు

వ. సంఖ్య	రుణగ్రహీత(ల) పేరు (ఎ)	తాకట్టు ఆస్తి వివరాలు (బి)	ఎన్‌పిఎ తేదీ (సి)	బకాయివున్న మొత్తం (రూ.) (డి)
1.	రుణ ఖాతా నం. HLLAGUN00465636 ...	డోర్ నం. 5-64-77, జిఎంసి కేటాయించిన న్యూ డోర్ నం. 28-19-930, పాత మున్సిపల్ వార్డు నం. 2, ...	07.06.2023	07.06.2023నాటికి రూ. 78,58,549.47/- ...

స్థలం: గుంటూరు (ఆంధ్రప్రదేశ్)

స్వాధీనత ప్రకటన

ఎడెల్‌వీస్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్

CIN: U67100MH2007PLC174759

తేది: 21.06.2023

సం/- అధీకృత అధికారి
ఎడెల్‌వీస్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ తరఫున

Edelweiss Asset Reconstruction

హక్కుల ఉల్లంఘనపై చర్చించండి

- మోడీ, బైడెన్‌లకు అమ్నెస్టీ ఇంటర్నేషనల్ సూచన
- రెండు దేశాలలోనూ ఇవి తీవ్రంగా ఉన్నాయని వ్యాఖ్య



వాషింగ్టన్ : ప్రధాని నరేంద్ర మోడీ, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మధ్య గురువారం జరిగే సమావేశంలో రెండు దేశాలలోనూ జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలపై చర్చించాలని అమ్నెస్టీ ఇంటర్నేషనల్ సూచించింది. మూడు రోజుల పర్యటన నిమిత్తం మోడీ అమెరికా చేరుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అమ్నెస్టీ ఇంటర్నేషనల్ సీఓబీ (ఛైర్ ఆఫ్ బోర్డ్) ఆకార్ పటేల్ మాట్లాడుతూ భారత్, అమెరికా దేశాలలో మానవ హక్కులు తీవ్రంగా ఉల్లంఘనకు గురవుతున్నాయని, వాటిని కప్పిపుచ్చడానికి బదులు ఇరువురు నేతలు వాటిపై చర్చలు జరపాలని అన్నారు. మోడీకి అమెరికాలో ఘనస్వాగతం పలికారని, కానీ భారత్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలు కొనసాగుతూనే ఉన్నాయని చెప్పారు.

మోడీ హయాంలో భారత్‌లో మానవ హక్కులు అత్యంత వేగంగా క్షీణిస్తున్నాయని, మైనారిటీలపై హింసాకాండ కొనసాగుతోందని, పౌర సమాజంలో అసమ్మతికి చోటే లేకుండా పోతోందని అమ్నెస్టీ ఇంటర్నేషనల్ (అమెరికా) ప్రభుత్వ వ్యవహారాల జాతీయ డైరెక్టర్ అమంద క్లాసింగ్ తెలిపారు. ముస్లింల ఆస్తులు విధ్వంసానికి గురవుతున్నాయని ఆయన చెప్పారు. భారత్‌లో మైనారిటీలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్న విషయాన్ని అమెరికా విదేశాంగ శాఖ కూడా గుర్తించిందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మత స్వేచ్ఛపై అమెరికా విదేశాంగ శాఖ 2022లో విడుదల చేసిన నివేదికను ప్రస్తావించారు. భారత్‌లో చట్టాలను తుంగలో తొక్కి హత్యాకాండ, వేధింపులు జరుగుతున్నాయని, పక్షపాత ధోరణితో అరెస్టులు చేస్తున్నారని ఆ నివేదిక ఎత్తిచూపిందని గుర్తు చేశారు. తన విదేశాంగ శాఖ ఇచ్చిన నివేదికను బైడెన్ విస్మరించకూడదని క్లాసింగ్ హితవు పలికారు. 'అభ్యంతరకరమైన భాషను వాడవద్దని బీజేపీ నాయకులకు నచ్చచెప్పమని మోడీని కోరండి. అలాగే మైనారిటీలపై జరుగుతున్న దాడులపై విచారణ జరిపించి దోషులను శిక్షించేలా చూడాలని చెప్పండి' అని ఆయన బైడెన్‌కు సూచించారు.

భారత్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలపై మోడీతో చర్చించాలని హ్యూమన్ రైట్స్ వాచ్ ఆసియా విభాగం డైరెక్టర్ ఎలైన్ పియర్సన్ కూడా దేశాధ్యక్షుడిని కోరారు. కాగా భారత్‌లో పౌర స్వేచ్ఛ క్షీణించడంపై ఇటీవలి కాలంలో పలు అంతర్జాతీయ సంస్థలు ఆందోళన వ్యక్తం చేశాయి. గడచిన పది సంవత్సరాల కాలంగా దారుణమైన నిరంకుశత్వాన్ని ప్రదర్శిస్తున్న దేశాల జాబితాలో భారత్ కూడా చేరిందని స్వీడన్‌కు చెందిన వెరైటీస్ ఆఫ్ డెమొక్రసీ సంస్థ పేర్కొంది. 180 దేశాలలో పత్రికా స్వేచ్ఛపై సూచికను విడుదల చేసిన ఓ సంస్థ 2022లో 151వ స్థానంలో ఉన్న భారత్ ఈ సంవత్సరంలో 161వ స్థానానికి దిగజారిందని తెలిపింది. ఈ నేపథ్యంలోనే పలు మానవ హక్కుల సంఘాలు మోడీ అమెరికా పర్యటనకు నిరసనగా ప్రదర్శన నిర్వహించాలని యోచిస్తున్నాయి. ఇండియన్ అమెరికన్ ముస్లిం కౌన్సిల్, పీస్ యాక్షన్, వెటరన్స్ ఫర్ పీస్, బెథెస్డా ఆఫ్రికన్ సెమెటరీ కొయలేషన్ వంటి సంస్థలు ఆందోళనకు పిలుపునిచ్చాయి.

ఆందోళన కలిగించే విషయాలనూ ప్రస్తావించండి
బైడెన్‌కు అమెరికా కాంగ్రెస్ సభ్యుల లేఖ

భారత్‌లో ప్రజాస్వామ్యానికి ఎదురవుతున్న సవాళ్లపై డెమొక్రటిక్ పార్టీకి చెందిన అమెరికా కాంగ్రెస్ (అమెరికా చట్టసభ) సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీతో జరిపే చర్చల సందర్భంగా ఈ విషయాన్ని కూడా ప్రస్తావించాలని వారు దేశాధ్యక్షుడు జో బైడెన్‌ను కోరారు. ఈ మేరకు అమెరికా కాంగ్రెస్‌కు చెందిన 75 మంది డెమొక్రటిక్ సభ్యులు ఆయనకు లేఖ రాశారు. గత తొమ్మిది సంవత్సరాల కాలంలో మోడీ అమెరికాలో ఐదు సార్లు పర్యటించినప్పటికీ పూర్తి స్థాయిలో దౌత్యపరమైన ప్రొటోకాల్ లభించడం ఇదే మొదటిసారి.

'అమెరికా, భారత్ మధ్య బలమైన సంబంధాలు కొనసాగాలని మేము కూడా కోరుకుంటున్నాము. అయితే స్నేహితులు కూడా తమ మధ్య నెలకొన్న విభేదాలను హుందాగా, సూటిగా చర్చించుకోవచ్చు. రెండు దేశాల మధ్య పరస్పర ప్రయోజనాలున్న అంశాలతో పాటు ఆందోళన కలిగించే విషయాలను కూడా ప్రస్తావించండి' అని ఆ లేఖలో వారు కోరారు. సెనెటర్ క్రిస్ వాన్ హోలెన్, చట్టసభ ప్రతినిధి ప్రమీలా జయపాల్ నాయకత్వంలో ప్రతినిధులు ఈ లేఖ రాశారు. దీనిపై 18 మంది సెనెటర్లు, 57 మంది ప్రతినిధిసభ సభ్యులు సంతకాలు చేశారు. వీరిలో అమెరికా అధ్యక్ష పదవికి జరిగే ఎన్నికలలో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న సెనెటర్లు బెర్నీ శాండర్స్, ఎలిజబెత్ వారెన్ కూడా ఉన్నారు. కాగా తన పర్యటనపై అమెరికా కాంగ్రెస్ ప్రతినిధులు, పలువురు నాయకులు ఎంతో ఆసక్తి చూపుతున్నారంటూ అంతకుముందు మోడీ ట్వీట్ చేశారు. అయితే భారత్‌లో రాజకీయ ప్రత్యర్థులు, మైనారిటీలు, పౌర సమాజ సభ్యులపై జరుగుతున్న వేధింపులపై వ్యక్తమవుతున్న ఆందోళనను వాల్‌స్ట్రీట్ జర్నల్ పత్రిక ఆయన దృష్టికి తేగా స్పందించేందుకు నిరాకరించారు. మానవ హక్కులు, పత్రికా స్వేచ్ఛ, మతపరమైన స్వేచ్ఛ వంటి అంశాలను బైడెన్ గౌరవిస్తారని కాంగ్రెస్ ప్రతినిధులు ఆ లేఖలో గుర్తు చేశారు. ప్రపంచ వేదికపై ఈ విలువలను విశ్వసనీయతతో ముందుకు తీసికెళ్లాలంటే వాటిని స్నేహితులతో పాటు శత్రువులకూ సమానంగా వర్తింపజేయాలని తెలిపారు. అమెరికాలోనూ ఇవే సూత్రాలను పాటిస్తున్నామని పేర్కొన్నారు. భారత్‌లో మతపరమైన అసహనం పెరుగుతోందని, పౌర సమాజాలు, పాత్రికేయులను లక్ష్యంగా చేసుకొని వేధింపులకు పాల్పడుతున్నారని, పత్రికా స్వేచ్ఛ పైన, ఇంటర్నెట్ పైన ఆంక్షలు పెరుగుతున్నాయని వారు వివరించారు. ఈ సందర్భంగా వారు భారత్‌లో నెలకొన్న పరిస్థితులపై అమెరికా విదేశాంగ శాఖ ఇచ్చిన వార్షిక నివేదికలను ప్రస్తావించారు.

'మేము ఏ భారతీయ రాజకీయ నాయకుడికి కానీ, పార్టీకి కానీ మద్దతు ఇవ్వడం లేదు. దానిపై అక్కడి ప్రజలే నిర్ణయం తీసుకుంటారు. అయితే అమెరికా విదేశాంగ విధానంలో కీలకంగా ఉన్న ముఖ్యమైన సూత్రాలకు మేము మద్దతు ఇవ్వాల్సి ఉంటుంది. ఘనమైన రెండు దేశాల మధ్య విజయవంతమైన, బలమైన, దీర్ఘకాలిక సంబంధాలు నెలకొనాలంటే అనేక అంశాలపై మోడీతో చర్చించడం చాలా అవసరం' అని వారు ఆ లేఖలో కోరారు. కాగా మోడీతో మానవ హక్కుల ఉల్లంఘనలపై చర్చించాలని అంతర్జాతీయ మతస్వేచ్ఛకు సంబంధించిన అమెరికా కమిషన్ దేశాధ్యక్షుడు బైడెన్‌ను కోరింది. రెండు దేశాల మధ్య చర్చకు వచ్చే ద్వైపాక్షిక అంశాలలో మత స్వేచ్ఛను కూడా చేర్చాలని ఓ ప్రకటనలో సూచించింది.

మోడీ ప్రసంగాన్ని బహిష్కరిస్తాం

కాంగ్రెస్ ఉభయసభలను ఉద్దేశించి మోడీ చేసే ప్రసంగాన్ని తాను బహిష్కరిస్తానంటూ డెమొక్రటిక్ సభ్యురాలు రషీదా తాలిబ్ ట్వీట్ చేశారు. అమెరికా రాజధానిలో మోడీకి వేదిక కల్పించడం సిగ్గుచేటని ఆమె మండిపడ్డారు. మానవ హక్కుల ఉల్లంఘనలు, ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలు, ముస్లింలు-మైనారిటీలు లక్ష్యంగా జరుగుతున్న దాడులు, జర్నలిస్టులపై ఆంక్షలు వంటి విషయాలలో మోడీకి సుదీర్ఘ చరిత్ర ఉన్నదని ఎద్దేవా చేశారు. ఇవి ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌కు చెందిన మరో సభ్యురాలు ఇల్హాన్ ఒమర్ కూడా తాను మోడీ ప్రసంగ కార్యక్రమానికి హాజరు కావడం లేదంటూ ట్వీట్ చేశారు. 'మోడీ ప్రభుత్వం మైనారిటీలను అణచివేస్తోంది. హింసకు పాల్పడుతున్న హిందూ జాతీయవాద గ్రూపులకు మద్దతు ఇస్తోంది. పాత్రికేయులను, హక్కుల కార్యకర్తలను లక్ష్యంగా చేసుకొని వేధిస్తోంది' అని ఆమె తెలిపారు. అణచివేతలు, హింస విషయంలో ప్రధాని మోడీకి ఉన్న రికార్డుపై మానవ హక్కుల సంఘాలతో చర్చిస్తానని ఆమె అన్నారు.

బైడెన్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం : చైనా

బీజింగ్ : చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్‌ను నియంతతో పోలుస్తూ అమెరికా అధ్యక్షుడు బైడెన్ చేసిన వ్యాఖ్యలపై చైనా ఆగ్రహం వ్యక్తం చేసింది. బైడెన్ వ్యాఖ్యలు పూర్తిగా అభ్యంతరకరం, బాధ్యతారహితమూనని పేర్కొంది. మంగళవారం కాలిఫోర్నియాలో నిధుల సేకరణ కార్యక్రమంలో బైడెన్ మాట్లాడుతూ, ఈ ఏడాది ప్రారంభంలో అమెరికా గగనతలంలోకి ప్రవేశించిన చైనా బెలూన్ చుట్టూ నెలకొన్న వివాదాన్ని ప్రస్తావించారు. జిన్‌పింగ్‌కు ఆ విషయం కూడా తెలీదన్నారు. "నియంతలకు ఇదొక పెద్ద ఇబ్బందికరమైన అంశం. ఏం జరిగిందో వారికి తెలియనపుడు ఆ బెలూన్ వెళ్ళాల్సిన చోటకు వెళ్లలేదు. " అని బైడెన్ వ్యాఖ్యానించారు. బుధవారం పత్రికా సమావేశంలో చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ దీనిపై స్పందిస్తూ,. బైడెన్ వ్యాఖ్యలు అత్యంత అసంబద్ధమైనవని విమర్శించారు. చైనా రాజకీయ గౌరవాన్ని దెబ్బతీసేలా ఉండడమే గాక, అంతర్జాతీయ దౌత్య మర్యాదలను పూర్తిగా ఉల్లంఘించేవిగా ఉన్నాయని అన్నారు. దీనిని ' బహిరంగ రాజకీయ కవ్వింపు చర్య" గా ఆమె పేర్కొన్నారు. బెలూన్‌పై చైనా వైఖరిని ఆమె పునరుద్ఘాటించారు. గాలి వాటం వల్ల ఆ బెలూన్ అమెరికా గగనతలంలోకి ప్రవేశించిందని పేర్కొన్నారు.

బాధితులు వారే...నిందించేది వారినే...!

- ప్రపంచ శరణార్థుల దినోత్సవ తీరిదీ!!

న్యూయార్క్ : ప్రతి ఏటా జూన్ 20న ప్రపంచ శరణార్థుల దినోత్సవాన్ని ఐక్యరాజ్య సమితి నిర్వహిస్తూ వస్తోంది. సాధికారత, సానుకూలతలను నొక్కి చెప్పడానికి ఐక్యరాజ్య సమితి, అనుబంధ సంస్థలు ఈ రోజును ప్రస్తావిస్తూ వుంటాయి. పశ్చిమ దేశాలు చాలా వరకు శరణార్థుల దినోత్సవాన్ని ఖరీదైన విందులకు, ఆర్భాటపు ప్రకటనలకు పరిమితం చేస్తుంటాయి. శరణార్థుల హక్కులను గుర్తించడం కానీ, వాటి అమలుకు ప్రయత్నించడం కానీ చేయవు. శరణార్థులకు సంబంధించి ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ శరణార్థుల సంస్థ (యుఎన్‌హెచ్‌సిఆర్) నిర్దేశించిన నియమ నిబంధనలను అవి తుంగలో తొక్కుతున్నాయి. దీనికి వారం రోజుల క్రితం లిబియా నుండి గ్రీస్ వెళుతున్న బోటు గ్రీస్‌కు సమీపంలో మధ్యధరా సముద్ర జలాల్లో బోల్తా పడడంతో దాదాపు 500మంది శరణార్థులు మరణించారు. ఈ మహా విషాదం నుండి కేవలం 104మందిని మాత్రమే కాపాడగలిగారు. గ్రీస్, టర్కీ అనుసరించిన విధానాలే దీనికి ముఖ్యకారణం. ఇటువంటి ప్రమాదాలు జరిగినపుడు పత్రికల్లో వచ్చే పతాక శీర్షికలు, వార్తా కథనాలు చెప్పడానికి ప్రయత్నించేదాని కన్నా అత్యంత వాస్తవికతతో కూడిన కథనాలను తాజా విషాదం చెబుతుంది. యుద్ధం, పేదరికం, అసమానతలు, నిరాశా నిస్పృహలతో నిండిన కథనాలే ఇవన్నీ. సముద్రపు ఒడ్డున చెల్లా చెదురుగా పడిన మృతదేహాల్లో సిరియన్లు, పాలస్తీనియన్లు, ఆఫ్ఘన్లు, సూడాన్ జాతీయులు ఇంకా చాలామంది వున్నారు. వీరందరూ తమ బతుకుకు భద్రత కోసమే ఇతర దేశాలకు వెళ్ళాలని ప్రయత్నించారు. ఆ ప్రయత్నాల్లో తమ ప్రాణాలే పోగొట్టుకున్నారు. శరణార్థుల పట్ల సమాజాలకు, ప్రభుత్వాలకు వున్న నైతికత బాధ్యతల గురించి మేధావులు చెబుతూ వుంటారు, కార్యాచరణ చేపట్టాలని దౌత్యవేత్తలు డిమాండ్ చేస్తారు. కానీ కేవలం ఘోష తప్ప అక్కడ జరిగేదేమీ వుండదు. 2014-2022 మధ్య కాలంలో యూరప్ దేశాలకు చేరడానికి ప్రయత్నించే క్రమంలో 23వేల మందికి పైగా శరణార్థులు సముద్ర జలాల్లో మునిగిపోవడమో, గల్లంతవడమో జరిగింది. వాస్తవానికి ఈ సంఖ్య ఇంకా ఎక్కువే వుంటుంది. ఎందుకంటే ఇటువంటి ప్రాణాంతక ప్రయాణాలకు ఎలాంటి అధికారిక రికార్డులు వుండవు కనుక. బాధితులు ఏ జాతీయులన్న గుర్తింపే ఇక్కడ మనకు పెద్ద క్లూగా వుంటుంది. అప్పుడే వారు ప్రాణాలకు తెగించి ఇటువంటి ప్రయాణాలు ఎందుకు చేశారన్నదీ అర్థమవుతుంది. కేవలం బతకాలనే ఒకే ఒక్క తలంపుతోనే వారు వర్ణ వివక్షతో సహా అనేక అవమానాలు, వేధింపులు, ప్రమాదాలు అన్నింటినీ సహిస్తారు. ఇంత జరిగినా, ఇటువంటి మానవ మహా విషాదాల వెనుక గల అసలు దోషులను, బాధ్యులను పట్టుకోలేకపోతున్నాం. ఆయుధాల తయారీదారులు, మిలటరీ జోక్యందారులు, ఘర్షణలను రెచ్చగొట్టే రాజకీయ నేతలను అసలైన దోషులుగా నిర్ధారించి సరైన చర్యలు తీసుకున్నపుడు ఇటువంటి ప్రమాదాలు నివారించడానికి అవకాశం వుంటుంది. వీరంతా మధ్య ప్రాచ్యం, ఆఫ్రికా, అంతర్జాతీయంగా పేద, వర్ధమాన దేశాల్లో భౌగోళిక, రాజకీయ ఘర్షణలకు, శతృత్వాలకు అవకాశం ఉన్న ప్రాంతాల నుంచి ఇతర ప్రాంతాలకు వలసబాట పట్టినవారే. ప్రపంచవ్యాప్తంగా 10కోట్ల మందికి పైగా శరణార్థులు వున్నారని ఒక అంచనా. ఇదేమీ సంబరాలు చేసుకోవాల్సిన అంశం కాదు, బాధపడాల్సిన విషయం. వారిని ఒక అవకాశంగా కాకుండా, ఒక బరువుగా చూస్తున్నారు. ఈ పరిస్థితి మారాలి.

హోండూరస్ మహిళల జైల్లో ఘర్షణలు

- 41మంది మృతి

తెగుసిగల్పా : హోండూరస్‌లోని తమరా వద్ద గల మహిళల జైల్లో మంగళవారం చెలరేగిన ఘర్షణల్లో 41మంది ఖైదీలు మరణించారు.. తొలుత అల్లర్లు, ఆ వెంటనే మంటలు చెలరేగడంతో జైలు ఆవరణలో భయానక పరిస్థితి నెలకొంది. దీనిని సామూహిక నేరంగా భావిస్తున్నామని డిప్యూటీ సెక్యూరిటీ మంత్రి జూలిసా విలనెవా తెలిపారు. జైలులో మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక యంత్రాలు, పోలీసులు, మిలటరీ, ఫోరెన్సిక్ బృందాలు రంగంలోకి దిగాయి. ఈ ప్రాంతం అంతటా అత్యవసర పరిస్థితి విధించారు. మంటలకు ఆహుతి అయిన 25 మంది ఖైదీల మృతదేహాలు గుర్తు పట్టడానికి కూడా వీల్లేని విధంగా ఉన్నాయి. మరో 16మంది మృతదేహాలు బులెట్ గాయాలతో నెత్తురోడుతున్నాయి. జైల్లో వున్న కొందరు ఖైదీలు తమ ప్రత్యర్థులను సెల్స్‌లోపెట్టి నిప్పంటించారని, ఆపైన కాల్పులు కూడా జరిపారని స్థానిక మీడియా తెలిపింది. హోండూరస్ అధ్యక్షుడు జియోమారా కేస్ట్రో ఈ ఘర్షణలను తీవ్రంగా ఖండించారు. ఒక పథకం ప్రకారం జరిగిన భయంకరమైన హత్యలివని వ్యాఖ్యానించారు.

ఆదిత్య ఠాక్రే, సంజయ్ రౌత్ స్నేహితుల ఇళ్లలో ఇడి సోదాలు

ముంబయి : కొవిడ్ సమయంలో ఫీల్డ్ ఆస్పత్రుల కేటాయింపులో జరిగిన అవకతవకలపై విచారణలో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు బుధవారం ముంబయిలోని 15 చోట్ల దాడులు నిర్వహించారు. వీటిల్లో ఐఎఎస్ అధికారి సంజయ్ జైస్వాల్ నివాసం, శివసేన (యుబిటి) నాయకులు ఆదిత్య ఠాక్రేకు అత్యంత సన్నిహితుడిగా పేరున్న సూరజ్ చవాన్ నివాసం కూడా ఉన్నాయి. దీంతోపాటు ఎంపి సంజయ్‌రౌత్ మిత్రుడు సుజిత్ పాట్‌కర్ ఇంట్లో కూడా ఇడి తనిఖీలు చేస్తోంది. కొవిడ్ ఫీల్డ్ ఆస్పత్రి కుంభకోణంలో మనీలాండరింగ్ జరిగిందనే అనుమానంతో ఈ సోదాలు జరుగుతున్నాయి. గతంలో జైస్వాల్ థానే కమిషనర్‌గా విధులు నిర్వహించారు. దీంతోపాటు కొవిడ్ సమయంలో ముంబయి డిప్యూటీ కమిషనర్ పదవిలో కూడా పనిచేశారు.

ఈ కేసుకు సంబంధించి జనవరిలో బిఎంసి కమిషనర్ ఇక్బాల్ సింగ్ చాహల్ వాంగ్మూలాన్ని కూడా రికార్డు చేశారు. ఇక సుజిత్ పాట్‌కర్‌పై గతంలోనే ఇడి మనీలాండరింగ్ అభియోగాలను నమోదు చేసింది. హెల్త్‌కేర్ రంగంలో ఎటువంటి అనుభవం లేకపోయినా.. కొవిడ్ సమయంలో అతడికే ఫీల్డ్ ఆస్పత్రి కాంట్రాక్టు దక్కింది. దీనిపై గత ఏడాదిలో ఆజాద్ మైదాన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందింది.

దీని ఆధారంగా లైఫ్‌లైన్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్, పాట్‌కర్, అతడి ముగ్గురు సన్నిహితులపై కేసులు నమోదు చేశారు. తప్పుడు విధానంలోఫీల్డ్‌ఆస్పత్రుల కాంట్రాక్టులు దక్కించుకొన్నారన్నది వీరిపై ఉన్న ఆరోపణలు.

నైజీరియాకు ఐరాస ఆర్థిక సాయం

న్యూయార్క్ : నైజీరియా ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు. దాంతో ఐక్యరాజ్యసమితి నైజీరియా ప్రజల ఆహారం కోసం 20 మిలియన్ల డాలర్ల అత్యవసర ఆర్థిక సహాయాన్ని అందించింది. ఈ విషయాన్ని ఐక్యరాజ్యసమితి డిప్యూటీ ప్రతినిధి ఫర్హాన్ హక్, సెక్రటరీ జనరల్ ఆంటోనియా గుటెరస్ తెలిపారు. నైజీరియాలో పోషకాహార లోపంతో అక్కడి ప్రజలు బాధపడుతున్నారని, దీంతో అత్యసర ఆహార భద్రతకు, పోషకాహారం కోసం ఐక్యరాజ్యసమితి 20 మిలియన్ డాలర్లను అందజేసినట్లు చెప్పారు. సెంట్రల్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ ఫండ్ నుండి 9 మిలియన్ డాలర్లు, నైజీరియా హ్యూమానిటేరియన్ ఫండ్ నుండి 11 మిలియన్ డాలర్లను కలిపి మొత్తం 20 మిలియన్ డాలర్లను నైజీరియాకు ఐరాస కేటాయించింది. ఇలాంటి సమయంలో నైజీరియాకు ఆహారం, పరిశుభ్రమైన నీరు, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయ మద్దతును కల్పించేందుకు ఈ నిధులు ఉపయోగపడతాయి. కానీ పూర్తిస్థాయి ఆకలి, పోషకాహార లోపాన్ని నివారించడానికి మాత్రం ఈ నిధులు సరిపోవు. వీటిని నివారించడానికి మానవతా భాగస్వాములు మరింత అవసరం అని హక్ తెలిపారు.

చైనా రోదసీ స్టేషన్‌లో ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ ఇంజన్‌కు గ్యాస్ మార్పిడి

బీజింగ్ : చైనా మానవ సహిత టియాంగాంగ్ రోదసీ స్టేషన్‌లో ఇటీవల రోబో చేతి ద్వారా ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ సిస్టమ్‌కు గ్యాస్ సిలిండర్‌ను విజయవంతంగా నెలకొల్పారు. దీనివల్ల అంతరిక్ష కేంద్రం యొక్క కక్ష్య దీర్ఘకాలం సురక్షితంగా, స్థిరంగా మన్నుతుందని భావిస్తున్నారు. ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ ఇంజనులో ప్రొపెల్లెంట్ జెనాన్ గ్యాస్‌కు అనుబంధంగా గ్యాస్‌ను తిరిగి భర్తీ చేయడానికి బదులుగా గ్యాస్ మార్పిడి పద్ధతిని మొదటిసారిగా చైనా ఏరోస్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ కార్పొరేషన్ (సిఎఎస్‌సి) కి చెందిన 801 పరిశోధనా సంస్థ అమలు చేసిందని సంబంధిత సంస్థ మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. మానవ సహిత రోదసీ యాత్ర రంగంలో ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ వ్యవస్థను ఉపయోగించడం ఇదే మొదటిసారని ఆ ప్రకటన తెలిపింది. బయట వైపున గ్యాస్‌బాటిల్‌ను అదనంగా అనుసంధానించడం వల్ల రోదసీ స్టేషన్ ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ వ్యవస్థ లేదా ఇంజను పనిచేసే కాలం గణనీయంగా పొడిగించబడుతుందని ఆ ప్రకటన పేర్కొంది. రోదసీ స్టేషన్‌ను సుదీర్ఘకాలం సురక్షితంగా, స్థిరంగా నిర్వహించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ ఇంజను మొదటగా జెనాన్ వంటి జడ వాయువులను ఛార్జ్‌డ్ అయాన్లుగా మారుస్తుంది. ఆ తర్వాత వేగం పెంచుకుని ఇవి ఒత్తిడిని సృష్టిస్తాయి. దాంతో రోదసీ స్టేషన్ ఎత్తును నియంత్రించడం, కక్ష్యను సరిదిద్దడం, నిర్వహణ వంటి కార్యకలాపాలు నిర్వహిస్తారు.

యోగా అంటే సమైక్యతే !

(మొదటి పేజీ తరువాయి)

మరింత ఒంటరిపాటు చేయాలనే అమెరికా లక్ష్యానికి మోడీ పర్యటన ప్రయోజనం చేకూర్చేలా చర్చలు, భేటీలు ఏర్పాటు చేశారు. సెమీ కండక్టర్ల తయారీలో అమెరికా పెట్టుబడులు పెట్టాలని ఈ సందర్భంగా ప్రధాని మోడీ అమెరికన్ బహుళజాతి సంస్థలను కోరారు. మోడీ గౌరవార్థం అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఆయన భార్య జిల్ బైడెన్ బుధవారం రాత్రి ప్రత్యేక విందు ఇచ్చారు. అధ్యక్షుని నివాసంలో మోడీకి రాత్రి అతిథిగా బస కల్పించారు. అమెరికా కాంగ్రెస్ సంయుక్త సమావేశంలో మోడీ మాట్లాడనున్నారు. భారత్‌తో గరిష్టంగా వాణిజ్యం అక్కడ దక్షిణ, సెంట్రల్ ఆసియా వ్యవహారాల సహాయ విదేశాంగ మంత్రి డొనాల్డ్ లూతో సమావేశమయ్యారు. అనంతరం అమెరికా ప్రథమ మహిళ జిల్ బైడెన్‌తో కలిసి నేషనల్ సైన్స్ ఫౌండేషన్‌ను సందర్శించారు. టెస్లా సిఇఓ ఎలాన్ మస్క్‌తో మోడీ భేటీ అయ్యారు. వచ్చే ఏడాది భారత్‌లో పర్యటిస్తానని, భారత్‌లో పెట్టుబడులు పెట్టడంపై ఆలోచిస్తున్నామని మస్క్ చెప్పారు. ప్రముఖ భారతీయ అమెరికన్లనుద్దేశంచి డయాస్పోరాలో మాట్లాడనుండడం, బైడెన్ ప్రభుత్వ మర్యాదలను చూపి, గ్లోబల్ లీడర్‌గా భారతదేశం ఎలా ఎదిగిందో చూశారా అంటూ గోడీ మీడియా బాకా ఊదుతున్నది.

టాలీ ప్రైమ్ 3.0 విడుదల

హైదరాబాద్ : టాలీ సొల్యూషన్స్ కొత్తగా టాలీ ప్రైమ్ 3.0ను విడుదల చేసింది. దీని ధరను జిఎస్‌టి మినహా రూ.18,000గా నిర్ణయించింది. ఈ కొత్త వర్షన్ బహుళ జిఎస్‌టిఐఎన్ నిర్వహణను అత్యంత సులభతరం చేస్తుందని టాలీ సొల్యూషన్స్ సౌత్ జోన్ జనరల్ మేనేజర్ భువన్ రంజన్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో ఇప్పటికీ 5 లక్షల ఎంఎస్ఎంఇలు మాన్యువల్ విధానాన్ని అనుసరిస్తున్నాయన్నారు. ఒక్క హైదరాబాద్‌లోనే 1.6 క్షల జిఎస్‌టిఎన్ ఎన్‌టిటిలు రిజిస్టర్ అయి ఉన్నాయన్నారు. దీంతో ఇక్కడ విస్తృత అవకాశాలున్నాయని తెలిపారు. తమ వినియోగదారుల కోసం సులభ ఎకౌంటింగ్ విధానాన్ని అందించడానికి ఎప్పటికప్పుడు అనుకూల పరిష్కారాలను తీసుకోవడానికి కట్టుబడి ఉన్నామన్నారు.

ఒఎల్ఎక్స్‌లో 800 మందికి ఉద్వాసన

న్యూఢిల్లీ : ఆన్‌లైన్ మార్కెట్ ప్లేస్ ఒఎల్ఎక్స్ గ్రూప్ భారీ సంఖ్యలో ఉద్యోగులకు ఉద్వాసన పలకడానికి సిద్ధమయ్యింది. దాదాపు 800 మంది సిబ్బందిని ఇంటికి పంపించనున్నట్లు ప్రకటించింది. ఆటోమోటివ్ బిజినెస్ యూనిట్ ఒఎల్ఎక్స్ ఆటోస్ కొన్ని ప్రాంతాల్లో ఒడిదుడుకులతో నడుస్తుండటంతో కంపెనీ వ్యయ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా 1500 మంది ఉద్యోగులను తొలగిస్తుందనే అంచనాల మధ్య తాజా నిర్ణయం వెలుపడింది. ఒఎల్ఎక్స్ గ్రూప్‌లో ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 11,375 మంది పని చేస్తున్నారు. ఉద్వాసనకు గురైన వారికి అవసరమైన సాయం అందిస్తామని తెలిపింది.

LAURUS Labs
Knowledge . Innovation . Excellence

లారస్ ల్యాబ్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: లారస్ ఎన్‌క్లేవ్, ప్లాట్ ఆఫీస్ 01, ఇ. బోనంగి గ్రామం, పరవాడ మండలం, అనకాపల్లి జిల్లా - 531 021, ఆంధ్రప్రదేశ్.
కార్పొరేట్ ఆఫీస్: 2వ అంతస్తు, సెరీన్ ఛాంబర్స్, రోడ్ నెం. 7, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034, తెలంగాణ.
Phone: +91 40 3980 4333; **Fax:** +91 40 3980 4320 | **Email:** secretarial@lauruslabs.com; **Website:** www.lauruslabs.com
కార్పొరేట్ గుర్తింపు సంఖ్య : L24239AP2005PLC047518

కంపెనీ యొక్క 18వ వార్షిక సర్వసభ్య సమావేశం కొరకు ప్రకటన

ఇందుమూలంగా **ప్రకటన** ఇవ్వడమేమనగా, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజి బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) మరియు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ (ఎంసిఏ)చే జారీచేయబడిన సర్క్యులర్స్‌తో చదువబడే దాని క్రింది రూల్స్ మరియు కంపెనీల చట్టం, 2013 యొక్క నియమాలను అనుసరించి నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీస్ లిమిటెడ్ (ఎన్ఎస్‌డిఎల్) ద్వారా సమకూర్చబడు **విడియో కాన్ఫరెన్సింగ్ (విసి) సదుపాయం ద్వారా శుక్రవారం, జులై 14, 2023న మ॥ 03.00 గం.లకు లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ ("ది కంపెనీ")** యొక్క సభ్యుల **పద్దెనిమిదవ వార్షిక సర్వసభ్య సమావేశం** ("ఏజియం" లేదా "సమావేశం") నిర్వహించబడుతుంది.

ఆర్థిక సం॥ 2022-23 కొరకు కంపెనీ యొక్క వార్షిక రిపోర్టుతో పాటు సమావేశంలో సాధారణ మరియు ప్రత్యేక ఐటెంలను సమీక్షించుటకు, ఏదైతే మార్చి 31, 2023తో ముగిసిన సం॥ కొరకు ఆడిటెడ్ స్టాండలోన్ & కన్సాలిడేటెడ్ ఆర్థిక నివేదికలు కలిగియున్న మరియు ఆడిటర్స్ & డైరెక్టర్స్ రిపోర్టు, కార్పొరేట్ గవర్నెన్స్ రిపోర్టు, నోటీసు మొ॥ వాటిని జూన్ 16, 2023 తేది రోజున రిజిస్టర్ ఆఫ్ మెంబర్స్‌లో వున్న సభ్యులకు ఇ-మెయిల్ ద్వారా పంపడమైనది. ఇప్పటికీ వారి ఇమెయిల్ ఐడిలు రిజిస్టరు చేసుకోని వాటాదారులు వారి సదరు డిపాజిటరీ పార్టిసిపెంట్స్‌ను సంప్రదించి ఇమెయిల్ ఐడి రిజిస్టర్ చేసుకోవలసిందిగా కోరబడుచున్నది మరియు నోటీసు మరియు వార్షిక నివేదిక కొరకు కంపెనీకి ఇమెయిల్ పంపిస్తే కంపెనీ దానికి స్పందిస్తుంది. వాటాదారులు తదుపరి వివరాల కొరకు, దినపత్రికల్లో జూన్ 16,2023న కంపెనీచే ప్రచురించబడిన ప్రకటనను చూడవచ్చును.

నోటీసు మరియు వార్షిక నివేదికను మా వెబ్‌సైట్ www.lauruslabs.com నుండి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. ఏజియం వద్ద సమీక్షించు ఐటెంలకు సంబంధించిన ఏవేని పత్రాలను పరిశీలించుట కొరకు, వాటాదారులు secretarial@lauruslabs.com ఇ-మెయిల్‌కి వ్రాయవచ్చును మరియు కంపెనీ వారికి స్పందిస్తుంది.

పైన చెప్పిన సర్క్యులర్ ప్రకారం, రిమోట్ ఇ-ఓటింగ్, విడియో కాన్ఫరెన్సింగ్ (విసి) అదే విధంగా సమావేశం జరుగునప్పుడు ఇ-ఓటింగ్ కొరకు సదుపాయం కల్పించుటకు అధీకృత ఏజెన్సీగా నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీస్ లిమిటెడ్ (ఎన్ఎస్‌డిఎల్) సేవలను కంపెనీ వినియోగిస్తుంది.

సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజి బోర్డ్ ఆఫ్ ఇండియా (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ & డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 44 మరియు కంపెనీస్ (మేనేజ్‌మెంట్ & అడ్మినిస్ట్రేషన్) రూల్స్, 2014 యొక్క రూల్ 20తో చదువబడే కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 108 యొక్క నియమాలను అనుసరించి, కంపెనీ జులై 14,2023న నిర్వహించబడు 18వ ఏజియం యొక్క నోటీసులో ఇచ్చినట్లు వ్యాపార ఐటెంలపై ఎలక్ట్రానిక్ ఓటింగ్ సిస్టమ్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకొనుటకు సభ్యులకు కంపెనీ సదుపాయం కల్పిస్తుంది. సభ్యులు ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానం వినియోగించి వారి ఓట్లను ఏ ప్రదేశం నుండి అయిన వేయవచ్చును (రిమోట్ ఇ-ఓటింగ్). రిమోట్ ఇ-ఓటింగ్ జులై 11, 2023న ఉ॥ 09.00 గం.లకు ప్రారంభమై మరియు జులై 13,2023న సా॥ 05.00 గం.లకు ముగించబడుతుంది. పై సదరు తేది & సమయం దాటిన తరువాత రిమోట్ ఇ-ఓటింగ్ అనుమతించబడదు మరియు రిమోట్ ఇ-ఓటింగ్ మాడ్యూల్ జులై 13, 2023న సా॥ 5గం.ల తరువాత మూసివేయబడుతుంది. కటాఫ్ తేదీ నాటికి అనగా., శుక్రవారం, జులై 07, 2023 నాటికి సభ్యుల రిజిస్టర్ / బెనెఫిషల్ ఓనర్స్ రిజిస్టర్‌లో ఎవరి పేర్లైతే కనిపించునో అట్టి వ్యక్తి మాత్రమే రిమోట్ ఇ-ఓటింగ్ / సమావేశంలో ఇ-ఓటింగ్ సదుపాయం పొందుటకు అనుమతించబడుదురు. ఏజియం నిమిత్తం కంపెనీ యొక్క సభ్యుల రిజిస్టర్ మరియు షేర్ ట్రాన్స్‌ఫర్ బుక్స్ జులై 08, 2023 నుండి జులై 14, 2023 (రెండు రోజులతో సహా) వరకు మూసి ఉంచబడుతాయి.

సమావేశం నోటీసు పంపబడిన తరువాత ఎవరైనా కంపెనీ యొక్క సభ్యుడైన మరియు కటాఫ్ తేదీ నాటికి వాటాలు కలిగియున్న, వారు ఇ-ఓటింగ్ సదుపాయం పొందుట కొరకు వారి సదరు డిపాజిటరీస్‌తో సంప్రదించవచ్చును. ఇ-ఓటింగ్ సదుపాయం పొందుటకు వివరణాత్మక విధానం సమావేశపు నోటీసులో కూడా ఇవ్వబడినవి మరియు కంపెనీ యొక్క వెబ్‌సైట్ పై అందుబాటులో ఉంటుంది.

రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా వారి ఓటువేసిన ఎవరైనా సభ్యులు సమావేశానికి హాజరవచ్చును, కాని సమావేశంలో వారు తిరిగి ఓటువేయుటకు అనుమతించబడరు.

సమావేశం వ్యవధిలో ఇ-ఓటింగ్ కొరకు సదుపాయం అందుబాటులో ఉంటుంది మరియు ఎవరైతే రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా ఓటువేయని సభ్యులు వారి ఓటును సమావేశం కాలవ్యవధిలో వారు వినియోగించుకోవచ్చును.

డిపాజిటరీ అనగా, ఎన్ఎస్‌డిఎల్ మరియు సిడిఎస్ఎల్ ద్వారా లాగిన్‌కు సంబంధించిన ఏవేని సాంకేతిక సమస్యల కొరకు డిమ్యాట్ విధానంలో వాటాలు కలిగియున్న వాటాదారుల కొరకు హెల్ప్‌డెస్క్:

లాగిన్ రకం	హెల్ప్‌డెస్క్ వివరాలు
ఎన్ఎస్‌డిఎల్ తో డిమ్యాట్ విధానంలో వాటాలు కలిగియున్న వాటాదారులు	ఇ-మెయిల్: evoting@nsdl.co.in or టోల్ ఫ్రీ నెం. : 1800 1020 990 కి కాల్ చేయండి
సిడిఎస్ఎల్ తో డిమ్యాట్ విధానంలో వాటాలు కలిగియున్న వాటాదారులు	ఇ-మెయిల్: helpdesk.evoting@cdslindia.com or 022- 23058738 or 022-23058542-43 ను సంప్రదించండి

బోర్డు ఆదేశం మేరకు
లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ తరపున
సం/- **జి. వెంకటేశ్వర్ రెడ్డి**
కంపెనీ సెక్రటరీ & కంప్లైన్స్ ఆఫీసర్

ప్రదేశం : హైదరాబాద్
తేది: 21.06.2023

మీ కోసం

గ్లాసులో ముందు పంచదార వేసి ఆ తరువాత పాలల్లో కలుపుకునే పౌడర్ వేస్తే పాడి త్వరగా కరుగుతుంది. గ్లాసుకు అంటుకోదు.

జీవన సౌరభం

మన ఆలోచనా సరళే మనం చేసే పనులను నిర్ణయిస్తుంది.

కరగనీకు ఈ కొండను

కరగనీకు ఈ కొండను
కరగనీకు ఈ గుర్తును
కరగనీకు ఈ మూర్తిని!

కరుగుతాయి చెట్టు కాళ్ళ
కరుగుతాయి పిట్టగూళ్ళ
కరుగుతాయి మందిరాలు
కరుగుతాయి నందనాలు!

కదలిరావు మేఘాలు
కలసిరావు జలధరాలు
కనుమరుగౌ వాయువులు
కంటకమౌ కిరణాలు!

కనిపించని సింహాలు
కనిపించని కరిమూకలు
కనిపించని హరిణాలు
కనిపించని వానరాలు

కదిలే సెలయేళ్ళేవీ?
కడిగే జలపాతమేది ?
కలకోకిల కంఠమేది?
కనబడునా కేకి వేది?

కరగనీకు కొండలను
కరగనీకు గుండెలను
కఠిన చిత్తమును వీడి
కదలండోయ్ రక్షకు!

- కిలపర్తి దాలినాయుడు



తేడాలు గుర్తించండి

పిల్లలూ! ఈ చిత్రంలో తేడాలు ఐదు ఉన్నాయి. అవి ఏంటో గుర్తించండి.

ఖాళీలు పూరించండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు, వాటి పక్కనే వాటి పేర్లూ ఉన్నాయి. అయితే, స్పెల్లింగ్‌లో కొన్ని అక్షరాలు లేవు. వాటిని నింపండి.



నేను గీసిన బొమ్మ



- బి.తరణి శ్రీ,
5వ తరగతి,
భాష్యం బ్లూమ్స్ స్కూలు,
ప్రగతి నగర్,
హైదరాబాద్,
తెలంగాణ.

మూడేళ్ల లోపు పిల్లలకు నీరు, ఆహారం వంటి వాటిని సమయానికే సమకూరుస్తారు చాలామంది తల్లిదండ్రులు. ఇక వయసు పెరిగేకొద్దీ తమకు ఏం కావాలో పిల్లలే అడుగుతుంటారు. కానీ చాక్లెట్లు, బిస్కెట్లు, ఐస్‌క్రీం అడిగినంత ఉత్సాహంగా దాహంగా ఉందని, ఆకలి వేస్తుందని మాత్రం అనరు. అంతేకాదు.. ఒక్కోసారి పిల్లలు విచిత్రంగా మారిపోతుంటారు. అప్పటివరకు ఆడుకుంటున్న వారైనా ఒక్కసారి ఏడుపులంకించుకుంటే ఒక పట్టాన వదలరు. ఎవరైనా కొట్టారో.. తిట్టారో కూడా చెప్పరు. మరి అలాంటి భిన్న మనస్తత్వాలున్న పిల్లలతో ఎలా ప్రవర్తించాలి? పిల్లల మూడ్స్‌ను అర్థం చేసుకుంటేనే అది వారి పెరుగుదలకు దోహదపడుతుందని ఎంతమంది తల్లిదండ్రులకు తెలుసు?

పిల్లల భావోద్వేగాలు పట్టించుకోండి..

పదే పదే ఏడుస్తున్న పిల్లలతో 'ఎప్పుడూ నీది ఏడుపుకొట్టు ముఖమే' అనే తల్లిదండ్రులు చాలామందే ఉంటారు. అలాగే తరచూ అనారోగ్యం బారిన పడే పిల్లలతో కూడా కొంతమంది 'నీకు రోగం లేని రోజంటూ ఉందా' అనడం కూడా వింటుంటాం. పిల్లల ప్రవర్తన, స్థితిని బట్టి అనవసర లేబుల్స్ వేయడం చాలా ప్రమాదం. అది మానసికంగా వారిని కుంగదీస్తుంది. తమ శక్తి సామర్థ్యాలను అంచనా వేసుకోలేరు.

'మా రోజుల్లో పిల్లలు ఇలా లేరు.. మేము మా అమ్మానాన్న చెప్పినట్లు వినేవాళ్లం. వాళ్లు ఏం పెడితే అది తినేవాళ్లం. వంకలు అసలు పెట్టేవాళ్లం కాదు. మీకు అన్నీ సమకూర్చిపెడుతుంటే ఏం తెలియడం లేదు. ఇష్టానుసారం చేస్తున్నారు' అంటూ పిల్లలను విసుక్కోవడం చాలామంది ఇళ్లల్లో వినిపిస్తుంది. ఆ మాటలు అంటున్నప్పుడు ఒక్కసారి పిల్లల ముఖాలు చూడండి. మనం ఏం అంటున్నామో. ఆ మాటలకు అర్థాలు ఏంటో కూడా వాళ్లకు తెలియవు. బిక్కచచ్చిన ముఖాలతో భయంభయంగా చూస్తూ ఉంటారు.

కోపం, దు:ఖం, సంతోషం, ఆనందం, విచారం, ఒత్తిడి, ఆత్మస్థైర్యం, నిరాశ, అసహనం వంటివి పెద్దల్లోనే కాదు పిల్లల్లో ఉండే సహజ లక్షణాలు కూడా. వాటినేమీ పట్టించుకోకుండా మీ పాటికి మీరు పిల్లలపై అరుస్తూ.. తిడుతూ.. కోప్పడుతూ ఉంటే వారి భావోద్వేగాలు మీకు ఎలా అర్థమౌతాయి. ఆకలిగా ఉందని, దాహంగా ఉందనే కాదు.. ఈ పని చేయడం వల్ల నాకు చాలా కోపంగా ఉందని, బాధగా ఉందని, భయమేస్తుందని కూడా పిల్లలు చెప్పలేరు. తల్లిదండ్రులుగా వారి మూడ్స్‌ను మీరే అర్థం చేసుకోవాలి.

'అమ్మానాన్న నేను చెప్పే విషయాలు ఓపిగ్గా వింటారు. నా మాటలను పట్టించుకుంటారు' అన్న భావన పిల్లల్లో కలిగించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. అలా చేస్తే.. ఏ విషయమైనా తల్లిదండ్రులతో పంచుకునేందుకు పిల్లలు సంకోచించరు.

ఇప్పుడు స్కూళ్లు తెరిచారు కదా. ఆటోలోనో, బస్సులోనో పిల్లలను ఒంటరిగా స్కూలుకు పంపిస్తుంటాం. అసలే రోజులు బాగోలేవు.. ఆడపిల్లలు, మగపిల్లలు అన్న తేడా లేకుండా అఘాయిత్యాలు జరుగుతున్నాయి. మొన్నీమధ్య హైద్రాబాద్‌లో ఓ స్కూల్లో ఆరేళ్ల పసిపిల్లపై డ్రైవరు చేసిన దారుణం మన కళ్ల ముందే ఉంది. ఆ ఉదంతం వెలుగుచూశాకే తమ పిల్లలపై కూడా దాడులు జరిగినట్లు చాలామంది పిల్లల తల్లిదండ్రులు బయటికి వచ్చారు. అసలు పరిస్థితి అంతవరకు రానీయొద్దు. ఏదైనా అమానవీయ ఘటనో.. అసాధారణ పరిస్థితో తమకు ఎదురైందని ఘటన జరిగిన వెంటనే స్వేచ్ఛగా చెప్పే ధైర్యం పిల్లల్లో కలిగించాలి. ఆ భావన రావాలంటే పిల్లల భావోద్వేగాలను పట్టించుకోవాలి. వారి భావాలను అర్థం చేసుకోవాలి.

ప్రతిరోజూ ఆకుకూరలు తీసుకుంటే ...

ఎండాకాలంలో జీర్ణశక్తి సమస్యలు తలెత్తుతాయి. అధిక వేడితో అనారోగ్యం ముంచుకొస్తుంది. కానీ, ఈ కాలంలో లభించే ఆకు కూరలు ఆరోగ్యానికి మేలుచేస్తాయంటున్నారు నిపుణులు. గోంగూర, తోటకూర, పాలకూర, బచ్చలి, మెంతికూరల్లో లభించే అనేక రకాల ఖనిజ లవణాలను, విటమిన్లను ప్రోటీన్లు శరీరానికి శక్తిని అందిస్తాయి. జీవనశైలి సక్రమంగా నడిచేలా చేస్తాయి.

- ఎండ తీవ్రత వల్ల శరీరం డీహైడ్రేషన్‌కు గురవుతుంది. కానీ ఆకుకూరల్లో ఉన్న నీరు, ఖనిజ పోషకాలు, ఇనుము ధాతువులు శరీరానికి సరిపడ నీటిశాతాన్ని తిరిగి అందించి కాపాడుతుంది.
- ఆకుకూరల్లో పోషక పదార్థాలు సమృద్ధిగా ఉంటాయి. అందుకే శరీర పెరుగుదల, దృఢత్వానికి, చాలా మేలు చేస్తాయి.
- ఆకుకూరల్లో కాల్షియం, బీటాకెరోటిన్, విటమిన్ - సి కూడా పుష్కలంగా ఉంటాయి. మెదడుకు సరైన సంకేతాలు అందించడంలో ఇవి సహాయపడతాయి. ఆకుకూరల ద్వారా లభించే కెరోటిన్ శరీరంలో విటమిన్-ఎగా మారి అంధత్వం రాకుండా చేస్తుంది.
- ఆకుకూరల్లో కెలోరీలు, కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉంటాయి. ప్రతిరోజూ ఏదో ఒక ఆకుకూర తీసుకొనే వారిలో మధుమేహం, రక్తపోటు పెరిగే ప్రమాదం తగ్గుతుందని వైద్యులు అంటున్నారు.
- ఆకుకూరల్లో కాల్షియం, పాస్ఫరస్, కెరోటిన్, థయమిన్, నియాసిన్ ఉండి జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తాయి. తిన్న గంటకే కిలో కేలరీల శక్తి విడుదలవుతుంది. దాంతో నీరసం తగ్గిపోతుంది.

గొంతు గర గర పోవాలంటే ...

గొంతులో గరగరగా ఉందంటే మన శరీరంలోకి ఏవో బ్యాక్టీరియా ప్రవేశిస్తోందని, వాటిపై మన రోగ నిరోధక శక్తి పోరాడుతోందని అర్థం చేసుకోవాలి. జలుబు, జ్వరం, అలర్జీలు, కాలుష్యం, పొగ వంటివి గొంతు గరగరకు దారితీస్తాయి. గర గర నుండి ఉపశమనం కోసం ఇలా చేసి చూడండి..

- గోరు వెచ్చని పాలలో అర టీ స్పూన్ పసుపు వేసి తాగాలి. ఇలా చేస్తే గొంతులో గరగర మాయమవ్వడమే కాక, గొంతులో హాయిగా అనిపిస్తుంది కూడా.
- అల్లాన్ని పేస్ట్ చేసి, దాల్చిన చెక్కను పొడి చేసి, వాటితో టీ పొడి కలిపి టీ పెట్టుకొని తాగాలి. ఇలా రోజుకు మూడుసార్లు చేస్తే ఫలితం కనిపిస్తుంది.
- అల్లాన్ని మెత్తగా నూరి, టీలో కలిపి ఐదు నిమిషాలు మరిగించి తాగినా మంచి ఫలితం ఉంటుంది.
- పుదీనా ఆకుల్ని నీటిలో వేసి ఐదు నిమిషాలు మరిగించి... ఆకులు తీసివేసి... ఆ నీళ్లు తాగాలి.

కరణ్ జోహార్‌కు అరుదైన గౌరవం

బాలీవుడ్ దర్శక-నిర్మాత కరణ్ జోహార్ అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. దాదాపు రెండున్నర దశాబ్దాలుగా ప్రపంచ సినిమాకు కరణ్ అందిస్తోన్న సేవలను గుర్తించిన యూకే ప్రభుత్వం ఆయన్ని సన్మానించింది. ఈ మేరకు చట్టసభ సభ్యుల సమక్షంలో బ్రిటిష్ పార్లమెంట్ ఆయన్ని సత్కరించింది. దీనికి సంబంధించిన ఫొటోలను కరణ్ ట్విటర్ వేదికగా షేర్ చేశారు. "ఈరోజు నాకెంతో ప్రత్యేకం. లండన్‌లోని యూకే పార్లమెంట్ వేదికగా గౌరవనీయులైన భరోనెస్ వర్మ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. నాపై ప్రేమాభిమానాలు కురిపిస్తోన్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. నా నుంచి మరెన్నో మంచి సినిమాలు రానున్నాయని మాటిస్తున్నా' అని తెలిపారు. 'కుచ్ కుచ్ హెూతా హై', 'కభీ ఖుషీ కభీ గమ్', 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్', 'బాంబే టాకీస్' వంటి కుటుంబ, యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్స్‌ను కరణ్ తెరకెక్కించారు. ఏడేళ్ల తర్వాత ఆయన తెరకెక్కించిన సరికొత్త చిత్రం 'రాఖీ ఔర్ రాణి కీ ప్రేమ్ కహానీ'. రణ్‌వీర్ సింగ్, అలియాభట్ నటించిన సినిమా త్వరలో యూకేతోపాటు ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

పది సినిమాలు చేసి గుడ్ బై చెబుతాను

'నాకు నచ్చిన కథలను చెప్పాలనే ఇక్కడకు వచ్చా. తొలుత షార్ట్‌ఫిల్మ్స్ ద్వారా నా టాలెంట్‌ను నిరూపించుకున్నా. పది సినిమాలు మాత్రమే చేయాలనుకుంటున్నా. ఆ తర్వాత ఇండస్ట్రీకి గుడ్‌బై చెబుతా' అని లోకేష్ కనకరాజ్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఇంకా సుదీర్ఘమైన ప్రణాళికలతో తాను ఇండస్ట్రీలోకి రాలేదని, హాలీవుడ్ దర్శకుడు క్వింటెన్ టరెంటీనో మాదిరిగా పది చిత్రాలను డైరెక్ట్ చేసి సినీరంగం నుంచి తప్పుకుంటానని తెలిపారు. దక్షిణాది చిత్రసీమలో ప్రతిభావంతులైన దర్శకుల్లో ఒకరైన లోకేష్ 2017లో 'మానగరం' ద్వారా దర్శకుడిగా పరిచయమై కేవలం ఐదేళ్లలోనే దేశ వ్యాప్తంగా పాపులర్ అయ్యారు. 'ఖైదీ', 'మాస్టర్', 'విక్రమ్' చిత్రాలతో ప్రేక్షకులను మెప్పించిన లోకేష్ తాజాగా విజయ్‌తో 'లియో' సినిమా తెరకెక్కిస్తున్నారు.

'భాగ్ సాలే' : వజ్రం చుట్టూ తిరిగే కథ

శ్రీసింహా కోడూరి, నేహా సోలంకి హీరోహీరోయిన్లుగా నటించిన తాజా చిత్రం 'భాగ్ సాలే'. ప్రణీత్ బ్రాహ్మండపల్లి దర్శకత్వంలో క్రైమ్ కామెడీగా తెరకెక్కిన ఈ సినిమా జులై 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా 'వరల్డ్ ఆఫ్ భాగ్ సాలే' పేరుతో ఓ వీడియో గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. సిద్ధు జొన్నలగడ్డ వాయిస్ ఓవర్‌తో ఆ వీడియో మొదలైంది. స్వాతంత్ర్యం రాకముందు ఇండియాలో దొరికిన ఓ వజ్రం అన్ని దేశాలు తిరిగి.. ఒక ముక్క నైజాం రాజు వద్దకు వస్తుంది. దాన్ని నైజాం రాజు ఉంగరంగా మార్చుకొని వేలికి పెట్టుకుంటే.. ఆ ఉంగరాన్ని కొట్టేసిన ఓ ఫ్యామిలీ అంటూ వీడియో సాగింది. సురేష్ బాబు సమర్పణలో వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై బిగ్ బెన్, సినీ వ్యాలీ మూవీస్ వారి అసోసియేషన్‌తో అర్జున్ దాస్యన్, యష్ రంగినేని, కళ్యాణ్ సింగనమల నిర్మిస్తున్న ఈ సినిమాలో జాన్ విజయ్, రాజీవ్ కనకాల, వెన్నెల కిషోర్, తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. కాలభైరవ సంగీతాన్ని అందిస్తున్నారు.



'కంగువ' లో అవినాష్

హీరో సూర్య, దిశా పటాని హీరోయిన్‌గా దర్శకుడు శివ తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'కంగువ'. ఈ భారీ చిత్రం షూటింగ్ ఇప్పుడు శరవేగంగా కంప్లీట్ అవుతుంది. తాజాగా ఈ సినిమాలో ముఖ్య పాత్రలో నటిస్తున్న నటుడు గురించి మేకర్స్ సమాచారం ఇచ్చారు. వాల్తేరు వీరయ్య, వీర సింహా రెడ్డి చిత్రాల్లో విలన్‌గా కనిపించిన ప్రముఖ నటుడు బి ఎస్ అవినాష్ ఈ చిత్రంలో కూడా కీలక పాత్రలో చేయనున్నారు. ఇక ఈ చిత్రానికి అయితే దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ వారు భారీ బడ్జెట్‌తో సినిమాని నిర్మిస్తున్నారు.

చంద్రముఖి-2 ముగించేశారు

రజినీకాంత్ హీరోగా నటించిన చంద్రముఖి చిత్రానికి సీక్వెల్ ప్రకటించి చాలా రోజులైంది. తాజా సమాచారం ప్రకారం ఆ చిత్ర షూటింగ్ పూర్తిచేసినట్లు తెలుస్తోంది. వాసు దర్శకత్వంలో రాఘవ లారెన్స్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన ఈ చిత్ర యూనిట్ అంతా కలిసి సోషల్ మీడియాలో తాజాగా ఓ ఫోటో షేర్ చేశారు. వడివేలు, కంగనా రనౌత్ ఇతర కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి ఎం ఎం కీరవాణి సంగీతం అందించగా లైకా ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్ తో నిర్మాణం వహించింది.

ఎసిసి ఎమర్జింగ్ మహిళల ఆసియాకప్

టైటిల్ విజేత భారత్

- **ఫైనల్లో బంగ్లాదేశ్‌పై 31పరుగుల తేడాతో గెలుపు**

హాంకాంగ్: ఎసిసి ఎమర్జింగ్ ఆసియాకప్ టైటిల్‌ను భారత(అండర్-23) మహిళలజట్టు కైవసం చేసుకుంది. బుధవారం జరిగిన ఫైనల్లో భారత మహిళలజట్టు 31పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 127పరుగులే చేయగల్గింది. దినేశ్ బ్రిందా(36) టాప్ స్కోరర్. కనిక అహూజ(30) ఫర్వాలేదనిపించింది. ఛేదనలో బంగ్లాజట్టును స్పిన్నర్లు శ్రేయాంక పాటిల్, మన్నత్ కశ్యప్ బౌలింగ్ మాయాజాలానికి 19.2ఓవర్లలో 96పరుగులకు కుప్పకూలింది. పాటిల్(4/13), కశ్యప్(3/20) బౌలింగ్‌లో మెరిసారు. వీరిద్దరూ 7వికెట్లు పడగొట్టి బంగ్లాదేశ్‌ను కట్టడి చేశారు. ఆఫ్ స్పిన్నర్ కనిక అహూజా(2/23) రాణించింది. బంగ్లా బ్యాటర్ నహిదా అక్కర్(17నాటౌట్) టాప్‌స్కోరర్. మొత్తం 8జట్లు టైటిల్‌కై పోటీపడగా.. భారీ వర్షాల కారణంగా టోర్నమెంట్ 8 మ్యాచ్‌లు రద్దయ్యాయి. భారతజట్టు లీగ్ దశలో హాంకాంగ్‌పై 9వికెట్ల తేడాతో గెలుపొందగా.. శ్రీలంకతో జరగాల్సిన సెమీస్ మ్యాచ్ వర్షం కారణంగా తుడిచిపెట్టుకుపోయింది. దీంతో మెరుగైన రన్‌రేట్‌తో భారత్ ఫైనల్‌కు చేరింది. మరోవైపు బంగ్లాదేశ్ జట్టు లీగ్‌లో మలేషియాపై 97పరుగులతో, సెమీస్‌లో పాకిస్తాన్‌పై 6వికెట్ల తేడాతో గెలిచి ఫైనల్‌కు చేరింది.

డేవిస్‌కప్ తర్వాత టెన్నిస్‌కు గుడ్‌బై: బొప్పన్న

సెప్టెంబర్‌లో మొరాకోతో జరిగే మ్యాచ్ చివరిదంటూ ట్వీట్

బెంగళూరు: భారత టెన్నిస్ డబుల్స్ స్పెషలిస్ట్ ఆటగాడు రోహన్ బొప్పన్న డేవిస్ కప్ కెరీర్‌కు గుడ్‌బై చెప్పనున్నట్లు ప్రకటించాడు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో మొరాకోతో జరిగే డేవిస్ కప్ చివరిదంటూ బుధవారం ట్వీట్ చేశాడు. అదే తన ఆఖరి ఫేర్‌వెల్ మ్యాచ్ ట్వీట్‌లో పేర్కొన్నాడు. వీడ్కోలు మ్యాచ్‌ను బెంగళూరులో ఆడాలని నిర్ణయించు కున్నా.. డేవిస్ కప్‌కు ఉత్తరప్రదేశ్ ఆతిథ్యమిస్తున్న నేపథ్యంలో స్వంత మైదానంలో వీడ్కోలు పలికే అవకాశాన్ని కోల్పోయినట్లు తెలిపాడు. ఈమేరకు కర్ణాటక స్టేట్ లాన్ టెన్నిస్ అసోసియేషన్(కెఎస్‌ఎల్‌టిఎ) సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ విషయాన్ని ఆలిండియా టెన్నిస్ సమాఖ్య(ఎఐటిఎ) ధృవీకరించింది. ఇక డేవిడ్ కప్ ప్రపంచకప్ గ్రూప్-2 పోటీలు భారత్-మొరాకో జట్ల మధ్య ఈ ఏడాది సెప్టెంబర్‌లో మ్యాచ్‌లు జరగనున్నాయి. 43ఏళ్ల బొప్పన్న 2002నుంచి 32సార్లు డేవిస్ కప్ మ్యాచుల్లో ఆడాడు. లండన్‌లో సాధన చేస్తున్న బొప్పన్న ట్విటర్ వేదికగా తన నిర్ణయాన్ని తెలిపారు. డేవిస్ కప్‌లో భారత్ తరపున అత్యధికసార్లు ఆడిన రికార్డు లియాండర్ పేస్(58సార్లు) ఉండగా.. ఆ తర్వాత జయదీప్ ముఖర్జీ(43), రామనాథన్ కృష్ణన్(43), ప్రేమ్‌జిత్ లాల్(41), ఆనంద్ అమృత్‌రాజ్(39), మహేష్ భూపతి(35) రోహన్ బొప్పకంటే ముందున్నారు. డేవిస్ కప్ కెరీర్‌లో బొప్పన 12 సింగిల్స్, 10డబుల్స్ మ్యాచుల్లో విజయం సాధించాడు. గత ఆరు డేవిస్‌కప్‌లలో భారతజట్టు నాలుగుసార్లు గ్రూప్ దశను దాటలేకపోయింది.

ఛెత్రీ హ్యాట్రిక్

శాఫ్ ఛాంపియన్‌షిప్‌లో పాకిస్తాన్‌పై గెలుపు

బెంగళూరు: శాఫ్ ఛాంపియన్‌షిప్‌లో భారత ఫుట్‌బాల్ జట్టు ఘన విజయం సాధించింది. బెంగళూరులోని శ్రీ కంఠీరవ స్టేడియంలో పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో కెప్టెన్ సునీల్ ఛెత్రీ హ్యాట్రిక్ గోల్స్‌తో మెరిసాడు. దీంతో భారతజట్టు 4-0గోల్స్‌తేడాతో పాకిస్తాన్‌ను ఓడించింది. తొలి అర్ధభాగం ముగిసే సమయానికే భారత్ 2-0గోల్స్ ఆధిక్యతలో నిలిచింది. తొలి అర్ధభాగంలో రెండు గోల్స్ కొట్టిన ఛెత్రీ.. రెండో అర్ధభాగం 74వ ని.లో మరో గోల్ కొట్టి హ్యాట్రిక్ గోల్స్ చేశాడు. 81వ ని.లో అన్వర్ మరో గోల్ కొట్టి భారత్ ఆధిక్యాన్ని 4-0కు పెంచాడు. హ్యాట్రిక్‌తో ఛెత్రీ అంతర్జాతీ యంగా అత్యధిక గోల్స్ కొట్టిన ఆటగాళ్ల జాబితాలో 4వ స్థానానికి ఎగబాకాడు. ఆసియాఖండంలో ఛెత్రీ 138మ్యాచుల్లో 90గోల్స్‌తో ప్రథమస్థానంలో కొనసాగుతుండగా.. మొక్తర్ దహరి(మలేషియా) 89గోల్స్‌తో రెండోస్థానంలో ఉన్నాడు.

టాప్-5 గోల్ స్కోరర్స్..

1. **క్రిస్టియానో రొనాల్డో(పోర్చుగల్) 200మ్యాచుల్లో 123గోల్స్**
2. **అలీ డెయి(ఇరాన్) 148మ్యాచుల్లో 109గోల్స్**
3. **లియొనెల్ మెస్సీ(అర్జెంటీనా) 173మ్యాచుల్లో 103గోల్స్**
4. **సునీల్ ఛెత్రీ(భారత్) 138మ్యాచుల్లో 90గోల్స్**
5. **మొక్తర్ దహరి(మలేషియా) 142మ్యాచుల్లో 89గోల్స్**

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68